ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

మహబూబ్‌నగర్

fb.com/vaartha Digital






Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

15-1-2026 గురువారం సంపుటి: 31 సంచిక: 345 పేజీలు: 10+4 వెల: 6.50







## శుభాకాంక్షలు

మకర సంక్రాంతి సందర్భంగా మా పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు
-డాక్టర్ గిరీష్ కుమార్ సంఘీ
వార్త' చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్

## సెలవు

పండుగ సందర్భంగా గురువారం వార్త కార్యాలయానికి సెలవు. శుక్రవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం 17వ తేదీ శనివారం

### 18న మేడారంలో

# కేబినెట్

### 16నుంచి జిల్లా పర్యటనలు, విదేశ పర్యటనలతో సిఎం రేవంత్ బిజీబిజీ

### 19 నుంచి దావోస్ యాత్ర, 24న అమెరికా పర్యటన, ఫిబ్రవరి 1న తిరిగి రాక



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 14:** ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 1 వరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి షెడ్యూల్ బిజీ బిజీగా గడవనుంది. ఈ నెల 16న ఉమ్మడి ఆదిలాబాద్, 17న మహబూబ్ నగర్, 18న ఉమ్మడి ఖమ్మంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ పర్యటనల ద్వారా మున్సిపల్ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయనున్నారు. 18న మేడారంలో కుటుంబంతో బస, 19న సమ్మక్క-సారలమ్మను దర్శించుకోనున్నారు. అదేరోజు రాత్రి దావోస్ పర్యటనకు వెళ్లారు. 24న దావోస్ నుంచి అమెరికా పర్యటనకు వెడతారు. అక్కడ వారం రోజులపాటు ఉండి ప్రముఖ ఐటీ కంపెనీల సీఈవోలు, పారిశ్రామిక దిగ్గజాలు, ఎన్‌ఆర్‌ఐ ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహించనున్నారు. ముఖ్యంగా బోస్టన్ >>2



బుధవారం న్యూఢిల్లీలో పొంగల్ వేడుకల్లో పాల్గొన్న ప్రధాని మోడీ

# పొంగలో పొంగల్

### ఢిల్లీలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో పొంగల్ వండిన ప్రధాని మోడీ

### కేంద్ర మంత్రి మురుగన్ నివాసంలో వేడుకలకు హాజరు

### సంప్రదాయ వేషధారణతో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్ నాయుడు తదితరులు

**న్యూఢిల్లీ, జనవరి 14:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ బుధవారం స్వయంగా పొంగల్ తయారుచేశారు. పొంగల్ వేడుకలకు హాజరైన అతిథులందరికీ పొంగల్ రుచి చూపించారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి మురుగన్ నివాసంలో నిర్వహించిన పొంగల్ వేడుకల్లో ప్రధాని మోడీ ప్రత్యేకంగా పాల్గొన్నారు. అతిథిగా వెళ్లినప్పటికి భోగి పండుగ ప్రత్యేక వంటకం 'పొంగల్'ను ఎలా వండుతారో అడిగి తెలుసుకుని, అక్కడే తయారు చేసి తనతోపాటు వచ్చిన కేంద్ర మంత్రులు, వివిధ పార్టీల నేతలకు పొంగల్ రుచి చూపించారు. ఈ సందర్భంగా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు తనదైన శైలిలో గౌరవం తెలియజేస్తూ, ప్రధాని స్వయంగా గోవులకు పూజలు నిర్వహించి, పొంగలి వండి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కేంద్ర మంత్రులు, ప్రముఖుల హాజరు ఈ పొంగల్ వేడుకల్లో కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు సహా పలువురు ఎంపీలు, ప్రముఖ నేతలు, సాంస్కృతిక రంగ ప్రతినిధులు పాల్గొన్నారు. సంప్రదాయ వేషధారణ, తమిళ సాంస్కృతిక వాతావరణం ఈ వేడుకలకు ప్రత్యేక >>2




## హోరెత్తిన సంక్రాంతి సంబురాలు

### ఆనందోత్సాహాలతో భోగి వేడుకలు

### ఆకట్టుకొన్న గంగిరెద్దులు, హరిదాసుల సందడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 14:** సరికొత్త ఆశలతో తెలంగాణ రాష్ట్రవాసులు ఉత్తరాయణానికి స్వాగతం పలికారు. భోగి మంటల కాంతుల నడుమ సంక్రాంతి సంబరాలకు నాంది పలికారు. సకల భోగభాగ్యాలను ప్రసాదించే భోగి పర్వదిన వేడుకలు బుధవారం ఊరువాడా ఘనంగా జరిగాయి. తెల్లవారుజామునే చిన్నాపెద్దా భోగిమంటల చుట్టూ చేరి అంతా మంచి జరగాలని ప్రార్థించారు. రాష్ట్రంలోని లోగిళ్లన్నీ భోగి సందడితో కళకళలాడుతున్నాయి. హైదరాబాద్ రాయదుర్గం >>2



## ప్రజలు పల్లెబాటతో బోసిపోయిన గ్రేటర్

### ఐదు రోజులుగా విజయవాడ జాతీయ రహదారిపై కొనసాగుతున్న రద్దీ

**హైదరాబాద్, జనవరి 14, ప్రభాత వార్త:** తెలుగు రాష్ట్రాలకు సంక్రాంతి శోభ రావడంతో పట్నాలలో వుంటున్న ప్రజలు పల్లెబాట పట్టడంతో రెండు రోజులుగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని రహదారులు వాహనాల రద్దీ లేక బోసిపోయాయి. ఎపితో పాటు తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు సైతం హైదరాబాద్‌ను వీడి తమ పల్లెలకు పయనమవడంతో గ్రామీణ ప్రాంతాలలో వాహనాల రద్దీ పెరగగా ఐదు రోజులుగా విజయ వాడ జాతీయ రహదారిపై కొనసాగుతున్న వాహనాల రద్దీ బుధ వారం రాత్రి వరకు అలాగే కొన సాగింది. సంక్రాంతి పండగవేళ హైదరాబాద్‌లో వుంటున్న ప్రజల ు ఎపితో పాటు తెలంగాణలోని తమ సొంత ఊళ్లకువెళ్లడం తెలిసిందే. మామూలుగా అయితే పండగకు 2 రోజులముందు ఈ ప్రయాణాలు సాగుతుంటాయి. ఈ సారి ముందుగానే >>2

## శబరిమలలో మకరజ్యోతి దర్శనం

### జ్యోతి వీక్షించేందుకు భారీగా పోటెత్తిన భక్తజనం

3

# ఇద్దరు జర్నలిస్టుల అరెస్టు



### తప్పుచేయనప్పుడు భయమెందుకు?

### విచారణకు పిలిస్తే రావాలి కదా!

### దాక్కుంటే సరిపోతుందా?

### సిటీ కొత్వాల్ సజ్జనార్

**హైదరాబాద్, జనవరి 14, ప్రభాత వార్త:** మహిళా ఐఎఎస్ అధికారిపై అసత్య ప్రచారం చేసిన ఎన్‌టివి ఛానల్‌కు చెందిన ఇద్దరు జర్నలిస్టుల అరెస్టుపై సిటీ కొత్వాల్ సజ్జనార్ మీడి యాతో మాట్లాడుతూ విలేఖరులు తప్పు చేయనపుడు ఎందుకు భయపడాలని >>2

### మహిళా ఐఎఎస్ అధికారిపై ప్రసారం చేసిన వివాదాస్పద కథనాలపై ఎన్టీవీ ఇన్‌పుట్ ఎడిటర్, మరో ఇద్దరు జర్నలిస్టులను అరెస్టు చేసిన పోలీసులు

### ఛానెల్‌కు చెందిన మరో జర్నలిస్టును ప్రశ్నించి పంపించిన వైనం

### మరో ఏడు యూట్యూబ్ ఛానెల్లపై కూడా కేసులు

### ఘటనను ఖండించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కెటిఆర్, హరీష్ రావు, ఎపి మాజీ సిఎం జగన్, పలువురు నేతలు

**హైదరాబాద్, జనవరి 14, ప్రభాతవార్త:** మహిళా ఐఎఎస్ అధికారిపై అసత్య కథనాలు ప్రసారం చేసిన ఉదంతంపై నమోదైన కేసులో ఎన్‌టివి ఇన్ పుట్ ఎడిటర్ దొంతు రమేష్, మరో జర్నలిస్టు సుధీర్‌ను సిసిఎస్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఇందులో దొంతు రమేష్ విదేశాలకు వెళ్ల బోతుంటే శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకోగా సుధీర్‌ను ఆయన ఇంటివద్ద అరెస్టు చేశారు. ఇంకో జర్నలిస్టు పరిపూర్ణచారిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నా విచారణ అనంతరం వదిలేశారు. ఇద్దరు జర్నలిస్టుల అరెస్టు నాటకీయ పక్కీలో జరిగింది. దీంతో పాటు ఎన్‌టి వి ఛానల్ కార్యాలయంలోనూ జర్నలిస్టుల ఇళ్లలోనూ పోలీసులు సోదాలు నిర్వహించారు. సోదాల సందర్భంగా కంప్యూటర్లతో పాటు హార్డ్ డిస్క్‌ల ను పోలీసులు పరిశీలించారు. అనంతరం ఎన్‌టివి ఛానల్ కార్యాలయం నుంచి సిపియును జప్తు చేశారు. కాగా అరెస్టయిన ఇద్దరు జర్నలిస్టులకు వైద్య పరీక్షలు నిర్వహించిన పోలీసులు తిరిగి సిసిఎస్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. కాగా మహిళా ఐఎఎస్ అధికారితో పాటు సిఎం రేవంత్ రెడ్డి ఫోటోలను అసభ్యకరంగా పోస్టు చేసిన వ్యవహారంలో పబ్లిక్ టివి వాట్సాప్ గ్రూప్ నిర్వాహకుడు కావలి వెంకటేష్‌పై మద్దూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదవడం తెలిసిందే. కాంగ్రెస్ నేత గూళ్ల నరసింహా ఇచ్చిన ఫిర్యాదుపై ఈ నెల 11వ తేదీన ఈ కేసు నమోదయ్యింది. దీంతో పాటు మహిళా ఐ ఎఎస్ అధికారిని కించపరిచే >>2



థాయ్‌లాండ్‌లోని సిఖియో జిల్లాలో రైలుపై కూలిన క్రేన్

# రైలుపై కూలిన క్రేన్

### 28 మంది మృతి, 30 మందికి తీవ్ర గాయాలు

### థాయ్‌లాండ్‌లో విషాదం

**సిఖియో(థాయిలాండ్), జనవరి 14:** థాయ్‌లాండ్‌లో బుధవారం ఉదయం పెను విషాదం చోటుచేసుకుంది. కదులుతున్న ప్రయాణికుల రైలుపై భారీ నిర్మాణ క్రేన్ ఒక్కసారిగా పడిపోవడటంతో సుమారు 28 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 30 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. బ్యాంకాక్‌కు సుమారు 230 కిలో మీటర్ల దూరంలో ఉన్న సిఖియో జిల్లాలో ఈ దుర్ఘటన చోటు చేసుకున్నట్లు స్థానిక పోలీసులు ధృవీకరించారు. సిఖియో జిల్లా పరిధిలో ప్రస్తుతం హైస్పీడ్ రైలు ప్రాజెక్ట్‌కు సంబంధించిన నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా వినియోగిస్తున్న ఒక భారీ క్రేన్ బుధవారం ఉదయం అకస్మాత్తుగా నియంత్రణ కోల్పోయి కింద ఉన్న పట్టాలపై జారిపడింది. దురదృష్టవశాత్తు అదే సమయంలో పట్టాలపై నుంచి ప్రయాణికులతో నిండిన రైలు వెళ్తోంది. ఎత్తు నుంచి పడిన క్రేన్‌ధాటికి రైలుబోగీలు తునాతునకలు >>2

### 30 మంది ఎఇఒలు

# సస్పెన్షన్

### అగ్రి పేపర్ లీకేజీకేసు

### వ్యవసాయ శాఖ కీలక నిర్ణయం




**హైదరాబాద్, జనవరి 14, ప్రభాతవార్త:** తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ అగ్రికల్చర్ మూడో సంవత్సరం పేపర్ లీకేజీ సంఘటన వ్యవసాయ శాఖను కుదిపేస్తోంది. పేపర్ లీకేజీలో భాగస్వాములైన 34 మంది ఇన్ సర్వీ వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవో) విషయంలో వ్యవసాయ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ వ్యవసాయ విస్తరణాధికారుల అడ్మిషన్లు రద్దు చేసింది. అంతేకాకుండా వారిలో 30 విస్తరణాధికారులపై వ్యవసాయ శాఖ సస్పెన్షన్ వేటు వేసింది. మరో నలుగురు ఏఈవోలు పరీక్షలకు హాజరు కాలేదని ఇచ్చిన సమాచారం మేరకు వారిని మిన హాయిం చింది. ఇప్పటికే వ్యవసాయ విశ్వ విద్యాలయ పరిధిలోని జగిత్యాల వ్యవసాయ కళాశాలకు చెందిన డీన్ >>2

## మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్లు ఖరారు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి14:** మున్సిపాలిటీల్లో ఎస్సీ, ఎస్టీ, బిసి, మహిళా రిజర్వేషన్‌లను ప్రభుత్వం ఉత్తర్వులు ఖరారు చేసింది. సిద్ధిపేట, సూర్యాపేట, వికారాబాద్, వనపర్తి, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాలని మున్సిపాలిటీలతో పాటు రాష్ట్రంలోని 121 మున్సిపాలిటీల్లోని వార్డుల రిజర్వేషన్‌లను 2011 జనాభా ఆధారంగా ప్రభుత్వం ప్రకటించింది. సిద్ధిపేట జిల్లాలోని సిద్ధిపేటలో 43 వార్డులకు, సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్‌లోని 28 వార్డులకు, కోదాడలోని 35 వార్డులకు, నేరెడుచెర్లలోని 15, సూర్యాపేటలోని 48, తిరుమలగిరిలోని 15 వార్డులకు రిజర్వేషన్‌లను ప్రభుత్వం ప్రకటించింది. ఇక, వికారాబాద్ జిల్లాలోని కొడంగల్‌లో 12 వార్డులకు, పరిగిలోని 18 వార్డులకు, తాండూరులోని 36, వికారాబాద్‌లోని 34 వార్డులకు ప్రకటించారు. వనపర్తి జిల్లాలోని అమరచింతలోని >>2

## ఇందిరమ్మ ఇళ్లకు 152.40 కోట్లు విడుదల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి14:** ప్రతి వారం బిల్లులు చెల్లింపుల ప్రక్రియలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రస్తుతం రూ.152.40 కోట్లను హౌజింగ్ శాఖ విడుదల చేసినట్టు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ విపి గౌతమ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చినాటికి లక్ష ఇళ్లను పూర్తి చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ (హౌసింగ్ కార్పొరేషన్) క్షేత్ర స్థాయిలో పనులు వేగవంతంగా అయ్యేలా చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. ఇంటి నిర్మాణపు పనుల పురోగతిని బట్టి ప్రతి వారం బిల్లులను పూర్తి పారదర్శకంగా, నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ఈ వారంలో 13,861 మందికి బిల్లులను విడుదల చేశామని ఆయన తెలిపారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా ఇంత వరకు 2.50 లక్షల ఇళ్ల పనులు ప్రారంభమయ్యాయని, వాటిలో సుమారు 1.22 లక్షల ఇళ్ల గోడలు, శ్లాబ్‌లు పూర్తయ్యాయని వి.పి.గౌతం తెలిపారు. మార్చి నెలాఖరు కల్లా ఈ పనులు కూడా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటూ, మిగిలిన ఇళ్ల పనులు కూడా మరో మూడు నెలల్లో పూర్తి చేసేలా కార్యాచరణను అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇదిలాఉంటే ఇందిరమ్మపథకంలో ఇంతవరకు మొత్తం రూ.4,000 కోట్లకు పైగా నిధులను లబ్ధిదారులకు విడుదల చేశామని ఎండి గౌతం వివరించారు. ఎవరైనా లంచాలు డిమాండ్ చేసినా, ఇతర సమస్యలున్నా కాల్‌సెంటర్ 1800 5995991కు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.



# అట్టుడుకుతున్న ఇరాన్


### ఆందోళనకారుల అణచివేతకు ప్రభుత్వ చర్యలు

### సైనిక చర్య తప్పదు: యుఎస్ హెచ్చరిక

### 2,600 మంది పైగా మృతి, 18 వేల మంది పైగా అరెస్టు

### మృతులు 12 వేలపైనే అంటున్న హక్కుల సంఘాలు

**టెహ్రాన్, జనవరి 14:** ఇరాన్ మతపెద్ద అయతొల్లాఖొమైనీకి వ్యతిరేకంగా జరుగుతున్న జన్‌జడ్ నిరసనలు రానురాను రక్తసిక్తంగా మారుతున్నాయి. నిరసనలు తెలుపుతున్నవారిపై కాల్పులుజరిపితే సైనిక చర్యలు తీసుకుంటామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వార్నింగ్ ఇవ్వడంతోపాటు అందుకు తగినట్లుగానే అల్‌ఉద్దీద్ స్థావరానికి యుద్ధవిమానాలు, భారీ సైనికసమూహాలను తరలించడంపై ఇరాన్ ఆగ్రహంవ్యక్తంచేసింది. అంతేకాకుండా పొరుగుదేశాలను కూడా హెచ్చరించింది. అమెరికా స్థావరాలకు ఆశ్రయం కల్పించినట్లయితే తాము జరిపే దాడులకు గురికావాల్సి ఉంటుందని తీవ్రస్థాయిలో హెచ్చరించింది. ఇరాన్‌లోని ఉద్రిక్తతలకు ఇప్పటివరకూ 2600 మందికిపైగా చనిపోయారని అక్కడి మీడియా కథనాలు వస్తుంటే వాస్తవానికి 12వేల >>2



అహ్మదాబాద్‌లోని జగన్నాథ ఆలయంలో గోమాతకు పూజలు చేసి ఆహారం అందిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

# 30 మంది ఎఇఓల సస్పెన్షన్

>> భారతి నారా యణభట్‌తో పాటు, వరంగల్, జగిత్యాల వ్యవసాయ కళాశా లల్లో పనిచేస్తున్న సత్యనారాయణరెడ్డి, రమేశ్, కార్తీక్‌లను పేపర్ లీకేజీకి ప్రధాన బాధ్యులుగా గుర్తించింది. మూడేళ్ల క్రితం వ్యవసాయశాఖ సిఫారసుతో బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు లో ప్రవేశాలు పొందిన ఇన్‌సర్వీ వ్యవసాయ విస్తరణాధి కారులు వ్యవసాయ యూనివర్సిటీ నిర్వహించే పరీక్షల్లో అక్రమాలకు పాల్పడుతున్నట్లు తాజాగా వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఇన్‌సర్వీస్ వ్యవసాయ విస్తరణాధికారులు పేపర్ లీక్ చేయడమే కాకుండా హైటెక్ పద్ధతిలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడినట్లు విచారణాధికారులు తేల్చారు. ఇందుకు గాను ఏఐ ఆధారిత పెన్నులతో అగ్రి పరీక్ష జవాబులు రాసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ వ్యవహారంపై వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్య నలుగురు సభ్యులతో విచారణ కమిటీ వేశారు. యూనివర్సిటీ ప్రొఫెసర్లు నరేందర్‌రెడ్డి, ఓదెల సంపత్, డాక్టర్ అంజయ్య, ఎన్‌పీ రవికుమార్‌లతో కూడిన ఈ కమిటీ విచారణ చేసి ప్రాథమిక నివేదిక సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగానే 34 మంది ఇన్‌సర్వీస్ ఏఈవోల అడ్మిషన్లు రద్దు చేశారు. వారిని బ్లాక్ లిస్టులో పెట్టారు.

# రైలుపై కూలిన క్రేన్

>> అయింది. క్రేన్ పడిన వేగానికి రైలు బోగీలు పట్టాలు తప్పడమే కాకుండా కొన్ని బోగీల్లో మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో రైలులో మొత్తం 150 మంది ప్రయాణికులు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం. ఒక్కసారిగా జరిగిన ఈ విపత్తుతో రైలులో ఉన్న ప్రయాణికులు భయంతో హాహాకారాలు చేశారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని బోగీల్లో చిక్కుకున్న వారిని బయటకు తీసి తీవ్రంగా గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్రేన్ పడటానికి గల కారణాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. నిర్మాణ సంస్థ నిర్లక్ష్యం ఉందా లేదా సాంకేతిక లోపమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. థాయ్‌లాండ్ చరిత్రలోనే అత్యంత విషాదకరమైన రైలు ప్రమాదాల్లో ఒకటిగా ఇది నిలవగా దేశం మొత్తం మృతుల పట్ల సంతాపం వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా మృతుల కుటుంబాల్లో విషాద ఛాయలు అలముకోగా సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి.

# మేడారంలో కేబినెట్

>> వంటి నగరాల్లో పర్యటించి, హార్వర్డ్ వంటి ప్రముఖ విద్యా సంస్థల ప్రతినిధులతో రాష్ట్ర అభివృద్ధిపై చర్చించనున్నారు. ఫిబ్రవరి 1న తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు. వచ్చిన తర్వాత ఫిబ్రవరి 3 నుంచి రాష్ట్రంలో పలు సభలలో పాల్గొననున్నారు. సిఎం కార్యాలయ ప్రకటించిన షెడ్యూల్ మేరకు ఈ నెల 16న సీఎం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ జిల్లాలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. 17న మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల ఐఐటికి శంకుస్థాపన చేసి బహిరంగ సభ నిర్వహిస్తారు. 18న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించి పాలేరు నియోజకవర్గంలో జరిగే సభలో పాల్గొంటారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పాల్గొననున్నారు. అదే రోజు ఖమ్మం పట్టణంలో సీపీఐ బహిరంగ సభలో సీఎం పాల్గొంటారు. ఈ నెల 18వ తేదీన రాత్రి మేడారంలో మంత్రులతో కలిసి బస చేసి చేయనున్నారు. అక్కడే కేబినెట్ సమావేశం నిర్వహించనున్నారు.

19న కుటుంబ సభ్యులతో కలిసి సమ్మక్క సారలమ్మలను దర్శించుకొని పూజలు చేస్తారు. నూతనంగా పునర్నిర్మించిన సమ్మక్క-సారలమ్మ గద్దెలను ఆయన ప్రారంభించి అమ్మవార్లకు మొక్కులు సమర్పించుకుంటారు. తర్వాత అక్కడ నుంచి నేరుగా హైదరాబాద్‌కు మధ్యాహ్నం వరకు చేరుకుంటారు. అదే రోజు రాత్రి పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి స్విట్జర్లాండ్‌లోని దావోస్ పర్యటనకు వెళ్తారు. 20 నుంచి 23 వరకు జరిగే ప్రపంచ ఆర్థిక పెట్టుబడుల అంతర్జాతీయ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి బృందం పాల్గొంటుంది. ప్రపంచ ఆర్థిక వేదిక(డబ్ల్యుఈఎఫ్) వార్షిక సదస్సు వేదికగా తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను ప్రపంచ పారిశ్రామివేత్తలకు వివరించనున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించే తెలంగాణ లైఫ్ సైన్సెస్ పాలసీ-2026-30, తెలంగాణ ఏఐ హబ్‌ను కూడా సిఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా రేవంత్ సర్కార్ ఆ పర్యటలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. గత రెండేళ్లలో దావోసన పర్యటనల ద్వారా సుమారు రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడి ఒప్పందాలు జరిగాయి. ఈసారి భారత్ ఫ్యూచర్ సిటీ,మూసీ పునరుజ్జీవనం, రీజినల్ రింగ్ రోడ్ వంటి మెగా ప్రాజెక్టులను అంతర్జాతీయ పెట్టుబడిదారులకు వివరించి భారీ స్థాయిలో పెట్టుబడులను తీసుకురావాలని సిఎం ప్రణాళికలు సిద్ధం చేశారు. 24న దావోస్ నుంచి అమెరికాకు వెళ్లనున్న సీఎం రేవంత్.. ఫిబ్రవరి 1వ తేదీన తిరిగి రాష్ట్రానికి రానున్నారు.

# మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్లు ఖరారు

>> 10 వార్డులకు. కొత్తకోటలోని 15 వార్డులకు, పెబ్బేరులోని 12, వనపర్తిలోని 33 వార్డులకు రిజర్వేషన్‌లను ప్రకటించారు. వరంగల్‌లోని నర్సంపేట్‌కు సంబంధించి 30 వార్డులకు, వర్ధన్నపేటలోని 12 వార్డులకు, యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరులోని 12 వార్డులకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బిసిల రిజర్వేషన్‌లను 2011 జనాభా ఆధారంగా రిజర్వేషన్‌లను ఖరారు చేశారు. దీనికి సంబంధించి జిఓ ఎంఎస్ నెంబర్ 14ను పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ టికె శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేసింది.

## వారం - వర్జ్యం

15-01-2026, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం,ఉత్తరాషాఢ కార్తె
ద్వాదశి రా.8.15
జ్యేష్ఠ తె.5.47
వర్జ్యం : రా.7.16-9.01
దు.ఉ.10.25-11.10,
2) మ.2.55-1.40
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** అవిశ్రాంతంగా శ్రమించడంవలన వత్తిడికి లోనవుతారు. ఆదాయ వ్యయాలపైన దృష్టిని సారిస్తారు.

**వృషభం:** మీ సన్నిహితులు మీ పరిధిలో లేని పనులను చేసి పెట్టమని మొహమాటాలతో ఇరుకునపెడతాయి. వాహనసౌఖ్యం.

**మిథునం:** ఏకపక్షనిర్ణయాలు తొందరపాటు వాగ్దానాలు చోటుచేసుకుంటాయి. కోర్టు వ్యవహారాలు వాయిదాలలో ఉంటాయి.

**కర్కాటకం:** ఇంటాబయటా అనుకూలమైన వాతావరణం ఉంటుంది. కొత్త మిత్రులు పరిచయమవుతారు.శ్రమ అధికం.

**సింహం:** అందరిలోనూ ప్రత్యేక గౌరవం పొందుతారు. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. చర్చలు ఫలిస్తాయి.

**కన్య :** రాజకీయ కళారంగాలవారికి యోగదాయకంగా ఉంటుంది. ఉద్యోగులు ఇంక్రిమెంట్లు పొందుతారు.

**తుల :** వ్యక్తిగత ఋణాలు మంజూ రవుతాయి. చేపట్టిన కార్యక్రమాలు సాఫీగా సాగుతాయి. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి.

**వృశ్చికం:** చిన్ననాటి మిత్రుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. మీ ప్రయత్నాలు అనుకూలంగా సాగుతాయి.

**ధనుస్సు:** వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సోదరవర్గానికి సహాయ సహకారాలు అందిస్తారు.వస్త్రలాభం.

**మకరం:** గృహం వాహనాలు కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. కుటుంబసభ్యుల నుండి సహాయ సహకారాలు అందిస్తారు.

**కుంభం:** కొత్త విషయాలు గ్రహిస్తారు. మీ మాటల చాతుర్యంతో అందరినీ ఆకట్టుకుని ముందుకు సాగుతారు.

**మీనం:** పెట్టుబడులలో లాభాలు పొందుతారు. ప్రయాణ యత్నాలలో సాంకేతిక లోపాలు చోటుచేసుకుంటాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోలి, హైదరాబాద్

## వారం - వర్జ్యం

16-01-2026, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం,ఉత్తరాషాఢ కార్తె
త్రయోదశి రా.10.19
మూలపూర్తి
వర్జ్యం : ఉ.6.26-8.12
దు.ఉ.8.55-9.40, 2) మ.12.40-1.25
శుభసమయం: ఉ.5.30-6.30,సా.6.30-7.30
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృషభం:** ఆర్థిక సర్దుబాట్లను నేర్పుగా చేసుకోగలుగుతారు. జీవిత భాగస్వామితో భేదాభిప్రాయాలు ఏర్పడతాయి.

**మిథునం:** అనతి కాలంలో ప్రారంభించ బోయే నూతన కార్యక్రమాలకు గాను మితంగా శ్రమిస్తారు.

**కర్కాటకం:** ఎవరినీ ఏ సహాయం అర్థించకుండా స్వయంగా మీ పనులను మీరే పర్యవేక్షించుకుంటారు.

**సింహం:** ప్రత్యర్థి వ్యూహాలను అమలు పరుస్తారు. వృత్తి, వ్యాపారాల పరంగా చెప్పుకోదగిన ఒడిదుడుకులు వుండవు.

**కన్య :** గతంలో ఒకరికిచ్చిన వాగ్దానాన్ని నిలుపుకోవడానికి మీరు చేసే కృషి ఫలిస్తుంది.ఉద్యోగాలలో మంచి మార్పులు ఉంటాయి.

**తుల :** దూర ప్రయాణాలను వాయిదా వేయడం మంచిది. సంతతి విషయమై చింతించవలసిన అవసరం ఉండదు.

**వృశ్చికం:** మీ మీద అధికారులకు చాడీలు చెప్పే ఓ వర్గం వలన తాత్కాలికంగా ఇబ్బందులను ఎదుర్కొంటారు.

**ధనుస్సు:** మీకు ఇష్టం లేకపోయినా ప్రయోజనాల పరిరక్షణకు తలవంచాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. స్వల్ప ధనలాభం పొందుతారు.

**మకరం:** ఆదాయవ్యయాలలో సమతుల్యతను సాధించటానికి మీరు చేసే ప్రయత్నాలు కలిసివస్తాయి.

**కుంభం:** చెవి, ముక్కు, గొంతు సంబంధితమైన చిన్నచిన్న ఇబ్బందులు ఏర్పడతాయి. ఋణాలు చేయకండి.

**మీనం:** పరపతి ఉపకరిస్తుంది. మీతో ఏకీ భవించే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. వాహన సౌఖ్యం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోలి, హైదరాబాద్

# పొంగలో పొంగల్

>> శోభను తీసుకొచ్చాయి. దేశ రాజధానిలో తమిళ సంస్కృతి ఘనంగా ఆవిష్కృతమవడం అందరి దృష్టిని ఆకర్షించింది. దేశ అభివృద్ధిలో రైతులు అత్యంత కీలక భాగస్వాములని ప్రధాని పునరుద్ఘాటించారు. రైతులను ఆర్థికంగా, సాంకేతికంగా శక్తిమంతం చేయడమే ప్రభుత్వ ధ్యేయం అని స్పష్టం చేశారు. భారతీయ సంస్కృతి, వ్యవసాయం విడదీయరాని బంధమని పేర్కొంటూ, పొంగల్ వంటి పండుగలు రైతుల కష్టానికి గౌరవ సూచకంగా నిలుస్తాయని మోడీ వ్యాఖ్యానించారు.

వేడుకల అనంతరం ప్రధాని మోడీ మాట్లాడుతూ.. గత ఏడాది తాను తమిళనాడులో పాల్గొన్న పలు కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. వెయ్యి సంవత్సరాల చరిత్ర కలిగిన గంగైకొండ చోళపురం ఆలయం, అలాగే దేశానికి గర్వకారణమైన పంబన్ వంతెన ప్రారంభోత్సవం వంటి కార్యక్రమాల ద్వారా తమిళుల గొప్ప చరిత్ర, వారసత్వాన్ని మరింత లోతుగా తెలుసుకునే అవకాశం కలిగిందని ఆయన తెలిపారు. కొన్ని నెలల క్రితం తమిళనాడులో నిర్వహించిన సహజ వ్యవసాయ సదస్సుకు తాను హాజరయ్యానని తెలిపారు. మంచి ఉద్యోగాలు, లాభదాయక వృత్తులను వదిలి వ్యవసాయ రంగంలోకి అడుగుపెట్టిన యువతను కలవడం తనకు ఎంతో ప్రేరణనిచ్చిందన్నారు.

వారి కృషిని మరింత విస్తరించి, వ్యవసాయంలో కొత్త విప్లవం తీసుకురావాలనే సంకల్పం తనకు కలిగిందని చెప్పారు. వ్యవసాయాన్ని స్థిరంగా, పర్యావరణ అనుకూలంగా మార్చడమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. భవిష్యత్తులో నీటి నిర్వహణ, సహజ వ్యవసాయం, ఆధునిక సాంకేతికతలు, డిజిటల్ సొల్యూషన్లు రైతులకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. దీంతో పాటు రైతుల ఆదాయం పెంపు, ఖర్చుల తగ్గింపు దిశగా విధానాలు అమలు చేస్తున్నామని వివరించారు.

**సంక్రాంతి శుభాకాంక్షలు చెప్పిన ప్రధాని మోడీ**

దేశ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు స్థానిక సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం పంటల పండుగను జరుపుకుంటారు. మకర రాశిలోకి సూర్యుడు ప్రవేశించడాన్ని మకర సంక్రమణం అంటారు. దీన్ని అత్యంత పుణ్యకాలంగా భావిస్తారు. పవిత్రమైన సంక్రాతి పర్వదినాన్ని దేశ ప్రజలు వివిధ ప్రాంతాల్లో తమ స్థానిక సంప్రదాయాల ప్రకారం జరుపుకుంటారని, ప్రజలకు సంతోషాన్ని, ఆరోగ్యాన్ని ఇవ్వాలని సూర్య భగవానుడిని ప్రార్థిస్తున్నట్లు ప్రధాని మోడీ తెలిపారు. తన ఎక్స్ అకౌంట్‌లో మోడీ సంక్రాంతి గ్రీటింగ్స్ చెప్పారు. మంగళకరమైన ఉత్తరాయణం సందర్భంగా హృదయపూర్వక గ్రీటింగ్స్ చెబుతున్నట్లు ఆయన ట్వీట్ చేశారు. ఈ సంతోషకర సంబరాలు బంధాలను మరింత బలోపేతం చేయాలని, సుఖసంపదలను ఇవ్వాలని, పాజిటివ్ దృక్పథాన్ని నింపాలని తెలిపారు.

# హోరెత్తిన సంక్రాంతి సంబురాలు

>> మైహోమ్ భుజాలో భోగి సంబురాలు అట్టహాసంగా జరిగాయి. అపార్ట్‌మెంట్ ఆవరణలో పాత సామాగ్రిని భోగి మంటల్లో వేసి, చెడు తొలగిపోయి మంచి జరగాలని ఆకాంక్షి ంచారు. వెంగల్‌రావు నగర్‌లోని కాలనీవాసులు భోగి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

ఎల్బీనగర్ చిత్రా లేఅవుట్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భోగి సంబరాలు ఘనంగా జరిగాయి. వేకువజామునే భోగి మంటలేసి ఆనందోత్సాహాల నడుమ సంక్రాంతికి స్వాగతం పలికారు. బసవన్నల ఆటలు, హరిదాసు కీర్తనలతో పండుగ సంస్కృతీ సంప్రాదాయాలను కళ్లకు కట్టారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు భోగి మంటలు చుట్టూ చేరి ఉత్సాహంగా నృత్యాలు చేశారు. గంగిరెద్దులకు పూజలు చేసి, హరిదాసులకు భిక్ష ప్రదానం చేశారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. నగరంలోని బృందావనం అపార్ట్‌మెంట్ వాసులు భోగిమంటలు వేసి సందడిగా గడిపారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో భోగి పర్వదినాన పాతకు వీడుకోలు పలుకుతూ కొత్తదనానికి స్వాగతం పలికారు. ద్వారక పేటలో శ్రీ ద్వారకా వేణుగోపాల స్వామి ఆలయంలో భోగిమంటల చుట్టూ కోలాటాలు వేశారు. మాతృభూమి ఛారిటబుల్ ట్రస్ట్ అనాథ ఆశ్రమంలో చిన్నారులు భోగి మంటలు వేసుకొని ఉత్సాహంగా ఆడి పాడారు.వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామంలో భోగి మంటల చుట్టూ చేరి ఆనందంగా గడిపారు. మహబూబాబాద్‌లో సెవెన్ హిల్స్ కాలనీలో భోగి మంటల కాంతులు విరజిమ్మాయి. విఘ్నాలు తొలగి సకల శుభాలు ప్రసాదించాలని అగ్ని దేవుడిని ప్రార్థించారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి ధర్మారాం బి గ్రామంలో ఇంటి ముంగింట రంగవల్లులు పెట్టి భోగిమంటలతో వేడుకలు జరుపుకున్నారు. ఖమ్మం జిల్లా మధిరలో ఉప ముఖ్యమంత్రి భట్టి క్యాంపు కార్యాలయంలో భోగి వేడుకల్లో భట్టి విక్రమార్క సతీమణి నందిని పాల్గొన్నారు. కాంగ్రెస్ మహిళ నేతలు నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆజాద్ రోడ్, సుందరయ్యనగర్, ఉపాధ్యాయ కాలనీ, నారాయణ పాఠశాలల్లో వేడుకలు ఆద్యంతం ఉత్సాహంగా జరిగాయి.కరీంనగర్‌లోని పలు కాలనీల వాసులు కొత్త ఆశలతో ఉత్తరాయణానికి స్వాగతం చెపుతూ సంక్రాంతి సంబరాలకు నాంది పలికారు. జ్యోతినగర్‌లో నిర్వహించిన భోగి వేడుకల్లో చిన్నా పెద్దా ఉత్సాహంగా పాల్గొన్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి చైతన్యనగర్‌లో భోగి వేడుకల ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో హరిదాసుల సంకీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు పండుగ శోభను కళ్లకు కట్టాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానంలో వాకర్ అసోసియేషన్ సభ్యులు భోగి మంటలను ఏర్పాటు చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా లోగిళ్లనీ భోగి సంబరాలతో కళకళలాడాయి. చిన్నా పెద్దా భోగి మంటల చుట్టూ తిరుగుతూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



ఢిల్లీ కంటోన్మెంట్‌లోని మాణెక్‌షా సెంటర్‌లో బుధవారం 10వ సాయుధ దళాల మాజీ సైనిక దినోత్సవంలో బుక్‌లెట్ విడుదల చేస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

# అట్టుడుకుతున్న ఇరాన్

>> మందికిపైగా మరణించి ఉంటారని హక్కుల సంఘాలు ఘోషిస్తున్నాయి. కఠిన చర్యలు తప్పవని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ హెచ్చరించడంతో ఇరాన్ రివల్యూషనరీ గార్డులు అణిచివేతను ముమ్మరంచేసారు. ఖాళీచేయించడంకంటే ముందస్తు వ్యూహంగా తరలింపు జరుగుతున్నట్లు అల్‌ఉదీద్ సైనిక స్థావరంపై అమెరికా చర్యలను విశ్లేషిస్తున్నారు. ఇరాన్‌లోని ఉద్రిక్తతలకు మొత్తం అమెరికా, ఇజ్రాయెల్‌దేశాలే కారణమని, ఇరాన్‌ప్రజలను ప్రభుత్వాన్ని ఉగ్రవాదులుగా పేర్కొంటూ అనవసర ఉద్రిక్తతలు రెచ్చగొట్టాయని ఆరోపిస్తున్నారు. దీనికితోడు ట్రంప్‌సైతం రెచ్చగొట్టేప్రసంగాలుచేస్తున్నారని, ఆందోళన కొనసాగించాలని, వారిని ఉరితీస్తే ఉపేక్షించేదిలేదని, సాయం ఇప్పటికే ప్రారంభించామని, మీకు అండగా ఉంటామంటూ సోషల్‌మీడియా పోస్టులపై ఇరాన్‌నేతలు అగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇరాన్ తన మిత్రదేశాలను ఇప్పటికే అమెరికా ఇరాన్‌పై దాడులుచేయాలన్న వాంఛను తిప్పికొట్టాలని కోరింది. సౌదీ అరేబియా, యుఎఇ, టర్కీ వంటి దేశాలకు ముందుగానే సమాచారం ఇస్తూ ఆదేశాల్లో ఉన్న అమెరికా స్థావరాలపై దాడులుచేస్తామని హెచ్చరించింది. ఖతార్‌లోని అల్‌ఉదీద్ బేస్‌ను సెంట్రల్ కమాండ్ అని పిలుస్తారు. సెంట్‌కామ్ అని కూడా చెప్పుకుంటారు. అక్కడే భారీ ఎత్తున సైనికస్థావరాలునిలిచాయి. ఈసైనికబేస్‌ను బుధవారం సాయంత్రానికల్లా ఖాళీచేయించేందుకు అమెరికాయోచిస్తోంది. ఇప్పటికే అల్‌ఉదీద్‌పై దాడులుచేస్తామని ఇరాన్ హెచ్చరించిన క్రమంలో అమెరికా అక్కడి స్థావరాన్ని యుద్ధప్రాతిపదికన తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ తరలింపుపైఖతార్ సర్కారు స్పందిస్తూ ఉద్రిక్తతలు, హింసాత్మక వాతావరణం అలుముకున్న తరుణంలోప్రజలకు నష్టం వాటిల్లకుండా ఇలాంటి చర్యలు సహజమంటూ చెప్పుకొచ్చింది. ఇప్పటికే ఇరాన్‌సుప్రీం నేషనల్‌సెక్యూరిటీకౌన్సిల్ కార్యదర్శి అలి లారిజాని ఖతార్ ప్రధాని షేక్ మహ్మద్ బిన్ అబ్దుల్‌రహమాన్ ఆల్ థానితో సుదీర్ఘచర్చలుజరిపినట్లు సమాచారం. అయితే అమెరికా పెంటగాన్‌కానీ ఇతర అధికారికంగా ఎవ్వరూ కూడా తరలిస్తున్నట్లుప్రకటించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటివరకూ ఇరాన్‌లో సుమారు 18,137 మందికిపైగా అరెస్టులుచేసినట్లు తెలుస్తోంది. ఇరాన్‌ప్రకటించిన 26 ఏళ్ల ఇర్ఫాన్ సోల్తానికి ఉరిశిక్ష అమలయిందిలేనిదీ స్పష్టత రాలేదు. ఇరాన్ అధికారులు కూడా గుర్తించలేదు. అయితే సోల్తానిని బుధవారమే మరణశిక్ష అమలుచేస్తామని ఇరాన్‌ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇరాన్‌లో జరుగుతున్న నిరసనలపై ఇరాన్ చీఫ్‌జస్టిస్‌కూడా తీవ్రంగా పరిగణించారు. టెహ్రాన్ జైలును సందర్శించిన ఆయన ప్రజలపై దాడులుచేసి హత్యలు చేసేందుకు పూనుకున్నారో వారందరినీ కఠినంగా శిక్షించాలని అందుకు న్యాయవ్యవస్థ వేగంగాపనిచేస్తుందనిప్రకటించారు. ఇరాన్‌చమురును కొనుగోలుచేస్తున్న దేశాలపై 25శాతం అదనపు సుంకాలు వేస్తామని ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. ఇదిలా ఉంటే ఇరాన్‌ఉద్రిక్తతల దృష్ట్యా ఆదేశంలో ఉన్న అమెరికా పౌరులు వెంటనే ఇరాన్‌ను వీడి వచ్చేయాలని ఆదేశించింది. అలాగే భారత్‌కూడా ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు, నివాసితులను అప్రమత్తంచేసింది. ఉద్రిక్తతలు పెరుగుతున్నవేళ ఆదేశం వీడటమే శ్రేయస్కరమని తేల్చిచెప్పింది. అత్యవసరం అయితే ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని సూచనలు కూడాచేసింది.

# ప్రజలు పల్లెబాటతో బోసిపోయిన గ్రేటర్

>> సెలవులు రావడంతో పట్టణ ప్రజలు గ్రామాలబాట పట్టారు. పాఠశాలలు, కాలేజీలకు సెలవులు ప్రకటించడం, ఇదే సమయంలో సర్కారీ ఉద్యోగుల్లో అనేక మంది సెలవులు తీసుకుని మరీ ఊళ్లకు ప్ర యాణాలు సాగించడంతో విజయవాడ రహదారిపై గత శనివారం నుంచి ట్రాఫిక్ రద్దీ పెరిగింది. మామూలుగానే విజయవాడ జాతీయ రహదారి వా హనాలతో క్రిక్కిరిసి పోతుంటుండగా అదనపు ట్రాఫిక్‌తో మరింత రద్దీగా మారింది. సంక్రాంతి కారణంగా విజయవాడ జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు బస్సులు, ఇతర వాహనాలు వేల సంఖ్యలో వెళుతూ కనిపించాయి. పండగ సందర్భంగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు గడచిన ఐదు రోజుల్లో రెండున్నర లక్షల వరకు వాహనాలు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఇందులో మంగళ, బుధవారాల్లో 80 వేల వాహనాలు వెళ్లినట్లు వారు తెలిపారు. ఇక హైదరాబాద్ నుంచి వరంగల్, బీబీనగర్ టోల్ గేట్ మీదుగా 50 వేల వాహనాలు పయనమైనట్లు వారు తెలిపారు. పండగల సమయంలో ఊళ్లకు వెళ్లిన వారిలో 90 శాతం వ్యక్తిగత వాహనాలలోనే వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. కాగా ఆర్టీసీ బస్సుల్లో టికెట్లు దొరకని వారు ప్రైవేటు బస్సుల్లో, అందులో కూడా దొరకని వారు సొంత వాహనాలు, ప్రైవేటు వాహనాల్లో ప్రయాణాలు చేబట్టారు. విజయ వాడ జాతీయ రహదారిపై ఇటీవల కాలంలో ఇంతటి స్థాయిలో ట్రాఫిక్ రద్దీ ఇటీవల కాలంలో ఇదే తొలిసారిగా పోలీసు అధికారులు చెబుతున్నారు. కాగా సంక్రాంతి పండగ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి లక్షలాది మంది సొంత ఊళ్లకు ప్రయాణాలు సాగించిన నేపథ్యంలో హైదరాబాద్‌లోని రహదారులు ఒక్కసారిగా బోసిపోయాయి. బుధవారం నగర రహదారులపై వాహనాల రద్దీ మరింత తగ్గింది. నగరంలోని అన్ని ప్రధాన రహదారులతో పాటు ఇత ర మార్గాలలో వాహనాల రద్దీ తగ్గడంతో వాహనాల సగటు వేగం కొంతమేర పెరిగింది.

# జర్నలిస్టుల అరెస్టు

>> వార్తలు ప్రసారం చేసిన వ్యవహారంపై ఎన్‌టివితో పాటు మరో ఛానల్ సహా ఏడు యూ ట్యూబ్ చానళ్లపై సిటీ సిసిఎస్ లో మరో కేసు నమోదవడం విదితమే. భారతీయ న్యా య సంహిత సెక్షన్లు 75, 78, 79 (వేధింపులు, మహిళల గౌరవానికి భంగం కలిగించడం ), 351 (1), 352 (2) (శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా అవమానించడం) కింద కేసు నమోదు చేశారు. ఈ రెండు ఘటనలపై సమగ్ర వి చారణకు సర్కారు సిట్‌ను ఏర్పాటు చేయగా సిట్‌కు సిటీ కొత్వాల్ సజ్జన్నార్ నేతృత్వం వహించనుండగా ఇందులో ఏడుగురు పోలీసు అధికారులు సభ్యులుగా వున్నారు. సిట్ ఏర్పాటైన మరుసటి రోజు నే ఎన్‌టివి జర్నలిస్టులు ఇద్దరు అరెస్టయ్యారు. ఈ కేసులో మిగతా వారి పాత్రపై విచారణ సాగుతోందని పోలీసులు తెలిపారు.

**జర్నలిస్టుల అరెస్టుపై కిషన్ రెడ్డి, కెటిఆర్, హరీష్ రావుల ఖండన**

ఇదిలావుండగా ఎన్‌టివి ఇన్‌పుట్ ఎడిటర్ దొంతు రమేష్, జర్నలిస్టు సుధీర్‌ల అరెస్టును కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బిఆర్‌ఎస్ నాయకుడు హరీష్ రావులు తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టుల అరెస్టు సరైంది కాదని వారు బుధవారం నాడు మీడియాతో మాట్లాడుతూ తెలిపారు.ఇలాంటి చర్యలు ఎంతమాత్రం మంచిది కాదని వారు హితవు పలికారు. రాష్ట్రంలో ముగ్గురు జర్నలిస్టులను పోలీసులు అపహరించారని ఆరోపిస్తూ, సిఎం రేవంత్ రెడ్డి పాలనలో మీడియాపై దమనకాండ కొనసాగుతోందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ధ్వజమెత్తారు.

ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆయన ఘాటుగా స్పందించారు. 'రాహుల్ గాంధీ గారూ.. మీరు నడుపుతున్న ఖిమొహబ్బత్ కీ దుకాన్‌ఖి తెలంగాణ శాఖ, పౌరుల రాజ్యాంగ హక్కులను ఎలా కాలరాస్తోందో గమనిస్తున్నారని ఆశిస్తున్నా' అని కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. మంగళవారం రాత్రి రాష్ట్ర పోలీసులు ముగ్గురు జర్నలిస్టులను అపహరించారని, ఒకరి ఇంటి తలుపులు బద్దలుకొట్టి మరీ లోపలికి ప్రవేశించారని ఆరోపించారు.

**ఎన్టీటీవీ జర్నలిస్టుల తీవ్రంగా ఖండిస్తున్నా: వైఎస్ జగన్**

ఎన్టీవీ జర్నలిస్టుల అరెస్టను ఏపీ మాజీ సిఎం, వైసీనీ అధినేత జగన్ తీవ్రంగా ఖండించారు. ఈ చర్య పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. పండుగ సమయంలో అర్ధరాత్రి పూట ఇళ్ల తలుపులు బద్దలుకొట్టి, ఎలాంటి చట్టపరమైన ప్రక్రియను పాటించకుండా, కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా జర్నలిస్టులను అరెస్ట్ చేయడం అత్యంత దారుణమని మండిపడ్డారు.

ఇది ప్రభుత్వ నిరంకుశ ధోరణికి స్పష్టమైన నిదర్శనమని జగన్ వ్యాఖ్యానించారు.'జర్నలిస్టులు నేరస్తులు కాదు, ఉగ్రవాదులు అంతకన్నా కాదు. అయినా వారి పట్ల ఇంత కఠినంగా వ్యవహరించడం సరికాదు. ఇలాంటి చర్యల వల్ల వారి కుటుంబ సభ్యులు తీవ్రమైన మానసిక వేదనకు గురవుతారు. అంతేకాకుండా, మీడియా వర్గాలలో భయాందోళనకర వాతావరణం నెలకొంటుంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరు రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించేలా ఉందని విమర్శించారు.

# భయమెందుకు?

>> అన్నారు. దీనిపై విచారణ సాగుతోందని ఆయన తెలిపారు. జర్నలి స్టులు పోలీసుల విచారణకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కేసులో నిందితులు ఎక్కడ వున్నా పట్టుకుంటామని, అసత్య కథనం ప్రసారం చే సిన ఎన్‌టివి ఛానల్ సీఈఓ ఎక్కడ వున్నారని, విచారణకు పిలిస్తే రావాలి కదా...? దాక్కుంటే సరిపోతుండా...? అని సజ్జన్నార్ ప్రశ్నించారు. అరె స్టయిన జర్నలిస్టుల్లో ఒకరిని శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నామని, ఆయన విదేశాలకు హడావిడిగా వెళుతుంటే పట్టుకున్నామ ని సజ్జన్నార్ తెలిపారు. ఈ కేసులో త్వరలో అన్ని విషయాలు బయటకు వస్తాయని ఆయన వెల్లడించారు. మహిళా అధికారులపై అసత్య కథనాలు ప్రసారమైతే వారు సమాజంలో ఎలా తలెత్తుకుని పనిచేయగలుగుతారు...? అని ఆయన ప్రశ్నించారు. మహిళా అధికారులను కించపరిచే విధంగా వార్తలు ఎలా రాస్తారు...? ఈ విషయంలో అందరు ఆత్మవిమర్శ చేసుకోవాలని ఆయన తెలిపారు. భవిష్యత్తు అంతా మహిళలదేనని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. మహిళా ఐఎఎస్ అధికారితో పాటు సిఎంపైనా అవమానకరంగా వార్తలు వేయడంతో మరో కేసు నమోదయ్యిందని, ఈ రె ండు కేసుల విచారణకు సిట్ ఏర్పాటయ్యిందని ఆయన తెలిపారు.

## సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి14:** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మకర సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు.భోగభాగ్యాలతో 'భోగి', సకల సంపదలతో 'సంక్రాంతి', కన్నుల పండుగగా 'కనుమ'ను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. సంక్రాంతి రైతుల పండుగ. వానాకాలం పంట కోతలు పూర్తయి ధాన్యం ఇంటికి చేరిన సమయంలో గ్రామీణ సంస్కృతి, వ్యవసాయ సాంప్రదాయాలను అనుసరిస్తూ రైతులు జరుపుకునే పండుగ సంక్రాంతి అని పేర్కొన్నారు. భోగి మంటలు, గాలి పటాల సందళ్ళతో పాటుగా తెలంగాణ సంప్రదాయ సకినాల పిండివంటలతో ఈ మూడు రోజులు ఇళ్ళు కోలాహలంగా ఉంటుందన్నారు. తమ కుటుంబ సభ్యులు, బంధు, మిత్రులతో కలిసి ప్రజలందరూ సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకోవాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు.

## సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననంపై డిజిపి ఆగ్రహం

**హైదరాబాద్, జనవరి 14, ప్రభాతవార్త:** సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న వ్యక్తిత్వ హననం(క్యారెక్టర్ అసాసియేషన్)పై తెలంగాణ రాష్ట్ర డిజి పి శివధర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎం రేవంత్ రెడ్డిపై అసభ్యకరంగా ఫోటోల ప్రచురణ, మహిళా ఐఎఎస్ అధికారిపై అసత్య కథనాల ప్రసారంపై చర్యల కోసం ఏర్పాటైన సిట్ విచారణ చేబట్టిన తరువాత నెలకొన్న పరిణామాలపై ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డిజిపిగా తాను బాధ్యతలు చేబట్టిన సమయంలోనే ఈ విషయమై స్పష్టంగా వెల్లడించడం జరిగిందని ఆయన తెలిపారు. సోషల్ మీడియా పేరుతో వ్యక్తిత్వ హననం చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని, వేరే వ్యక్తులపై నిందారోపణలు, వ్యక్తిగత ప్రవర్తనపై ఇష్టానుసారం వ్యాఖ్యలు చేస్తే చట్ట ప్రకారం వ్యవహరిస్తామని ఆయన తెలిపారు. వేరే వ్యక్తుల గురించి, వారి కుటుంబం గురించి తప్పుడు వార్తలు ప్రసారం చేయరాదని, వీటిని సర్క్యూలేట్ చేయరా దని, దీనివల్ల వారితో పాటు వారి కుటుంబాలు తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తారని డిజిపి తెలిపారు. చట్టానికి లోబడి నాలుగు గోడల మధ్య ఎలాంటి విమర్శలు చేసుకున్నా ఇబ్బంది లేదని, హద్దులు దాటితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## చైనా మాంజా గొంతుకు చిక్కుకుని యువకుడి మృతి

**సంగారెడ్డి టౌన్, జనవరి 14, ప్రభాతవార్త:** ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వ్యక్తికి చైనా మాంజా గొంతుకు చిక్కుకోగా గొంతు కోసుకుపోయి అక్కడికి అక్కడే మృతి చెందిన సంఘ టన సంగారెడ్డి జిల్లా ఫసల్వాది ప్రాంతంతో బుధవారం చోటుచేసుకుంది. బీహార్ రాష్ట్రానికి చెందిన అద్వైత్‌కుమార్ (38) ఫసల్‌వాది గ్రామానికి వరినాట్లు వేసేందుకు కూలీపనిపై వచ్చి కూరగాయలు కొనుగోలు చేసేందుకు సంగారెడ్డి పట్టణానికి ద్విచక్ర వాహ నంపై బుధవారం వెళుతున్న క్రమంలో చైనా మాంజా గొంతుకు చిక్కుకుంది. ఈ ప్రమాదంతో యువ కుడు అక్కడికి అక్కడే మృతి చెందాడు. చైనా మాంజా అమ్మరాదని, వినియోగించవద్దని పోలీసులు పక్షం రోజులుగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా చివరకు చైనా మాంజాతో యువకుడి మృతి చెందక తప్పలేదు. పోలీసులు చైనా మాంజా అమ్మితే కఠినంగా శిక్షిస్తే కాని భవిష్యత్తులో నిండు ప్రాణాలకు నూరేళ్లు నిండవని చెప్పవచ్చు. మృతుడి కుమారుడు భానుప్రతాప్ భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

## మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌పై కేసు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జనవరి 14, ప్రభాతవార్త:** మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌పై ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 11న జరిగిన బహిరంగ సభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశిస్తూ తలసాని శ్రీనివాస్‌యాదవ్ అవమానకర, అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. 'నీ అబ్బ జాగీరా.. నిన్ను ముక్కలు చేస్తా బిడ్డా' అంటూ ముఖ్యమంత్రిపై పరుష పదజాలంతో అవమానించేలా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బ తీసేలా ఉన్నాయని ఎస్సార్‌నగర్‌కు చెందిన దేవులపల్లి రవికిరణ్ ఎస్సార్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు సెక్షన్ 352, 351(2), 353(సి), 353(2) బిఎన్‌స్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పోలీస్ ఆఫీసర్ కుక్, డ్రైవర్‌లే

## 100కుపైగా కేసుల్లో సాక్షులు

**భోపాల్, జనవరి 14:** ఒక పోలీస్ అధికారి డ్రైవర్, వంట మనిషి వందకు పైగా కేసుల్లో సాక్షులుగా ఉన్నారు. ఆ పోలీస్ అధికారి బదిలీ అయిన పోలీస్ స్టేషన్ల కేసుల్లో కూడా వీరే సాక్షులు. ఒక సామాజిక కార్యకర్త ఈవ్యవహారంపై ఫిర్యాదు చేశారు. దీంతో ఆ పోలీస్ అధికారిపై చర్యలు




చేపట్టారు. బీజేపీ పాలిత మధ్య ప్రదేశ్‌లో ఈ సంఘటన జరిగింది. మోగంజ్ జిల్లాలోని ఇంద్రగర్హి, నైగర్హి పోలీస్ స్టేషన్లలో స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా జగదీష్ సింగ్ ఠాకూర్ పని చేశారు. ఆయన వ్యక్తిగత డ్రైవర్ అమిత్ కుష్వాహా, పోలీస్ స్టేషన్‌లో వంట చేసే దినేష్ కుష్వాహా అనే కూరగాయల వ్యాపారి సుమారు 106 కేసుల్లో సాక్షులుగా లేదా సమాచారం అందించిన వ్యక్తులుగా ఉన్నారు. పోలీస్ అధికారి జగదీష్ సింగ్ ఠాకూర్ బదిలీ అయిన స్టేషన్లలో నమోదైన కేసుల్లో కూడా డ్రైవర్, వంట మనిషి కీలక సాక్షులుగా ఉన్నారు. డ్రైవర్ అమిత్ కుష్వాహా ఒక్కడే 18 కేసుల్లో ఏకైక సాక్షిగా పోలీస్ రికార్డుల్లో నమోదయ్యాడు. 2020లో అతడి వయస్సు 20గా, 2025లో నమోదైన ఒక కేసులో 21గా పేర్కొన్నారు. ఒక కేసులో అతడు ఫిర్యాదుదారుడిగా ఉన్నాడు. మరోవైపు నైగర్హి పోలీస్ స్టేషన్‌లో క్లీనర్‌గా పనిచేసే రమాకాంత్ యాదవ్, 14 కేసుల్లో సాక్షిగా ఉన్నాడు. పోలీస్ స్టేషన్ వాహనాన్ని నడిపే రాహుల్ విశ్వకర్మ పేరు 18 కేసులలో సాక్షిగా నమోదైంది. ఆ పోలీస్ స్టేషన్ సమీపంలో నివసించే వికలాంగుడైన అరుణ్ తివారీ కూడా అమిత్ కుష్వాహాతో కలిసి ఆరు కేసుల్లో సాక్షిగా ఉన్నాడు. అయితే ఆశ్చర్యకరంగా ఒక దోపిడీ కేసులో అరుణ్ తివారీ నిందితుడయ్యాడు. 2025 మే 19న నైగర్హి పోలీస్ స్టేషన్‌లో అతడిపై దోపిడీ కేసు నమోదైంది. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ అండ్ నెట్‌వర్క్ సిస్టమ్ (సీసీటీఎన్ఎస్)లోని సమాచారం ఆధారంగా 2022 నుంచి 2025 మధ్య నమోదైన 500కు పైగా కేసుల్లో ఇలాంటి తప్పుడు సాక్షులు బయటపడ్డారు. నైగర్హితో సహా జగదీష్ సింగ్ ఠాకూర్ పనిచేసిన పోలీస్ స్టేషన్లలోని 150కు పైగా ఎఫ్ఐఆర్‌లు నకిలీవి లేదా తారుమారు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. మరోవైపు సామాజిక కార్యకర్త కుంజ్‌బిహారి తివారీ దీనిపై ఫిర్యాదు చేశారు. 150కు పైగా కేసుల్లో ఒకే వ్యక్తి సాక్షిగా ఉన్నాడు. అధికారులకు బదిలీ అయినట్లే, ఈ సాక్షి కూడా వారితో పాటు వెళ్లాడు. ఒకేరోజు ఐదు సంఘటనలు జరిగినప్పటికీ సాక్షి ఒకే వ్యక్తి ఉంటాడు. వారు (పోలీస్ అధికారులు) సాక్షులను తమ జేబులో పెట్టుకుంటారని ఆరోపించారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడిన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని ఆయన హెచ్చరించారు. మోగంజ్ ఎస్పీ దిలీప్‌కుమార్ సోని దీనిపై స్పందించారు. పోలీస్‌అధికారి జగదీష్‌సింగ్‌ఠాకూర్‌ను నైగర్హి పోలీస్ స్టేషన్ నుంచి తొలగించారు. ఆయనను పోలీస్‌లైన్స్‌కు బదలీ చేశారు. ఈ అంశంపై దర్యాప్తును సబ్‌డివిజనల్ పోలీస్‌అధికారి (ఎస్‌డిఓపీ)కి అప్పగించారు.

# శబరిమలలో మకర జ్యోతి దర్శనం

తన్మయత్వం చెందిన అయ్యప్ప భక్తులు
జ్యోతి దర్శనం కోసం పోటెత్తిన భక్తజనం

**పథనమ్‌థిట్ట(కేరళ), జనవరి 14:** శబరిమలలో మకరజ్యోతి దర్శనం సాక్షాత్కారమైంది. బుధ వారం సాయంత్రం 7 గంటల సమయంలో జ్యోతి దర్శనంతో అయ్యప్ప భక్తులు తన్మయ త్వానికి లోనయ్యారు. శబరిమలలో అయ్యప్ప స్వామి ఆలయం వెనుకవైపు ఉన్న పొన్నం బల మేడు దగ్గర కొండగుట్టల్లో ఆకాశంలో కనిపించే దివ్యమైన జ్యోతిని దర్శించారు. అయ్యప్ప భక్తులు చేతులు జోడించి స్వామియే శరణం అయ్యప్ప శరణం జపిస్తూ మకర జ్యోతిని వీక్షిం చారు. సాక్షాత్తు మణికంఠుడే జ్యోతి స్వరూపుడై దర్శనమిచ్చారంటూ అయ్యప్ప భక్తులు తన్మయ త్వానికి లోనయ్యారు. ఈ అపురూప ఘట్టాన్ని కళ్లారా చూసేందుకు వేలాదిగా అయ్యప్ప భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పంబ, పులిమేడ్, నీలికల్ ప్రాంతాల్లో జ్యోతి వీక్షణకు ఏర్పాట్లు చేశారు. ఇరుముడులతో వచ్చిన అయ్యప్పలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల భద్రత కోసం శబరిమల మార్గాల్లో, సన్నిధానం దగ్గర అదనపు పోలీసు బలగాలను, వైద్య సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకపోవడంతో ఇటు పోలీసులు, అటు దేవస్థానం సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. మొత్తంగా 'స్వామియే శరణం అయ్యప్ప' అనే శరణుఘోషతో శబరిమల అంతా ఆధ్యాత్మిక చైతన్యంతో నిండిపోయింది. ఆ దివ్యజ్యోతి దర్శ నంతో భక్తులంగా మనసునిండా ఆ అయ్యప్పను నింపుకుని తిరిగి ఇళ్లకు పయనమయ్యారు.





# డావోస్‌లో తెలంగాణ నెక్స్ట్‌జెన్ లైఫ్‌సైన్సెస్ పాలసీ 2026-30 ప్రకటన

### 2030 నాటికి ప్రపంచంలోని టాప్-3 లైఫ్‌సైన్సెస్ క్లస్టర్లలో అభివృద్ధి

### ఆవిష్కరించనున్న సిఎం రేవంత్‌రెడ్డి, పరిశ్రమలు మంత్రి డి.శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 14:** 2030 నాటికి ప్రపంచంలోని టాప్-3 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో తెలంగాణను అభివృద్ధి చేయడమే లక్ష్యం.. లైఫ్ సైన్సెస్ రంగంలో అత్యాధునిక విభాగాల్లో సామర్థ్యాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి.. గ్రీన్ ఫార్మా సిటీ, ఫ్లాగ్‌షిప్ ఫార్మా విలేజెస్ కార్యక్రమాలతో గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా తెలంగాణ స్థానం మరింత బలోపేతం.. జీనోమ్ వ్యాలీ, హైదరాబాద్‌లో 1బయో - వృద్ధి దశ సంస్థల కోసం తొలిసారిగా ఏర్పాటు చేస్తున్న గ్రోత్‌ఫేజ్ సెంటర్, బయోఫార్మా స్కేల్ అప్ తయారీ కేంద్రం. వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్ సెంటర్ హైదరాబాద్‌లో స్థాపితం వివరాలతో పాటు దావోస్‌లో తెలంగాణ ప్రభుత్వం నెక్స్ట్‌జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రకటించనుంది.
అధునాతన చికిత్సలు, డేటా ఆధారిత పరిశోధనలు, ప్రిసిషన్ మెడిసిన్, సస్టైనబిలిటీ వంటి అంశాల ఆధారంగా ప్రపంచ లైఫ్ సైన్సెస్ రంగం వేగంగా మార్పులు చెందుతున్న తరుణంలో, తెలంగాణ రాష్ట్రం పరిమాణానికి మాత్రమే కాకుండా విలువ, ఆవిష్కరణలు, గ్లోబల్ సమగ్రత ద్వారా నాయకత్వం వహించాలనే స్పష్టమైన, ఆశావహ దృక్పథంతో ముందుకు సాగుతోంది. తెలంగాణ నెక్స్ట్ జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-2030ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు సమక్షంలో, ప్రపంచ పరిశ్రమ నాయకులు, సీనియర్ ప్రభుత్వాధి కారుల మధ్య దావోస్ లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం 2026లో ఆవిష్కరించనున్నారు.



ఈ విధానం రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో కీలక మలుపుగా నిలవనుంది. తెలంగాణకు ఉన్న బలమైన తయారీ రంగ పునాదులను మరింత సమీకరించడంతో పాటు, అత్యాధునిక పరిశోధన, అభివృద్ధి రంగంలో గ్లోబల్ స్థాయిలో పోటీ చేయగల కేంద్రంగా రూపాంతరం చెందేందుకు ఈ పాలసీ దిశానిర్దేశం చేస్తుంది. హైదరాబాద్ ఇప్పటికే ఇలీ లిల్లీ, సానోఫీ, ఎంఎస్‌డీ, నోవార్టిస్, ఆమెజాన్, బీఎంఎస్ వంటి అనేక ప్రముఖ గ్లోబల్ ఫార్మాస్యూటికల్ కంపెనీల కార్యకలాపాలకు కేంద్రంగా ఉంది. భారతదేశ ఔషధ ఉత్పత్తిలో సుమారు 40 శాతం వాటా కలిగిన తెలంగాణ, దశాబ్దాలుగా ఫార్మా తయారీ రంగంలో ప్రపంచ నాయకత్వాన్ని సాధించి, ఆర్థిక శక్తి కేంద్రంగా, చురుకైన పారిశ్రామిక హబ్‌గా పేరు తెచ్చుకుంది. ఈ బలమైన పునాదిపై ఆధారపడి, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలంగాణను గ్లోబల్ వేదికపై ఆరోగ్య సంరక్షణ, లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణల భవిష్యత్తును రూపకల్పన చేసే నాయకత్వ స్థానానికి తీసుకెళ్లాలనే దృష్టిని వ్యక్తం చేస్తున్నారు. ఫార్మాస్యూటికల్ తయారీ, ఆర్ అండ్ డీలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేలా ప్రపంచ స్థాయి, సుస్థిర పారిశ్రామిక క్లస్టర్‌ను తెలంగాణ అభివృద్ధి చేస్తోంది.
కొత్త పాలసీ ద్వారా గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధికి వ్యూహాత్మక రోడ్‌మ్యాప్‌ను ప్రకటించను న్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఉన్న ఈ గ్రీన్ ఫార్మా సిటీ, ఎదుగుతున్న ఏఐ హబ్‌తో సహా ప్రధాన పారిశ్రామిక ప్రాంతాలకు అనుసంధానాన్ని కల్పిస్తుంది. జీరో లిక్విడ్ డిశ్చార్జ్, కేంద్రీకృత వ్యర్థాల నిర్వహణ, శక్తి సామర్థ్య వ్యవస్థలు వంటి పచ్చదనం చర్యలతో అధునాతన మౌలిక సదుపాయాలను సమన్వయం చేస్తూ, 'వర్క్, లివ్, లెర్న్ అండ్ ప్లే' విధానంలో ఈ ప్రాజెక్ట్ రూపకల్పన చేయబడింది. మొత్తంగా తెలంగాణ నెక్స్ట్ జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-2030 గ్లోబల్ లైఫ్ సైన్సెస్, హెల్త్‌కేర్ ఆవిష్కరణల తదుపరి అధ్యాయాన్ని రూపుదిద్దే దిశగా తెలంగాణ సంకల్పాన్ని స్పష్టంగా ప్రకటించే వ్యూహాత్మక ప్రకటనగా నిలుస్తుంది.

**తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్ ప్రధాన బలాలు**

తెలంగాణ ఆసియాలోని ప్రముఖ లైఫ్ సైన్సెస్ హబ్‌లలో ఒకటి. రాష్ట్రంలో 2,000కు పైగా లైఫ్ సైన్సెస్ కంపెనీలు ఉండగా, వీటి సంయుక్త విలువ సుమారు 80 బిలియన్ డాలర్లు. భారతదేశ ఔషధ ఉత్పత్తిలో దాదాపు 40 శాతం వాటా కలిగిన తెలంగాణలో 250కి పైగా యూఎస్‌ఎఫ్‌డీఏ ఆమోదిత తయారీ కేంద్రాలు ఉన్నాయి. ప్రపంచ వ్యాక్సిన్ ఉత్పత్తిలో మూడో వంతు వాటాను కలిగి ఉండటంతో, తెలంగాణకు 'వాక్సిన్ క్యాపిటల్ ఆఫ్ ది వరల్డ్' అనే గుర్తింపు లభించింది.
ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రగతిశీల విధానాలు, క్లస్టర్ ఆధారిత వ్యవస్థ, లోతైన ప్రతిభా వనరులతో హైదరాబాద్‌లో 20కి పైగా లైఫ్ సైన్సెస్, మెడ్‌టెక్ ఇంక్యుబేటర్లు పనిచేస్తూ, గ్లోబల్ స్థాయిలో పోటీగల, ఆవిష్కరణలతో నడిచే రంగంగా అభివృద్ధి చెందింది. ఈ అభివృద్ధి దృక్పథంలో భాగంగా తెలంగాణ గ్లోబల్ లైఫ్ సైన్సెస్ వేదిక ప్రపంచ పరిశ్రమ నాయకులు, పెట్టుబడిదారులు, పరిశోధకులు, విధాన నిర్ణేతలను అనుసంధానించే ప్రధాన వేదికగా నిలుస్తోంది. ఇది రాష్ట్ర ఆవిష్కరణ ఎకో సిస్టమ్‌ను ప్రపంచానికి పరిచయం చేస్తూ... ఉన్నత విలువ కలిగిన భాగస్వామ్యాలను ప్రోత్సహించి, 2030 నాటికి 250 బిలియన్ డాలర్ల లైఫ్ సైన్సెస్ ఆర్థిక వ్యవస్థ నిర్మించాలనే తెలంగాణ లక్ష్యాన్ని వేగవంతం చేస్తోంది.

## తల్లిదండ్రులను కలిసిన తేజ్‌ప్రతాప్‌యాదవ్



**పాట్నా, జనవరి 14:** కుటుంబంతో పాటు ఆర్జేడీకి దూరమైన తేజ్ ప్రతాప్ యాదవ్ చాలా కాలం తర్వాత కుటుంబ సభ్యులను కలిశారు. బీహార్ మాజీ సీఎం రబ్రీ దేవి నివాసానికి వెళ్లారు. తల్లిదండ్రులైన లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీ దేవిని కలిసి వారి పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం పొందారు. తమ్ముడు తేజస్వీ యాదవ్‌ను కూడా తేజ్ ప్రతాప్ కలిశారు. జనవరి 14న మకర సంక్రాంతి సందర్భంగా నిర్వహించే దహిచురా విందుకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారితో ఫొటోలు దిగారు. సోదరుడు తేజస్వి యాదవ్ కుమార్తె కాత్యాయణిని తేజ్ ప్రతాప్ యాదవ్ ఎత్తుకోవంతో పాటు కుమార్తె వరుసైన ఆ చిన్నారితో నవ్వుతూ ఫొటోలు దిగారు. రాజకీయంగా, కుటుంబ పరంగా విభేదాలున్నప్పటికీ తమ బంధాలు చెక్కు చెదరలేదన్న సంకేతాన్ని ఇచ్చారు. మరోవైపు గత ఏడాది చిరకాల స్నేహితురాలితో కలిసి ఉన్న ఫొటోను తేజ్ ప్రతాప్ షేర్ చేయడంతో పాటు ఆమెతో తన సంబంధాన్ని బహిర్గతం చేశారు. దీనిపై ఆగ్రహించిన ఆర్జేడీ అధ్యక్షుడు లాలూప్రసాద్‌యాదవ్ పెద్ద కుమారుడైన తేజ్ ప్రతాప్‌ను కుటుంబంతో పాటు పార్టీ నుంచి వెలివేశారు. అయితే కొత్త పార్టీ ఏర్పాటు చేసిన ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. ఆర్జేడీ కూడా ఘోర పరాజయం పొందింది. ఈ పరిణామాల నేపథ్యంలో తల్లిదండ్రులు, సోదరుడ్ని తేజ్ ప్రతాప్ యాదవ్ కలవడం ప్రాధాన్యత సంతరించుకున్నది.

# గొబ్బెమ్మల పండుగకు పటిష్ట ఏర్పాట్లు

### ఎపి పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు, జనవరి 14, ప్రభాత వార్త - వైద్యం: నెల్లూరు జిల్లాలో పవిత్రమైన పెన్నానది తీరంలో ప్రతి ఏటా సంప్రదాయబద్ధంగా నిర్వహించే గొబ్బమ్మల పండుగ ఏర్పాట్లను రాష్ట్ర పురపాలక పట్ట ణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ బుధవారం అధికారులతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పండుగ ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్టమైన భద్రత, వసతి ఏర్పా ట్లు చేయాలని అధికారులకు దిశానిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ గొబ్బెమ్మల పండుగకు సుమారు 15 వేల మందికి పైగా భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నామని తెలిపారు. అందుకు తగ్గట్టుగానే అన్ని శాఖల అధికారులు సమన్వ యంతో పని చేయాలని సూచించారు. కార్పొరేషన్, పోలీసు, ఫైర్, రెవెన్యూ, ఎలక్ట్రిసిటి, టూరిజం దేవాదాయ శాఖ అధికారులు సమన్వ యంతో పని చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. భక్తుల భద్రత విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరిం చాలని మంత్రి స్పష్టం చేశారు. నీటి అంచున పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గొబ్బె మ్మల పండుగ నిర్వహించే ఏటి ప్రాంతంలో స్వయంగా



మనిషిని దింపి నీటి లోతును పరిశీలించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రద్దీకి అనుగుణంగా తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ వంటి అన్ని మౌలిక వసతులను కల్పించాలని భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. పెన్నా నదీ ఒడ్డున ప్రతి ఏటా గొబ్బమ్మ పండుగ నిర్వ హించడం మన ఆనవాయితీ అని, ఈ పండుగకు 15 వేల మందికి పైగా భక్తులు తలరి వస్తారని అంచనా. అందుకు తగ్గట్టు ఏర్పాట్లు, జాగ్రత్తలు, భద్రతపై అధికారులతో సమీక్ష నిర్వహించాం. ఏటిలో నీటి సదుపాయం ఉన్నందున ఈసారి ఒక పక్కే గొబ్బమ్మల పండుగకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, ఆర్డీవో అనూష, డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, 52వ డివిజన్ కార్పొరేటర్ అస్మా మైనుద్దీన్, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### ఐదుగురు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులపై కేసు నమోదు

## కామారెడ్డి జిల్లాలో 600పైగా వీధికుక్కలకు విషగుళికలు, ఇంజక్షన్లు ఇచ్చి దారుణ హత్య

**హైదరాబాద్, జనవరి 14, ప్రభాతవార్త:** తెలంగాణలో వీధి కుక్కల హత్యలు ఆగడం లేదు. వారం రోజుల క్రితం వరంగల్ జిల్లాలో రెండు వందల కుక్కలను ఇదే రీతిన సామూహికంగా హత్య చేసిన ఉదంతం మరువకముందే కామారెడ్డి జిల్లా భవానీపేట, ఫరీద్‌పేట, వాడి, పాల్వంచలో 600పైగా కుక్కలు అనుమానస్పదంగా మృత్యు



వాత పడ్డాయి. వీటికి ఆహారంలో విషయం పెట్టడంతోపాటు ఇంజక్షన్లు ఇచ్చి చంపారని జంతు ప్రేమికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం ఎన్నికైన సర్పంచులు ఈ ఘాతుకానికి ఒడిగట్టారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఘటనపై ఐదుగురు సర్పం చులతోపాటు పంచాయతీ కార్యదర్శులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నా యి. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి పోలీసు స్టేషన్ పరిధిలోని నాలుగు గ్రామాలలో సోమ, మంగళవారాల్లో పలు చోట్ల వీధి కుక్కలు మర ణించి పడివుండడం కలకలం రేపాయి. కొన్ని శునకాలు రోడ్డు పక్కన పడి వుం డగా మరి కొన్నింటిని గొయ్యి తీసి పూడ్చి పెట్టా రు. ఇది కూడా సరిగ్గా జరగక పోవడంతో చాలా వరకు చనిపోయిన కుక్కల మృత కళేబరాలు సగంవరకు బయట కనిపించాయి. పాల్వంచ మండల కేంద్రంతోపాటు ఫరీద్‌పేట్, బండ రామేశ్వర్‌పల్లి, భవానీపేట, వాడి గ్రామాల్లో 600పైగా వీధి కుక్కలు మరణించడం జంతు ప్రేమికులను కలచివేసింది. కుక్కలు మరణించి ఉన్నచోట విషం గుళికలతో పాటు ఇంజక్షన్లు పడి ఉండ దంతో విషప్రయోగంతోనే వీటిని చంపినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా ఈ ఘటనపై జంతు హక్కుల సంఘం ప్రతినిధులు మాచారెడ్డి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వెటర్నరీ వైద్యులను రప్పించి జెసిబిల సహాయంతో చని పోయిన కుక్కలను వెలికితీసి అక్కడే పంచనామా నిర్వహించారు. కొన్నింటికి పోస్టుమార్టం నిర్వహిం చారు. ఈ ఘటనపై పోలీసులు ఐదు గ్రామాల సర్పంచులతోపాటు పంచాయతీ కార్యదర్శులపై కేసు నమోదు చేశారు. సర్పంచు లతోపాటు పంచాయతీ కార్యదర్శులు కలిసే వీధి కుక్కలను హత్యచేసి వుంటారని పోలీసులు అను మానిస్తున్నారు. దీనిపై జంతు ప్రేమికుడు గౌతం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మాచారెడ్డి పోలీసులు విచారణ చేబట్టారు.

## తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో భోగి సంబరాలు



నెల్లూరు, జనవరి 14 ప్రభాతవార్త: నెల్లూరు నగరంలోని రంగనాయకులపేటలో వెలసిన చారిత్రక ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి వారి దేవస్థానములో భోగి పండుగ పర్వ దినాన్ని పురస్కరించుకుని శ్రీ గోదా రంగనాథ స్వామి వారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహిం చారు. నెల రోజుల పాటు సాగిన ధనుర్మాస ఉత్సవాలు ఈరోజుతో సంపూర్ణ మవ్వడంతో, ఆండాళ్ తల్లి (గోదాదేవి) భక్తికి మెచ్చి రంగనాథ స్వామి ఆమెను పరిణయమాడే ఈ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భోగి పండుగ సందర్భంగా తెల్లవారుజామునే ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ, విశేష అర్చనలు నిర్వహించారు. ధనుర్మాస వ్రత ముగింపు సందర్భంగా 'తిరుప్పావై' ముగింపు పాశురాల పఠనం (శాత్తుమురై) శాస్త్రోక్తంగా జరిగింది. సాయంత్రం 7.00 గం॥లకు శుభ ముహూర్తంలో శ్రీ గోదాదేవి, శ్రీ రంగనాథ స్వామి వార్ల ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలతో, విశేష ఆభరణాలతో అలంకరించి మండపానికి వేంచేపు చేశారు. అర్చకుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ ఎదుర్కోలు ఉత్సవం, పూలమాలల మార్పిడి, మాంగళ్యధారణ మరియు తలంబ్రాల ఘట్టం కన్నులపండువగా సాగింది. కళ్యాణానంతరం భక్తులందరికీ స్వామివారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. లోక కల్యాణం కోసం, పాడిపం టలు వృద్ధి



చెందాలని కోరుతూ నిర్వ హించిన ఈ వేడుకలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఆళ్ల శ్రీనివాస రెడ్డి, అర్చక స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వార్త

మిమ్మల్ని కిందికి లాగుతున్నప్పుడు వినయంగా ఉండటం గొప్ప కాదు. కాని మిమ్మల్ని ఆకాశానికి ఎత్తుతున్నప్పుడు వినయంగా ఉండటమే గొప్ప.

-సెయింట్ బెర్నార్డ్

## ప్రాణాంతక 'పందెం'!

తెలుగు రాష్ట్రాలలో కోడిపందేల జోరుతో భోగి పండుగ మొదలైంది.ఎన్ని ఆంక్షలున్నాముందు గానే పందెం బరులు తెలుగునాట దాదాపుఅన్ని గ్రామాల్లోనూ సాక్షాత్కరించాయి. భారతీయసంస్కృతీ సాంప్రదాయాలకు నెలవుగా ఉండే ఆయారాష్ట్రాలలో సరదా సరదా సంప్రదాయం. కోడి పందేలను వదిలేది లేదని నిర్వాహకులు ఔత్సాహికులు, ఈ పందేల్లో ఎన్నో కోట్లు జూదం, వంటి ఎన్నో ఆటల్లో జూదరుల చేతుల్లో కోట్లు చేతులు మారతాయి కనుక అలాంటివి మానేయాలని కోర్టులు, కోడిపందాలకు అడ్డంనిలుస్తూ పోలీసు యంత్రాంగం, ఏదో సరదాకే కదా! అనుకుంటూ రాజకీయ నేతలూ, సంక్రాంతి సంబరాలను జరిపేసుకున్నారు. కోడి పందేలు ఒకప్పుడు పల్నాడు విద్వేషాలకు కారణమవడం తోవాటిని మరోసారి అమల్లోకి తీసుకురాకూడదని వాంఛించే వారూ ఉన్నారు. ఎవరేమన్నా, ఎవరేమనుకున్నా సంక్రాంతికి కోడి పందేలు జరిగిపోవడం తెలుగునాట విశేషం. కృష్ణా గోదావరి జిల్లాలో విస్తృతమైన స్థాయిలో కోట్లాది రూపాయల పందేల రూపంలో చేతులు మారుతుండడమే కాదు.ఓడిన కోడి మీద పందెం కాసిన వాళ్ల డబ్బులు పోగొట్టుకుంటారు. అక్కడికక్కడ సెటిల్‌మెంట్ జరిగిపోవాల్సిందే. కోస్తా జిల్లాల్లో ప్రధాన గ్రామాలకే ఒకప్పుడు పరిమితమైన కోడి పందేలు పట్నాలకు సమీపంలో ఉండే శివారు ప్రాంతాల్లో కూడా వాటి సందడి కనపడుతోంది.ఆ ప్రాంతం వారికి కోడి పందేలు చూడకపోతే సంక్రాంతి పండుగ జరుపుకున్నట్లే కాదు.పదోపరకో కాదు. ఏటా ఆయా ప్రాంతాల్లో 500 నుంచి 600 కోట్ల వరకు పందేల గెలుపోటముల్లో విజేతలెవరో పరాజితులెవరో 'బరు'ల్లో తేల్చేసుకుంటారు. ఇక్కడ ప్రాణాలుపోతే పోయేవి కోళ్లే. మనుషులకేం కాదు. కనుక ఇక్కడ ప్రాణాపాయం కోళ్లకే.ఇచ్చిపుచ్చుకోడాల్లో కూడా మనుషులమధ్య ఎలాంటి సమస్యా తలెత్తదు. ఓడినా గెలిచినా డబ్బులు నిర్వివాదంగా ఇచ్చేందుకు ఇష్టపడతారు.పందెం కోళ్ల క్రీడ అలాంటిది. అయితే ఈపందెం బరుల చుట్టూ గుండాట, బ్రాకెట్, పేకాట, కేసినోలు వంటి ఆటల దగ్గరే అసలు తగాదాలు తలెత్తే అవకాశం ఉంటుంది. జూద నిరోధక చట్టం కింద వాటిపైకూడా నిషేధాజ్ఞలున్నాయి. పోలీసుల నిఘా ఎంతున్నా ఎవరి పనివారిది. ఏదో మచ్చుకు కొన్ని కేసులుండడం రివాజే. అలా సంక్రాంతి బరులో కోళ్ల విలవిలలాడడంలోనూ జనం ఉత్సాహపడతారు. పందెం కోళ్ల పరువునిలబెట్టకపోతే ఆ కోడిపుంజు మీద బెట్టింగ్‌లు కాసిన వారి జీవితాలు తారుమారవుతాయి. పెద్దపెద్ద బరుల్లేని చోట కొబ్బరి తోటల మధ్య వాటిని ఏర్పాటు చేస్తారు. ఆంధ్రాలో కోడి పందేలకు క్రేజే వేరు. ఒకప్పటి కోళ్లపందేల తీరేవేరు. అదొక పండుగ సంబరం.ఇప్పుడైతే దాని విధివిధానాలు, పందేల జోరు, పందేలు, పై పందేలు కోసు పందేలు పూర్తి ఆధునికత సంతరించుకుంది. ఆధునికత చోటు చేసు కున్న బరుల్లో పందాల తీరును పరిశీలిస్తే కొత్త తరహా పందేలు జరుగుతున్నాయి. తాళ్లరేవు మండలం గోపులంక గ్రామంలో ఏర్పాటు చేసిన మూడు రోజుల పాటు 63పందేలు ఏర్పాటు చేసి ఎక్కువ పందేల్లో గెలిస్తే ఇన్నోవా కారు. అలాగే కోరిపల్లి బరిలో పది జోడీల పందెంలో విజేతకు బుల్లెట్ కానుక ఇచ్చేందుకు ఏర్పాట్లు జరిగాయి. ఇలాంటి విశేషాలెన్నో. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాల్లో కోడిపందేల జోరుఎక్కువగా ఉంది.పల్నాడులో బ్రహ్మనాయుడి కాలం నుంచీ ఉన్నవే.గతంలో ఈపందేలు జరుగని ప్రాంతంలోనూ కొత్తగా ఏర్పాటు చేయడం విశేషం.పందెపు రాయుళ్ల బిచాణాలు ఇప్పుడు బరులువద్దనే. ఈ మూడు రోజులూ వారుఅక్కడే కాలక్షేపం చేస్తారు.బరుల సమీపంలోకొత్తాట, గుండాలు కూడా ఏర్పాటు ఉంటాయి. చాలాప్రాంతాల్లో ఎంతో పలుకుబడి కల రాజకీయ నేతలే బరులను పంచుకుని నిర్వహిస్తారన్నపరిస్థితి ఉంది. ఒకనాడు సరదాగా నిర్వహించుకునే పందేలు ఆధునిక కాలంలో డబ్బులు చేతులు మారి,ఓటమి పాలైన కోడి మీద పందెం కాసిన పందెపు రాయుళ్లు నష్టపోయి ఇంటికెళ్లే పరిస్థితి కన్పిస్తుండడంవల్లనే సుప్రీంకోర్టు కోడి పందాలను కూడా నిషేధించింది. అయినా పందెపురాయుళ్ల తీరుమారలేదు. ఆట ఆగలేదు. కొన్ని సందర్భాలలో తమ సొంత ఆస్తిని కూడా పందెంలో కాస్తుండడం వింటున్నాం. పందెంలో ఓడితే పరువు పోతుందని భావించేవారూ ఉన్నారు. అందుకే పందెం కోళ్లను సంక్రాంతికి నాలుగు నెలలు ముందుగానే బాదం, పిస్తా, జీడిపప్పులు, ఆరారుగా తినిపిస్తూ వాటిని బలిష్ఠంగా పెంచుతారు. కోళ్లకాళ్లకు కట్టే కత్తులను కూడా ప్రత్యేకంగా తయారు చేస్తుంటారు.ఈ క్రీడలో ప్రాణాలు పోయేవి కోళ్లవే.కనుక జంతుసంరక్షణ చట్టం కింద వాటికి రక్షణ ఉంది.అయినా ఎవరూ ఆపందేల నుంచి బయటికి రాలేరు. ఈసీజన్ దాటాక అమెరికాలో కూడా కోడిపందాలు జరుగుతుండడం విశేషం.ప్రాచీన కాలంనాటిసరదాలు, ఆధునికతమార్గంలోకి మారి 'బెట్టింగ్'ల స్థాయికి వెళ్లడమొక్కటే అభ్యంతరం. తెలంగాణలో ప్రధానంగా జంట నగరాలలో చైనా మాంజాలు ప్రాణం తీస్తున్నాయి. రోడ్డు మీద వెళ్లేవారికి గాలిపటాలు ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయి. చిన్నపిల్లల సరదాకోసం వాటిని ఎగరేస్తూ పరుగెట్టడం, గాలి ఎటువైపుకు లాగితే అటువైపు పరిగెడుతూ ఆనందోత్సాహాల మధ్యఎగిరి గంతేయడం ఇంతటి ప్రమాదాన్నితెచ్చి పెడ్తుందని ఎప్పుడూకలలోనైనా అనుకుని ఉండరు. విధుల్లో ఉన్న ఓ పోలీసు అధికారిపై మాంజాదాడి చేసింది.ఇప్పుడాయన ఆసుపత్రిలోఉన్నారు.అందుకే రోడ్ల పైన నడిచేవారు ఎప్పుడు ఏపక్క నుంచి మాంజా వచ్చి మెడకు చుట్టుకుందో జాగ్రత్తగా అప్రమత్తమై ఉండాలని పోలీసు వర్గాలే హెచ్చరిస్తున్నాయి.ప్రాణసంకటంగామారిన ఈ సరదా క్రీడలను నిలిపి వేయడమొక్కటే శరణ్యం.!

పేరు ప్రతిష్ఠలు ఒకే చోట కూర్చుంటే, చెడ్డపేరు ప్రపంచమంతా పరుగు తీస్తుంది.



హరివంశరాయ్ బచన్

ఒకే భాషను శాస్త్రీయంగా అభ్యసిస్తే మిగతా భాషలు సులభతరం అవుతాయి.



మహాత్మాగాంధీ

# పర్షియాలో పహ్లావినా? ప్రజాస్వామ్యమా!

**అధికంగా ఉన్న చమురు నిల్వల వల్ల దేశ ఆదాయం పెరిగినా సంపద కొద్దిమంది చేతుల్లోనే నిక్షిప్తమై ఉండడం చేత ఆర్థిక అసమానతలు పెరిగి సామాజిక అసమానతలు రాజుకున్నాయి. షాల విలాసవంతమైన జీవితం, ప్రభుత్వంలో అవినీతి, పాశ్చాత్యీకరణ ఇస్లాం మత విశ్వాసాలకు ద్రోహం చేసిందని మతగురువుల ఆరోపణ, ముఖ్యంగా అయతొల్లా రొహోల్లా ఖోమెని (ప్రస్తుత సుప్రీం నేత తండ్రి) కూడా వ్యతిరేకించాడు. 'డెత్ టూ షా' అనే నినాదంతో విద్యార్థులు, ప్రజలు నిరసనలు చేపట్టి రాజును పదవి నుంచి దించి దేశం విడిచి పారిపోయేలా చేసి ఇరాన్‌ను ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌గా మార్చారు. ఈ విప్లవానికి అయోతుల్ల రోహల్లా ఖోమెనీ నాయకత్వం వహించాడు.**

డా. కావలి చెన్నయ

మానవ చారిత్రక వికాసంలో ప్ర ప్రథమంగా పర్యావరణ పరిరక్షణ గురించి ప్రస్తావించి,మానవులుమంచిని స్వీకరించి చెడును రూపుమాపడమే అంతిమ లక్ష్యమన్న మతం జొరాష్ట్రియన్/పార్శి మతం( దేవుడు అహురా మజ్దా, స్థాపక ప్రవక్త జోరాస్టర్, మతగ్రంథం జెండ్ అవెస్తా) ప్రభవించిన నేల ఇరాన్(ఆర్య భూమి) / పర్షియా(1935 వరకు పర్షియాగా పిలవబడ్డది). ఎంతో ఘనమైన చరిత్ర కలిగిన పర్షియా ఎన్నో ప్రాచీన నాగరికతలకు పుట్టినిల్లు, క్రీ.పూ 7వ శతాబ్దం నుండి ఆకెమెనిడ్, పార్థియన్, ససానియన్. అరబ్బుల దండయాత్రతో క్రీ.శ 7వ శతాబ్దంలో ఇస్లాం,16వ శతాబ్దంలో షియా ఇస్లాం స్థిరపడి 1979లో ఇరానియన్ విప్లవం ద్వారా ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ ఏర్పడి ప్రస్తుతం షియా మత గురువుల పాలన కొనసాగుతున్నది. పర్షియాను ఎక్కువకాలం పరిపాలించింది సాసానియన్ సామ్రాజ్యానికి చెందిన షాపూర్2 క్రీ.శ 309 నుండి 379 వరకు అంటే 70 సంవత్సరాలు.1921లో బ్రిటిషర్ల సహాయంతో రెజాఖాన్ పహ్లావిల వంశాన్ని స్థాపించాడు. ఇరాన్‌లో షా పహ్లావిల పాలన 1941–1979 మధ్యలో 1963 ప్రారంభమైన 'వైట్ రెవల్యూషన్'లో భాగంగా భూ సంస్కరణలు, పాశ్చాత్యీకరణ,పారిశ్రామిక ఆధునీకరణ,అమెరికాతో బలమైన సంబంధాలు, ఆధునిక సంస్కరణలు, పాశ్చాత్య వస్త్ర వేషాధారణ, మహిళలకు ఓటుహక్కు లాంటి స్వేచ్ఛా స్వతంత్రాల వంటివి ఇస్లాంకు వ్యతిరేకంగా ఉన్నప్పటికీ సహిస్తూ వచ్చారు కానీ నిరంకుశ రాజరికపాలనలో కఠినమైన విధానాలు, అవినీతి, బంధు ప్రీతిలకు వ్యతిరేకంగా 1979లో ఇస్లామిక్ విప్లవానికి దారితీసింది. ముఖ్యంగా సవక్ అనే పోలీసు నిఘా సంస్థ ద్వారా రాజకీయ నాయకులను, రాజకీయ వ్యతిరేకతను అణిచివేశారు. అధికంగా ఉన్న చమురు నిల్వల వల్ల దేశ ఆదాయం పెరిగినా సంపద కొద్దిమంది చేతుల్లోనే నిక్షిప్తమై ఉండడం చేత ఆర్థిక అసమానతలు పెరిగి సామాజిక అసమానతలు రాజుకున్నాయి.షాల విలాసవంతమైన జీవితం, ప్రభుత్వంలో అవినీతి, పాశ్చాత్యీకరణ ఇస్లాం మత విశ్వాసాలకు ద్రోహం చేసిందని మతగురువుల ఆరోపణ, ముఖ్యంగా అయతొల్లా రొహోల్ల ఖోమెని (ప్రస్తుత సుప్రీం నేత తండ్రి )కూడా వ్యతిరేకించాడు. 'డెత్ టూ షా' అనే నినాదంతో విద్యార్థులు, ప్రజలు నిరసనలు చేపట్టి రాజును పదవి నుంచి దించి దేశం విడిచి పారిపోయేలా చేసి ఇరాన్‌ను ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌గా మార్చారు. ఈ విప్లవానికి అయోతుల్ల రోహల్లా ఖోమెనీ నాయకత్వం వహించాడు. నాడు ఏ స్వేచ్ఛా స్వతంత్రాల కొరకు పరితపించి పహలావి రాజులకు వ్యతిరేకంగా పోరాడారో, కానీ నేటి ధార్మిక పాలనలో అవి కలలుగానే మిగిలిపోయాయి. ఎందుకంటే కఠినమైన మత నియమ నిబంధనలు, ప్రజలపై దారుణమైన ప్రభుత్వ నిఘా, మహిళల హక్కులను కాలరాయడం.గతంలో మోహ్సా అమిని అనే 22ఏళ్ల ఇరాన్ యువతి తన బంధువులతో కలిసి టెహ్రాను చేరుకున్నప్పుడు హిజాబ్ సరిగా ధరించలేదని 13.09.2022 న ఇరాన్ మొరాలిటీ పోలీసుల చేత నిర్బంధించబడి 3రోజులు కోమాలోఉండి 16.09.2022నాడు ఆసుపత్రిలో మరణించింది. నివేదికల ప్రకారం పోలీసులు కొట్టడంవల్ల గాయాలతో మరణించింది. ఫలితంగా 'మహిళా,స్వేచ్ఛ,జీవితం' అనే నినాదంతో మహిళల హక్కులకోసం,హిజాబ్ చట్టాలకు, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు జరిగాయి. మహిళలు ప్రధాన పోషించిన ఈ భారీనిరసనలు ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ప్రభుత్వం విచారణకు ఆదేశించినప్పటికీ ఐక్యరాజ్యసమితి వేదిక ప్రకారం నిరసనకారులపై హింసాత్మక అణిచివేత జరిగిందని పేర్కొన్నది. సుమారు 9కోట్లకు పైగా జనాభా ఉన్న ఇరాన్లో అన్నీతానై



పాలిస్తున్న ఖోమేని నియంతృత్వ పోకడల వలన అంతర్జాతీయ ఆంక్షలు దేశాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టింది. సమృద్ధిగా చమురు దొరుకుతున్న ఆంక్షలవల్ల అది దేశం దాటడం లేదు. ద్రవ్యోల్బణం పెరిగిపోయింది, నిత్యవసర వస్తువుల ధరలు నింగినంటుతున్నాయి. 1డాలర్ 14 లక్షల రియాల్స్‌కు సమానం అంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. 1 లీటర్ మంచి నూనె 18లక్షల రియాల్స్, 1కిలో బియ్యం 2.2 లక్షల రియాల్స్, 1 గుడ్ల ట్రే (30 గుడ్లు) 35 లక్షల రియాల్స్. గత ఏడాదితో పోలిస్తే నిత్యవసర వస్తువుల ధరలు 72 శాతం పెరిగాయి. ఆర్థిక స్థితిని భరించలేక ఇరాన్ సెంట్రల్ బ్యాంక్ చీఫ్ తన పదవికి రాజీనామా చేశాడు. మొదట టెహ్రాన్‌లోని గ్రాండ్ బజార్ వ్యాపారులు ప్రారంభించిన సమ్మె విద్యార్థులు, కార్మికులు, మహిళలు, సామాన్య ప్రజల మద్దతుతో దేశమంతట వ్యాపించింది. గమనించాల్సిన విషయం ఏమిటంటే ధరల తగ్గింపే కాదు ఇస్లామిక్ పాలను సైతం అంతం చేయాలని ప్రజలు ఉద్యమిస్తున్నారు. ఒక వృద్ధ మహిళ నేను 47 సంవత్సరాల క్రితమే చనిపోయాను ఎవరికి భయపడను అని తన ముఖానికి రక్తం పూసుకుని '1979 నుండి ఇస్లామిక్ పాలనలో మా హక్కులు కోల్పోయి దేశంలో బంది అయిపోయాం" అంటూ నిరసనలో పాల్గొన్నది. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. మతఛాందస ఇస్లామిక్ పాలనకు వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చిన ప్రజలు 'మేము ఇరానీయులం 2539 సంవత్సరాల క్రితం మానవహక్కుల పితామహుడైన సైరస్ వారసులమంటూ' మానవ హక్కుల మనుగడ కోసం పోరాడుతున్నామంటున్నారు. ఐ యాం నాట్ ముస్లిం, ఐ యాం పర్షియన్, ఐ హేట్ ఇస్లాం అంటూ నిరసన తెలుపుతున్నారని మాధ్యమాల ద్వారా తెలుస్తుంది. టెహ్రాన్‌లోని అల్ రసూల్ మసీదు అత్యున్నత మతనేత ఖోమేని కార్యకలాపాలకు, అధికారిక ప్రసంగాలకు కేంద్ర స్థానం అట్టి మసీదుకే ప్రజలు నిప్పు పెట్టారని అంటున్నారు.స్వేచ్ఛ అనుకూల నిరసన కారులు లండన్‌లో ఇరాన్ రాయబారం కార్యాలయం పై కూడా ప్రస్తుత ఇరాన్ జెండాను తొలగించి గతపర్షియన్ జెండాను పెట్టినట్టు తెలుస్తున్నది.పహిలావీ రాజు అనుకూల వర్గం 'నియంత అంతం, ఇస్లామిక్ రిపబ్లిక్ అంతం, ఇది మా చివరి పోరాటం,పహలావి తిరిగి వస్తాడు' అని ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలుపుతున్నారు. చివరి రాజు కుమారుడైన అమెరికాలో ఉంటున్న పహ్లావి ఇరాన్ ప్రజలందరూ పెద్దఎత్తున వీధుల్లోకి వచ్చి అష్టదిగ్బంధనం చేసి దేశవ్యాప్తంగా నిరసనలో పాల్గొనాలని పిలుపునిస్తున్నాడు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌సైతం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రజలపై హింసాత్మక చర్యలకు పాల్పడితే అమెరికా జోక్యం చేసుకోవాల్సి వస్తుందని హెచ్చరించాడు. ప్రతిగా ఖోమేని అమెరికాలోని సమస్యలను చూసుకోవాలని ఇతర దేశాల విషయాలలో జోక్యం చేసుకోవడానికి ప్రయత్నించరాదని ట్రంప్‌కు హితబోధ చేశాడు.కొందరు మహిళలుఅయితే ఏకంగా హిజాబులు తొలగించి ఫ్యాషన్ వస్త్రాలు ధరించి నిరసనల్లో పాల్గొంటూ ఖో చిత్రపటాన్ని కాల్చి ఆ మంటతో సిగరెట్లను వెలిగించుకుంటున్నారు. ఇరాన్ అటార్నీ జనరల్ మొహమ్మద్ మొవహది ఆజాద్ నిరసనకారులను తీవ్రమైన పదజాలంతో హెచ్చరిస్తూ 'ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలలో, నిరసన కార్యక్రమాలలో పాల్గొనే ప్రతి ఒక్కరిని అత్యంత కఠిన శిక్షలు విధిస్తామని,అలాంటి వారు దైవ వ్యతిరేకులని వారికి మరణ శిక్షలువిధిస్తామని తెలిపాడు'.అమెరికాలో నివాసం ఉంటున్న చివరి రాజు కుమారుడు ఇరానీయులను 'మీరందరూ జాతీయ జెండాలు, జాతీయ చిహ్నాలతో వీధుల్లోకి వచ్చేయండి. కేవలం వీధుల్లోకి వస్తే సరిపోదునగరాల కూడళ్లను ఆక్రమించండి. నేను కూడా ఉద్యమకారుడిగా మారుతా. త్వరలోనే మాతృభూమిపై అడుగుపెడతా' అని వీడియో సందేశంలో పేర్కొన్నాడు. కాలం ఎలా మారుతుందో ఎవరు చెప్పలేరు. 1921లో సాధారణ సైనిక అధికారి అయిన రేజా ఖాన్ బ్రిటిష్ అధికారులతో కలిసి కుట్ర చేసి అధికారంలోకి వచ్చాడు. 1925లో క్వాజర్ వంశాన్ని గద్దె దించి, మజ్లీస్ (ఇరాన్ పార్లమెంటు) షా/ రాజుగా ఎన్నుకోబడ్డాడు. అప్పటినుండి 1978 లో రాజుకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల ఫలితంగా 1979లో దేశం విడిచి పారిపోయాడు. అదే రాజ వంశికుడు మళ్లీ కావాలని ఒక వర్గం దేశ ప్రజలు కోరుకుంటున్నారు అంటే విధి ఎవరినివదలదు. మతం మానవత్వాన్ని మహోన్నతంగా మార్చేదిగా ఉండాలి కానీ మానవత్వాన్ని మంటగలిపేదిగా మారకూడదు.కానీ నేడు చూస్తున్నదంత గందరగోళంగా కనిపిస్తున్నది.ఏదిఏమైనప్పటికీ ఇరాన్ ప్రజలు తమకు నచ్చిన స్థిరమైన ప్రభుత్వాన్ని ఎన్నుకొని సుఖశాంతులతో బ్రతకాలని కోరుకుందాం. •

# మహా డ్యాం ప్రాజెక్టు పర్యావరణానికి సవాలు


సి. హెచ్.ప్రతాప్

చైనా బ్రహ్మపుత్ర నదిపై నిర్మిస్తున్న మహా డ్యాం ప్రాజెక్టు ప్రస్తుతం దక్షిణ ఆసియాలోనే అత్యంత గంభీరమైన భౌగోళిక,పర్యావరణ సవాలుగా మారింది. టిబెట్ స్వయంప్రతిపత్తి ప్రాంతంలోని మెడోగ్ కౌంటీలో,బ్రహ్మపుత్ర నది (త్సాంగ్పో) అత్యంత లోతైన మలుపు తిరిగే 'గ్రేట్ బెండ్' వద్ద ఈ భారీ ప్రాజెక్టును చైనా చేపట్టింది. సుమారు 60 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు, ప్రపంచంలోనే అతిపెద్దదైన త్రీ గోర్జెస్ డ్యాంకంటే మూడు రెట్లు ఎక్కువ విద్యుత్తును ఉత్పత్తి చేస్తుందని అంచనా. ఈ ప్రాజెక్టు ప్రాముఖ్యతను స్వయంగా చైనాఅధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తన ప్రసంగాల్లో ప్రస్తావించడం చూస్తుంటే, దీనిని బీజింగ్ ఒక జాతీయ ప్రాధాన్యత కలిగినవ్యూహాత్మక అంశంగా పరిగణిస్తున్నట్లు స్పష్టమవుతోంది. అయితే, ఈ భారీ నిర్మాణం దిగువన ఉన్న భారత్, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో పెను ఆందోళనలను రేకెత్తిస్తోంది. ఎందుకంటే ఇది ఆ దేశాల జల భద్రతను నేరుగా ప్రభావితం చేస్తుంది. టిబెట్‌లో పుట్టిన ఈ నది, భారత ఈశాన్య రాష్ట్రాల్లో సియాంగ్‌గా బ్రహ్మపుత్రగా ప్రవహించి, చివరకు బంగ్లాదేశ్‌లో జమునగా సముద్రంలో కలుస్తుంది. ఇది కేవలం భౌగోళిక ప్రవాహం మాత్రమే కాదు, కోట్ల మంది ప్రజల ఆహార భద్రతకు, ఈశాన్య భారతం బంగ్లాదేశ్ వ్యవసాయరంగాలకు వెన్నెముక వంటిది. చైనా ఈ నదిపై పూర్తి నియంత్రణ సాధిస్తే, భవిష్యత్తులో నీటిని ఒక రాజకీయ ఆయుధంగా వాడే అవకాశం ఉందని రక్షణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా యుద్ధ సమయాల్లో లేదా సరిహద్దు ఉద్రిక్తతల తరుణంలో, ఎగువన ఉన్న డ్యాంల నుండి ఒక్కసారిగా భారీ మొత్తంలో నీటిని వదిలితే దిగువ ప్రాంతాల్లో కృత్రిమ వరదలు సంభవించే ప్రమాదం ఉంది. దీనినే నిపుణులు 'వాటర్ బాంబ్' అని అభివర్ణిస్తున్నారు. అదే సమయంలో, ఎండాకాలంలో చైనా నీటిని నిలిపివేస్తే, దిగువన ఉన్న వ్యవసాయ భూములు ఎడారిగా మారే ప్రమాదం ఉంది. ఇది పెను ఆర్థిక సంక్షోభానికి దారితీస్తుంది.పర్యావరణపరంగా చూస్తే,హిమాలయ ప్రాంతం భూకంపాలకుఅత్యంత సున్నితమైనది. అటువంటి చోట ఇంత పెద్దడ్యాం నిర్మాణం వల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుంది. ఈశాన్య భారతంలోని కాజీరంగా వంటి జాతీయ పార్కులు అక్కడి అరుదైన జీవవైవిధ్యం ఈ నది ప్రవాహంపైనే ఆధా రపడి ఉన్నాయి. ఒకవేళ డ్యాం వల్ల నదీ ప్రవాహంలోని పూడిక తగ్గిపోతే, నేల సారవంతం కాకుండా పోయి వ్యవ సాయం కుప్పకూలుతుంది. బంగ్లాదేశ్ వంటి డెల్టా దేశాల్లో తీపి నీటి ప్రవాహం తగ్గితే సముద్రపు ఉప్పునీరు భూమిలోకి చొచ్చుకొచ్చి తాగునీటి కొరతను మరింత తీవ్రం చేస్తుంది. చైనా ఈ ప్రాజెక్టు వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని చెబుతున్నా,పారదర్శకమైన సమాచార మార్పిడి లేకపోవడం వల్ల ఆందోళనలు పెరుగుతున్నాయి. ముఖ్యంగాభారత్,చైనా మధ్య నదీజలాల పంపిణీకి సంబంధించి ఇప్పటివరకుఎటువంటి అధికారిక ఒప్పందంలేదు.నదులు రాజకీయ సరిహద్దులకు అతీతమైనవి, కాబట్టి వాటి నిర్వహణలోపారదర్శకత, పొరుగుదేశాల మధ్యసహకారం అత్యంత కీలకం. •

# ఆశలు చిగురించిన 'కొత్త' సంక్రాంతి

అప్పన్న గొనప

సంక్రాంతి అంటే ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కేవలం ఒక పండుగ కాదు. అది కష్టకాలానికి ముగింపు, ఆశల పంటకు ఆరంభం. వానలు పడి, విత్తనాలు మొలిచి, పంట చేతికొచ్చినప్పుడు రైతు ముఖంలో కనిపించే సంతృప్తే సంక్రాంతి ఆత్మ. అదే భావన ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయ, ఆర్థిక జీవితాల్లో మళ్లీ కనిపించడం మొదలైంది. ఎన్నాళ్లుగానో అయోమయం, విధ్వంసం,నిరాశల మధ్య నలిగిపోయిన రాష్ట్రం ఇప్పుడు వికాసం అనే కొత్త కాలానికి అడుగుపెడుతోంది. కూటమి పాలనతో,చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఇది నిజమైన సంక్రాంతిలా అనిపిస్తోంది.గత కొన్నేళ్లుగా రాష్ట్రం అనుభవించిన పరిస్థితులు ఒక ఎండాకాలంలా ఉన్నాయి. రాజధాని విషయంలో స్పష్టతలేకపోవడం, పరిశ్రమలు వెనక్కివెళ్లిపోవడం, పెట్టుబడిదారుల్లో నమ్మకం కోల్పోవడం,యువత ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లడం ఇవి అన్నీకలిసి రాష్ట్రభవిష్యత్తుపై అనిశ్చితి మబ్బులు కమ్మేశాయి. సంక్షేమ పథకాలు ఉన్నప్పటికీ అవిపండని పంటలాగా కనిపించాయి. తాత్కాలిక ఉపశమనం ఇచ్చినా దీర్ఘకాలిక భరోసా ఇవ్వలేకపోయాయి.ఈపరిస్థితుల్లో ప్రజలు కోరుకున్నది కొత్త హామీలు కాదు, ఒక స్థిరమైనదారి, ఒక అనుభవజ్ఞుడైన రైతు చేతిలో పంట భవిష్యత్తునుపెట్టినట్లైన నాయకత్వం.గతంలో హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా మార్చిన అనుభవం,మౌలిక వసతుల అభివృద్ధిపై చూపిన శ్రద్ధ,పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణం సృష్టించిన తీరు ఇవన్నీ ప్రజల జ్ఞాపకాల్లో ఇంకా బలంగా ఉన్నాయి. అదే అనుభవం ఇప్పుడు విభజిత ఆంధ్రప్రదేశ్‌కు అత్యవసరం. అందుకే ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడాన్ని ప్రజలు ఒక కొత్త కాలం ఆరంభంగా చూస్తున్నారు. కూటమి పాలన అనేది కూడా ఈ సంక్రాంతి భావనకు దగ్గరగా ఉంటుంది. ఒకే ఇంట్లో అందరూ కలిసి పండుగ జరుపుకున్నట్టు, తెలుగుదేశం పార్టీ, బీజేపీ, జనసేన కలిసి రాష్ట్ర భవిష్యత్తును ముందుంచుకుని నిర్ణయాలుతీసుకోవడం ఈపాలన ప్రత్యేకత. భిన్నమైన రాజకీయ అభిప్రాయాలున్నా, రాష్ట్ర ప్రయోజనం ముందు వాటిని పక్కన పెట్టి ముందుకు సాగాలన్న భావన స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భాగస్వామ్య పార్టీలతో మమేకమై, సంప్రదింపులతో నిర్ణయాలు తీసుకునే విధానం పరిపక్వ పాలనకు నిదర్శనం. ఇది రాజకీయ లాభాలకంటే ప్రజల జీవన ప్రమాణాల్ని మెరుగుపరచే దిశగా సాగుతున్న పాలనగా కనిపిస్తోంది. అభివృద్ధి అనే పంట పండాలంటే పెట్టుబడులు అనే విత్తనాలు అవసరం. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో గూగుల్ డేటా సెంటర్ వంటి భారీ పెట్టుబడులు రావడం రాష్ట్రానికి వచ్చిన మంచి శకునంలా ఉంది. ప్రపంచ స్థాయి సంస్థలు ఒక రాష్ట్రాన్ని ఎంచుకుంటే,అక్కడ పాలనా స్థిరత్వం, విధాన స్పష్టత, భవిష్యత్తుపై నమ్మకం ఉన్నట్టే. ఐటీపరిశ్రమలు రాష్ట్రానికి రావడం వల్ల యువతకు ఉద్యోగాలు లభిస్తాయి,అనుబంధ రంగాలు అభివృద్ధి చెందు



తాయి. ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి వస్తుంది. ఇది కేవలం ఒక రంగానికి పరిమితం కాకుండా రాష్ట్ర మొత్తం అభివృద్ధికి దోహదపడే అంశం.ఐటీ రంగం విస్తరణ రాష్ట్రవ్యాప్తంగా జరగాల్సిన అవసరం ఉంది. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి వంటి నగరాలు ఐటీ కేంద్రాలుగా ఎదిగితే, అభివృద్ధి సమానంగా పంచబడుతుంది. ఇది గ్రామాల నుంచి పట్టణాలకు వలసలను తగ్గిస్తుంది. కుటుంబాలు విడిపోవడం ఆపుతుంది. యువతకు తమ స్వరాష్ట్రంలోనే భవిష్యత్తు కనిపిస్తే అదే నిజమైన సంక్రాంతి కానుక. చంద్రబాబు నాయుడి అనుభవం ఈ దిశగా రాష్ట్రాన్ని నడిపించగలదన్న నమ్మకం ప్రజల్లో ఉంది.మౌలిక వసతుల అభివృద్ధి అనేది పంటకు నీటిలాంటిది.ఈనేపథ్యంలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణంలో కీలక మలుపు. ఇది రాష్ట్రాన్ని ప్రపంచంతో కలుపుతుంది. విమానాశ్రయం చుట్టూ పరిశ్రమలు,లాజిస్టిక్స్ కేంద్రాలు, సేవారంగాలు అభివృద్ధి చెందుతాయి. ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఇది ఒక కొత్తఉదయంలా మారే అవకాశంఉంది. పర్యాటకం,వాణిజ్యం,పెట్టుబడులు కలిసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలం చేకూరుస్తాయి. వ్యవసాయం ఆంధ్రప్రదేశ్‌కు ప్రాణం. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. ఈ నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టు కోట్లాది రైతుల ఆశలకు ప్రతీక. ఇది కేవలం ఒక సాగునీటి ప్రాజెక్టు కాదు, తరతరాలుగా ఎదురుచూస్తున్న నీటిభద్రతకు సమాధానం.పోలవరం పూర్తయితే లక్షలాది ఎకరాలకు నీరు అందుతుంది, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పండుగ వాతావరణాన్ని సంతరించుకుంటుంది. ఇది నిజమైన సంక్రాంతి కానుక. ఈ ప్రాజెక్టును పూర్తి చేయడంలో కూటమి ప్రభుత్వం చూపించబోయే చిత్తశుద్ధే రైతులనమ్మకానికి కొలమానం అవుతుంది.రాజధాని అమరావతి అంశం కూడా ఆంధ్రప్రదేశ్ ఆత్మగౌరవంతో ముడిపడి ఉంది. రాజధాని లేకుండా పాలన స్థిరపడదు, పెట్టుబడులు రావు, యువతకు భవిష్యత్తుపై నమ్మకం కలగదు. అమరావతి అనేది కేవలం భవనాల సమాహారం కాదు అది ఒక దృక్పథం, ఒక ఆర్థిక చక్రం.అమరావతిని స్థిరంగా అభివృద్ధి చేయాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయం రాష్ట్రానికి అవసరమైన స్థిరత్వాన్ని తీసుకురాగలదు. ఇదిపంటకు గోదాములా, అభివృద్ధికి ఆధారంగా నిలుస్తుంది. అభివృద్ధి ఫలాలుప్రజల జీవితాల్లో కనిపించడమే అసలైన లక్ష్యం.సంక్షేమ పథకాలు అవసరమే కానీ అవి శాశ్వత పరిష్కారంగా మారాలి. చేతికి డబ్బు ఇవ్వడమేకాదు, చేతికి పని ఇవ్వడమే నిజమైన సంక్షేమం. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు పెరిగితే యువత స్వయం ఆధారితంగా ఎదుగుతుంది. మహిళలకు ఆర్థికస్వాతంత్ర్యం లభిస్తే కుటుంబాలు బలపడతాయి. రైతుకు గౌరవప్రదమైన ఆదాయం వస్తే గ్రామాలు పండుగవాతావరణాన్ని సంతరించుకుంటాయి. కూటమి పాలనలో కనిపిస్తున్న మరో సానుకూల అంశం కేంద్రంతో సమన్వయం. బీజేపీ, జనసేన భాగస్వామ్యంతో తీసుకునే నిర్ణయాలు రాష్ట్రానికి రావాల్సిన వనరులను సులభతరం చేస్తాయి. జాతీయ ప్రాజెక్టులు వేగంగా ముందుకు సాగుతాయి. ఇది రాజకీయ లాభాలకంటే ప్రజల భవిష్యత్తుకు మేలు చేసే అంశం. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. పాలనలో స్పష్టత పెరుగుతోంది,పెట్టుబడిదారుల్లో నమ్మకం తిరిగి వస్తోంది, ప్రజల్లో ఆశ చిగురిస్తోంది. ఇది ఇంకా ఆరంభ దశే అయినా, దిశ మాత్రం స్పష్టంగా ఉంది. ఇప్పుడు అవసరమైనది ఈ ప్రయాణాన్ని ఆపకుండా ముందుకు నడిపించడం. వేసిన విత్తనాలు ఫలించాలంటే నిరంతర శ్రమ, క్రమశిక్షణ అవసరం.ప్రజలనమ్మకమే ఎరువుగా, బాధ్యతాయుత పాలనే నీటిగా మారాలి. సంక్రాంతి పండుగలో గాలిపటాలు ఆకాశంలో ఎగిరినట్టు, ఆంధ్రప్రదేశ్ కూడా ఇప్పుడు ఎత్తుల వైపు చూస్తోంది. కానీ ఆకాశాన్ని తాకాలం

## ప్రజావాక్కు



### నూతన నాయకత్వం

ప్రపంచం నేడు ఎదుర్కొంటున్న వాతావరణ సంక్షోభం మానవ మనుగడకే సవాలుగా మారింది. ఈ క్రమంలో అంతర్జాతీయ వాతావరణ పరిపాలన నుండి అమెరికా వంటిఅగ్రరాజ్యం వైదొలగడంఆందోళన కలిగించినప్పటికీ, అది ఒక నూతన నాయకత్వ ఆవిర్భావానికి దారితీస్తోంది. గతంలో ప్రపంచ నిర్ణయాలు కేవలం ధనిక దేశాల ప్రయోజనాల చుట్టూ తిరిగేవి,కానీప్రస్తుత ఖాళీని భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు భర్తీ చేసే అవకాశం లభించింది.ముఖ్యంగా సౌరశక్తి, హరిత హైడ్రోజన్ వంటి స్వచ్ఛ ఇంధనవనరుల వినియోగంలో భారత్ సాధిస్తున్న పురోగతిప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తోంది. అమెరికా లేనిపక్షంలో,అభివృద్ధి చెందుతున్నదేశాలు తమ అభివృద్ధి హక్కునుకాపాడుకుంటూనే పర్యావరణ పరిరక్షణను ఎలాసాధించవచ్చోప్రపంచవేదికపైబలంగావినిపించగలవు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### అంబేద్కర్ పేరు పెట్టాలి

**కాకతీయుల** కాలంలో అన్ని రంగాలలో పేరు ప్రతిష్టలు పొందిన ప్రాంతాలను గుర్తించవలసిన అవసరం ఎంతైనా ఉంది. సాంఘిక సంక్షేమ వసతిగృహాలకు. రెసిడెన్షియల్ గురుకుల విద్యాసంస్థలకు,రాష్ట్రంలోని గ్రంథాలయాలకు అంబేద్కర్ గారిపేరు పెట్టాలి.అంబేద్కర్ గారిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత విద్యలను అభ్యసించిన వివిధ యూనివర్సిటీల నుండి డాక్టరేట్‌పట్టా పొందిన విద్యావంతులకు, పరిశోధకులకు, అంబేద్కర్ విద్యార్థత అవార్డులను ప్రధానంచేయాలి.అంబేద్కర్‌గారి పేరున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదవిద్యార్థుల కోసం స్కాలర్‌షిప్‌లను 2026–2027 విద్యా సంవత్సరం నుండి ప్రారంభించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### రాయితీ ఇవ్వాలి

**సాధారణంగా** సీనియర్ సిటిజన్ అన్న భావం కేవలం వయస్సు మాత్రమే60 దాటినవారే మాత్రంకాదు, ఉద్యోగం లేక కుటుంబ జీవితంలో ఎన్నో అవాంతరాలు, సమస్యలు ఎదుర్కొని నిలబడినవారు.వారికి మిగిలిన పౌరులతో పాటు ఏదైనా ప్రజా వ్యవహారాల్లో రాయితీ ఇవ్వడం ప్రభుత్వంవారికిచ్చే గౌరవం,ఉన్నతత్వం. కానీ రైల్వే శాఖ దాన్ని ఇచ్చేందుకు ఆర్థిక భారాన్ని చూపి నిరాకరించింది.

- బి. మేఘనాథం, విశాఖపట్నం

### పెరుగుతున్న అంతర్జాల నేరాలు

**సాంకేతిక** విప్లవం వేగంగా విస్తరిస్తోన్నంతలో, అంతర్జాల నేరాల కేసులు కూడా రోజురోజుకు పెరుగుతున్నాయి. స్నేహాలు, పరిచయాల కోసం రూపొందిన డేటింగ్ యాప్‌లు ఇప్పుడు నేరగాళ్లకు సులభమైన వేట వేదికలుగా మారాయి. యువత, ఒంటరి వ్యక్తులు స్నేహం కోసం అడుగుతారు. నేరగాళ్లు ఆ భావోద్వేగ అడుగునే దోపిడీగామలుస్తున్నారు.మోసాల మూలం మానసిక బలహీనత,నేరగాళ్లు ఒంటరితనం,భావోద్వేగ ఆధార పడుదల,శారీరక ఆకర్షణలను గుర్తించి,నమ్మకాన్ని సంపాదించి, ఆర్థికంగాదోచుతారు. కొందరు దృశ్య సంభాషణలను రికార్డు చేసి భయపెట్టడం ద్వారా డబ్బు వసూలు చేస్తారు. బాధితులు భయంతో మౌనం పాటిస్తారు. ఫిర్యాదు చేయలేరు.

- కె.రామారావు, నల్గొండ జిల్లా

### పునర్విభజన

**ఉత్తరాది** జనాభా పెరగడంతో జనాభా ప్రాతిపదికగా రాజకీయ సీట్ల కేటాయింపు అనికేంద్రం ప్రయత్నం చేయడంతో దక్షిణాది రాష్ట్రాలు సమరాజకీయ ప్రాతినిధ్యంకోల్పోయే ప్రమాదం ఉంది. అభివృద్ధి ప్రేరేపిత విధానాలు విద్య,వైద్యం సౌకర్యాలు పెంచడంలో దక్షిణాదిరాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. అంటే 8వప్రణాళిక నాటిలక్ష్యాన్ని దక్షిణాదిరాష్ట్రాలు తూచా తప్పకుండా అమలు చేస్తున్నాయి. అయితే 2028లో నియోజక వర్గాలకు పునర్ విభజన చేయడం అది జనాభా ఆధారంగా కావడంతో ఒక్కఉత్తరాది రాష్ట్రాలపైన ఫోకస్‌పెడితే చాలు శాశ్వతంగా అధికారంలో ఉండొచ్చు అనే వైఖరికి కేంద్రం వచ్చినట్టు ఉంది. అది చాలా పెద్ద ప్రమాదం. అయితే కేంద్రం అభివృద్ధిని ఆవి అమలుచేస్తున్న పథకాలు వాటి తీరుతెన్నులు ఆ రాష్ట్రాలు సాధించిన అభివృద్ధిని కూడా లెక్కలోకి తీసుకోవాలి.

- భారత అవినాష్, జనగామ

### భయపెడుతున్న రోడ్డు ప్రమాదాలు!

**రాష్ట్రంలో** రోడ్డు ప్రమాదాల సంఖ్య భయం గొలిపే స్థాయిలో పెరిగిపోతోంది. రోడ్లపరిస్థితి అధ్వానంగా తయారుకావడం, ట్రాఫిక్ నిబంధనలను కూడా పాటించకపోవడం, మితిమీరిన వేగం,కాలంచెల్లినవాహనాలు,పరిమితికి మించినలోడ్‌పరుగులు తీసే లారీలు, ట్యాంకర్లు రోడ్డు ప్రమాదాలకు నేపథ్యంగా నిలుస్తున్నాయన్నది వాస్తవం. దీనికితోడు ఇటీవల కాలంలో 'సెల్ రైడింగ్' విపరీతంగా పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ డ్రైవింగ్ వల్ల డ్రైవింగ్ చేసేవారితోపాటు ఎదురుగా వస్తున్న వారు కూడా మరణించే ప్రమాదం ఉంది.

-ఎస్. లక్ష్మీనారాయణ, కరీంనగర్ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఉగ్రసంస్థల్లో చీలికలు?

## భారత్ ఇంటెలిజెన్స్ గుర్తింపు



**న్యూఢిల్లీ, జనవరి 14:** పాకిస్థాన్‌కు అత్యంత ప్రీతిపాత్రమైన ఉగ్రవాద సంస్థ లష్కరే తొయిబాలో పెద్ద చీలిక రాబోందని, దీనివల్ల దాయాది పరిస్థితి మరింత గందరగోళంగా మారే అవకాశం ఉందని భారత నిఘా వర్గాలు పేర్కొన్నాయి. దశాబ్దాలుగా పాకిస్థాన్ ప్రభుత్వానికి నమ్మకమైన ఆయుధంగా ఉన్న లష్కర్‌లో ఇంతకు ముందెన్నడూ ఇలాంటి తిరుగుబాటు చోటు చేసుకోలేదు. లష్కరే ఎప్పుడూ పాక్ గూఢచారి సంస్థ ఇంటర్‌సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ చెప్పినట్లే నడుచుకుంది. ఇటీవల కొన్ని నిర్ణయాలపై ఆ సంస్థలోని కొందరు కీలక నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి ఒకరు తెలిపారు. ముఖ్యంగా ఆపరేషన్ సింధూర్ తర్వాత లష్కరే చాలా ఆస్తులను కోల్పోయింది. అప్పటి నుంచి అది కోలుకోవడం చాలా కష్టమైంది. ఐఎస్ఐ, పాకిస్థాన్ సైన్యం తమను సరిగ్గా కాపాడలేదని లష్కరే ఉగ్రవాద సంస్థల్లో చాలామంది భావిస్తున్నారు. విభేదాలను పరిష్కరించడానికి ఐఎస్ఐ ప్రయత్నించినా తమను తాలిబాన్, తెహ్రీక్ ఇ తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి), బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఎ) వంటి సంస్థలపైకి ఉసిగొల్పాలనే పాక్ సైన్యం, ఐఎస్ఐ నిర్ణయం చాలామంది లష్కరే కార్యకర్తలకు నచ్చలేదు. చైనా, అమెరికా వంటి దేశాల ప్రయోజనాల కోసం, ముఖ్యంగా బలూచిస్థాన్‌లోని అరుదైన ఖనిజాల కోసం పాకిస్థాన్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని వారు భావిస్తున్నారు. టీటీపీ, బీఎల్ఏ సంస్థలు బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తుంఖ్వాలో పాకిస్థాన్ సైన్యంతో పోరాడుతున్నాయి. వారిని ఎదుర్కోలేక ఇస్లామిక్ స్టేట్ ఖొరసాన్ ప్రావిన్సు (ఐసిస్‌కె)తో కలిసి లష్కరేను పాక్ సైన్యం రంగంలోకి దించింది. మన సొంత ప్రజలతో ఎందుకు పోరాడాలి చైనా, పశ్చిమ దేశాల ప్రయోజనాల కోసం ఎందుకు పోరాడాలి అని లష్కర్ నాయ కత్వం ప్రశ్నిస్తోంది. ఐఎస్కేపీతో లష్కరే తొయిబాకు సహజంగానే పొసగదు. ఎందుకంటే దీనిని తాలిబన్లకు శత్రువులుగా పరిగణిస్తుంది. లష్కరే ఎప్పుడూ తాలిబాన్‌లకు మద్దతుగా నిలుస్తుంది. ఇప్పుడు పాకిస్థాన్ సైన్యం ఆఫ్గనిస్థాన్‌లో తాలిబాన్‌లతో పోరాడటం లష్కరే నాయకత్వానికి మరింత ఆగ్రహం తెప్పించింది. మాపై మరీ ఎక్కువ భారం మోపుతున్నారు అని కార్యకర్తలు భావిస్తున్నారు. మన ప్రజలతో ఎందుకు పోరాడాలో నాయకత్వం మాకు చెప్పలేక పోతోంది. మనమంతా కలిసికట్టుగా ఉండి, కేవలం భారత్, పశ్చిమ దేశాలపైనే పోరాడాలి అని కార్యకర్తలు అంటున్నారు. లష్కర్ కమాండర్ మహమ్మద్ అష్ఫాక్ రానా పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌లపై విరుచుకుపడ్డారు. వారు మమ్మల్ని కాపాడటంలో విఫలమయ్యారు.. దేశాన్ని అప్పుల్లో ముంచారు. అప్పుగా తెచ్చిన డబ్బులో సగం అయినా సరిగ్గా వాడితే దేశం బాగుపడేది అని రానా అన్నాడు. ఈ పరిణామాలన్నీ లష్కర్‌లో చీలికకు సంకేతాలని అధికారులు అంటున్నారు. హఫీజ్ సయీద్ బయట ప్రపంచానికి కనిపించకపోవడం కూడా ఏదో తేడాగా ఉందనే సంకేతాలు వెలువడుతున్నాయి. లష్కరే తొయిబా బహిరంగంగా తిరుగుబాటు చేస్తే అది చాలా ప్రమాదకరం. దానిలో చాలామంది కార్యకర్తలు అంకిత భావంతో ఉంటారు. వారు తిరుగుబాటు చేసి టీటీపీ వంటి సంస్థల్లో చేరితే, పాకిస్థాన్ ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బ తగులుతుంది. పాకిస్థాన్‌లో హింస పెరిగి, ఉగ్రవాద సంస్థలు స్వతంత్రంగా వ్యవహరిస్తే, అది మొత్తం ప్రాంతానికి భద్రతాపరమైన ముప్పుగా మారుతుంది. లష్కరేలో ఇలా జరిగితే, త్వరలోనే జైషే మహమ్మద్‌లోనూ ఇలాంటి పరిణామాలను చూడవచ్చని మరో అధికారి తెలిపారు.

# ఇరాన్ వీడండి

## - పర్యాటకులూ అక్కడికి వెళ్లకండి
## - భారతీయులకు కేంద్రం హెచ్చరిక

**న్యూఢిల్లీ, జనవరి 14:** ఇరాన్‌లో హింసాకాండ రోజురోజు పెచ్చుమీరుతోంది. రాజధాని టెహ్రాన్‌తోపాటు పలు ప్రధాన నగరాలలో నిరసనలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. హింసాత్మక నిరసనలతో అట్టుడుకుతున్న ఇరాన్‌కు ప్రయాణాలను నివారించాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. దేశవ్యాప్త నిరసనల అనంతరం ఇంటర్నెట్‌తో పాటు మొబైల్, ల్యాండ్‌లైన్ కనెక్టివిటీని నిలిపివేశారని గుర్తు చేసింది. ఈ మేరకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కొద్దిసేపటి కిందటే అడ్వైజరీ ఇచ్చింది. తదుపరి నోటీసు వచ్చేవరకు ముఖ్యంగా ఇరాన్.. ప్రత్యేకించి టెహ్రాన్‌కు వెళ్లవద్దని తెలిపింది. ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ప్రస్తుతం అక్కడ ఉన్న భారతీయ పౌరులను వీలైనంత త్వరగా దేశం విడిచి వెళ్లాలని ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం సైతం కోరింది. విద్యార్థులు, పర్యాటకులు, వ్యాపారవేత్తలు, వాణిజ్య విమానాలతో సహా అందుబాటులో ఉన్న రవాణా మార్గాలను ఉపయోగించి ఇరాన్‌ను విడిచిపెట్టాలని సూచించింది. రాయబార కార్యాలయం పౌరులు, భారతీయ మూలానికి చెందిన వ్యక్తులు అప్రమత్తంగా ఉండాలని, నిరసనలు, ప్రదర్శనల ప్రాంతాలకు దూరంగా ఉండాలని, దౌత్య అధికారులతో సన్నిహితంగా ఉండాలని హెచ్చరించింది. పర్యాటకులు కూడా ఇరాన్‌కు వెళ్లొద్దని సూచించింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. సంప్రదింపుల కోసం అత్యవసర హెల్ప్‌లైన్‌లు ఏర్పాటు చేసింది.



# రాష్ట్రపతితో అమెరికా రాయబారి భేటీ

### - రాయబారిగా నియమితులైన పత్రాలు అందజేత

**న్యూఢిల్లీ, జనవరి 14:** భారత్‌లో అమెరికా రాయబారిగా నియమితులైన సెర్గియో గోర్ బుధవారం రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. ఈ సందర్భంగా రాయబారిగా నియమితులైన పత్రాలను అందజేశారు. సెర్గియో గోర్ నుంచి అక్రిడిటేషన్ పత్రాలను రాష్ట్రపతి ముర్ము అందుకున్నారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సన్నిహితుడిగా పేరుగాంచిన సెర్గియో గోర్, గతేడాది భారత్‌లో రాయబారిగా నియమితులయ్యారు. ఇటీవలే రాయబారిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీని మర్యాదపూర్వకంగా కలిశారు. భారత్– అమెరికా మధ్య మంచి సంబంధాలు న్నాయని, త్వరలోనే వాణిజ్య ఒప్పందం జరుగుతుందని సెర్గియో గోర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# పోషణలేని భార్యకు భర్త భరణం చెల్లించాల్సిందే..

## అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పు

**అలహాబాద్, జనవరి 14:** వైవాహిక బంధం నుంచి విడిపోయిన మహిళల భద్రత, జీవనోపాధిపై అలహాబాద్ హైకోర్టు మంగళవారం స్పష్టమైన తీర్పును ఇచ్చింది. తనను తాను పోషించుకోలేని స్థితిలో ఉన్న భార్యకు, భర్త తన నికర ఆదాయంలో 25 శాతం వరకు భరణంచెల్లించాల్సిందేనని జస్టిస్ మదన్ పాల్ సింగ్ ధర్మాసనం పేర్కొంది. ఒక భర్త దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌ను కొట్టివేస్తూ ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన పెంపు ఉత్తర్వులను సమర్థించింది. షాజహాన్‌పూర్‌కు చెందిన సురేష్ చంద్ర, అతని భార్యకు సంబంధించింది. 2003లో వీరు విడిపోయినప్పుడు.. ట్రయల్ కోర్టు భార్యకు నెలకు రూ. 500 భరణం చెల్లించాలని ఆదేశించింది. అయితే మారుతున్న కాలం, పెరిగిన నిత్యావసర ధరల దృష్ట్యా తన భరణాన్ని పెంచాలని కోరుతూ భార్య 2015లో ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించింది. విచారణ చేపట్టిన కోర్టు జూలై 2024లో ఆమె భరణాన్ని రూ. 500 నుంచి రూ. 3,000కు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదీ చూడండి: ఖనాకు రెండో భార్య ఉంది, మొదటి భార్యకు భరణం చెల్లించలేను ఫ్యామిలీ కోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ సురేష్ చంద్ర హైకోర్టును ఆశ్రయించారు.



తాను కేవలం ఒక సామాన్య కూలీనని, అతి కష్టం మీద జీవనం సాగిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ఆరు సార్లు భరణం పెంచారని నెలకు రూ. 3,000 చెల్లించడం తన స్థికి మించిన భారమని కోర్టుకు వివరించారు. అయితే సురేష్ చంద్ర వాద నలను తోసిపుచ్చిన హైకోర్టు పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. భార్యను పోషించడం అనేది భర్తకు రాజ్యాంగబద్ధమైన చట్టపరమైన బాధ్యత మాత్రమే కాదని అది ఒక పవిత్రమైన ధర్మం అని పేర్కొంది. భర్తకు ఎలాంటి శారీరక వైకల్యం లేదని.. అతను ఆరోగ్యవంతుడని కోర్టు గుర్తించింది. పని చేయగలిగే శక్తి ఉన్న వ్యక్తి తన బాధ్యత నుండి తప్పించుకోలేడని పేర్కొంది. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శ కాలను ఉదహరిస్తూ.. ఒక కూలీ రోజుకు కనీసం రూ. 600 సంపాదిస్తాడని నెలకు రూ. 18,000 ఆదాయం వస్తుందని అంచనా వేసింది. దీని ప్రకారం 25 శాతం అంటే రూ. 4,500 వరకు భరణం ఇవ్వవచ్చని, కానీ ఫ్యామిలీ కోర్టు కేవలం రూ. 3,000 మాత్రమే ఇవ్వాలని చెప్పిందని తెలిపింది. ఇది ఏమాత్రం ఎక్కువ కాదని తేల్చి చెప్పింది. ప్రస్తుత ద్రవ్యోల్బణం దృష్ట్యా రూ. 3,000 అనేది కనీస అవసరాలకు కూడా సరిపోదని దీనిని అధికం అనడం సమంజసం కాదని కోర్టు పిటిషన్‌ను కొట్టివేసింది.

# ఖైబర్ ఫఖ్తూన్‌ఖ్వాలో ఆత్మాహుతి దాడి

## ఎనిమిది మంది పోలీసులు మృతి



**క్వెట్టా, జనవరి 14:** పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రాంతం మరోసారి రక్తసిక్తమైంది. థోంక్ జిల్లాలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్ సాయుధ వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు జరిపిన భీకర బాంబు పేలుడులో ఎనిమిది మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడికి సంబంధించిన భయంకరమైన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇది చూస్తుంటేనే అక్కడి పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో అర్థమవుతోంది. నిషిద్ధ ఉగ్రవాద సంస్థ తెహ్రీక్‌ఇతాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) కు చెందిన ఒక ప్రత్యేక విభాగం ఈ ఘాతుకానికి పాల్పడింది. రోడ్డు పక్కన అమర్చిన అత్యంత శక్తివంతమైన రిమోట్ కంట్రోల్డ్ ఐఈడీని పోలీస్ వాహనం వెళ్తుండగా పేల్చివేశారు. పేలుడు ధాటికి ఆ భారీ సాయుధ వాహనం గాల్లోకి ఎగిరి ముక్కలై పక్కనే ఉన్న గుంతలో పడిపోయింది. అంతటితో ఆగని ఉగ్రవాదులు పేలుడు తర్వాత రోడ్డుపై పడి ఉన్న పోలీసులపై విచక్షణా రహితంగా కాల్పులు జరపడం వారి క్రూరత్వానికి నిదర్శనంగా నిలుస్తోంది. ట్యాంక్ డిప్యూటీ పోలీస్ చీఫ్ పర్వేజ్ షా తెలిపిన వివరాల ప్రకారం ఐదుగురు పోలీసులు ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు.

మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. మృతులలో ఒక స్టేషన్ హౌస్ ఆఫీసర్ , ఒక సబ్‌ఇన్‌స్పెక్టర్, ముగ్గురు ఎలైట్ ఫోర్స్ సిబ్బంది, వాహన డ్రైవర్ ఉన్నారు. "దేశ శాంతియుత భవిష్యత్తు కోసం ఈ వీర జవాన్లు తమ ప్రాణాలను త్యాగం చేశారని పాక్ అంతర్గత వ్యవహారాల మంత్రి మోసిన్ నఖ్వీ నివాళులు అర్పించారు. పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్ ప్రాంతాల్లో ఇటీవలి కాలంలో ఉగ్రవాద దాడులు విపరీతంగా పెరిగాయి. ముఖ్యంగా పోలీసులను, భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరుగుతున్నాయి. దీనిపై పాకిస్థాన్ ప్రభుత్వం మండిపడుతూ అఫ్గాన్ తాలిబన్ల అండతోనే టీటీపీ ఉగ్రవాదులు సరిహద్దు దాటి వచ్చి దాడులు చేస్తున్నారని ఆరోపిస్తోంది. అఫ్గానిస్థాన్ మాత్రం ఈ ఆరోపణలను తోసిపుచ్చుతూ వస్తోంది. ఇది పాకిస్థాన్ అంతర్గత భద్రతా సమస్య అని స్పష్టం చేస్తోంది.

# అలా చేస్తే.. గ్రీన్‌లాండ్‌కే సమస్య : ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్, జనవరి 14:** గ్రీన్‌లాండ్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. అగ్రరాజ్యంలోకి చేరబోమని, డెన్మార్క్‌లోనే ఉంటామని గ్రీన్‌లాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ ప్రకటించారు. దీనిపై ట్రంప్ స్పందిస్తూ.. 'అది అతడి సమస్య. నీల్సన్ అభిప్రాయంతో ఏకీభవించట్లేదు. అతడి గురించి నాకు సరిగా తెలియదు. కానీ డెన్మార్క్‌లోనే కొనసాగాలనుకుంటే అది గ్రీన్‌లాండ్‌కే పెను సమస్యగా మారుతుంది' అని ట్రంప్ హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గ్రీన్‌లాండ్, డెన్మార్క్‌కు ఏవైనా ఆఫర్లు ప్రకటించారా? అని మీడియా ప్రశ్నించగా.. అలాంటిదేమీ లేదని బదులిచ్చారు.



# ఫుడ్ రేసిజంపై గెలిచిన భారతీయ దంపతులు

**కొలరాడో, జనవరి 14:** అమెరికాలో జాతి వివక్షపై ఇద్దరు భారతీయ పీహెచ్‌డీ విద్యార్థులు చేసిన న్యాయపోరాటం ఫలించింది. తాము తెచ్చుకున్న భోజనం వాసనపై మొదలైన వివాదంలో యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో బౌల్డర్‌పై వేసిన కేసులో విజయం సాధించారు. సెటిల్‌మెంట్‌లో భాగంగా వర్సిటీ నుంచి 2,00,000 డాలర్లు (సుమారు రూ.1.8 కోట్లు) పరిహారం పొందారు. భోపాల్‌కు చెందిన ఆదిత్య ప్రకాశ్ (34), కోల్‌కతాకు చెందిన ఊర్మి భట్టాచార్య (35) కొలరాడో యూనివర్సిటీలోని ఆంత్రోపాలజీ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్నారు. 2023 సెప్టెంబర్ 5న ఆదిత్య ప్రకాశ్ తన లంచ్ బాక్సులోని పాలక్ పనీర్‌ను డిపార్ట్‌మెంట్ మైక్రోవేవ్‌లో వేడి చేసుకుంటుండగా, సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేశారు. దాని వాసన ఘాటుగా ఉందని, ఇక్కడ వేడి చేయవద్దని సూచించారు. ఈ ఘటనపై ఆదిత్య, ఊర్మి వివక్షగా భావించి ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి యూనివర్సిటీ తమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని వారు ఆరోపించారు. తమను మానసికంగా వేధించారని, ఎలాంటి కారణం లేకుండా ఊర్మిని టీచింగ్ అసిస్టెంట్ పదవి నుంచి తొలగించారని తెలిపారు. దక్షిణాసియా విద్యార్థులను లక్ష్యంగా చేసుకునేలా కిచెన్ నిబంధనలు ఉన్నాయని పేర్కొంటూ, 2025 మే నెలలో యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టులో దావా వేశారు. ఈ కేసు విచారణ అనంతరం 2025 సెప్టెంబర్‌లో ఇరువర్గాల మధ్య ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం, విద్యా ర్థులకు 2 లక్షల డాలర్ల పరిహారంతో పాటు మాస్టర్స్ డిగ్రీలు ప్రదానం చేసేందుకు వర్సిటీ అంగీకరించింది. భవిష్యత్తులో వారు అదే యూనివర్సిటీలో చదువుకోవడానికి లేదా ఉద్యోగం చేయడానికి వీల్లేకుండా నిబంధన విధించింది. దీంతో తమ పీహెచ్‌డీలను మధ్యలోనే వదిలేసి, ఇటీవల విద్యార్థులు భారత్‌కు తిరిగి వచ్చారు. నా ఆహారం నా గర్వకారణం. ఏది మంచి వాసన, ఏది చెడు వాసన అనేది సార్వత్రికం కాదు, అది సంస్కృతిపై ఆధారపడి ఉంటుందని ఆదిత్య ప్రకాశ్ పేర్కొన్నారు. ఇలాంటి ఫుడ్ రేసిజంను సవాలు చేయవచ్చనే సందేశం వెళితే, అదే అసలైన విజయమని ఆయన అన్నారు.



# భారత్ - అమెరికా వాణిజ్య ఒప్పందం దిశగా అడుగులు

### - జైశంకర్- రూబియో ఫోన్ సంభాషణ
### - వాణిజ్యం, రక్షణ సహకారంపై చర్చలు

**న్యూఢిల్లీ, జనవరి 14:** భారత్– అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై కీలక ముందడుగు పడింది. వాణిజ్య ఒప్పందం సమస్యపై ఇరుపక్షాల మధ్య కొంత సంప్రదింపులు జరుగుతాయని కొత్తగా నియమితులైన అమెరికా రాయబారి సెర్గియో గోర్ చెప్పిన మరుసటి రోజే ఇరుదేశాల విదేశాంగ మంత్రుల మధ్య ఫోన్ సంభాషణ జరిగింది. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోతో ఫోన్‌లో సంభాషించారు. ఈ సందర్భంగా వాణిజ్యం, కీలక ఖనిజాలు, అణుశక్తి, రక్షణ రంగాలలో సహకారంపై చర్చలు సాగాయి. ఇదే విషయాన్ని జైశంకర్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. "రూబియోతో మంచి సంభాషణ జరిపా, వాణిజ్యం, కీలక ఖనిజాలు, అణు సహకారం, రక్షణ, ఇంధనం గురించి చర్చించాం. అలాగే ఇతర సమస్యలపై నిరంతరం సంప్రదింపులు జరుపుకోవాలని అంగీకరించాం" అంటూ సోషల్ మీడియాలో రాసుకొచ్చారు. రష్యా చమురు కొనుగోళ్లపై 25శాతం సుంకంతో సహా, భారత్ వస్తువులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏకంగా 50శాతం సుంకాలు విధించిన తర్వాత భారత్– అమెరికా సంబంధాలు దెబ్బతిన్నాయి. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి ఇరుపక్షాలు గత సంవత్సరం అనేక రౌండ్ల చర్చలు జరిపాయి. అయితే, అమెరికా ఒంటెద్దు పోకడలతో చర్చలు అర్ధంతరంగా నిలిచి పోయాయి. ఈ నేపథ్యంలోనే జైశంకర్– రూబియో చర్చలు జరపడం ప్రాధాన్యత ఏర్పడింది.

# సంక్షిప్తంగా..

## కెనడాలో భారతీయుడి హత్య!



**న్యూఢిల్లీ, జనవరి 14:** కెనడాలో ఓ భారతీయుడు హత్యకు గురయ్యాడు. సర్రే నగరంలో పంజాబ్‌కు చెందిన వ్యాపారవేత్త బిందర్ గర్చా (48) తన ఇంటికి కొంత దూరంలో తీవ్ర గాయాలతో పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడు బుల్లెట్ గాయాలతో ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించారు. బిందర్ కొన్నేళ్లుగా కెనడాలోనే నివాసం ఉంటూ స్టూడియో - 12 పేరుతో ఫొటో స్టూడియో నడుపుతున్నట్లు తెలిపారు. అయితే ఈ హత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. కాల్పులకు తెగబడిన దుండగులు వాడినదిగా భావిస్తున్న కాలిపోయిన వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయన్నారు.

## మధ్యప్రదేశ్ భింద్ జిల్లాలో పరువు హత్య!


**భింద్(మధ్యప్రదేశ్), జనవరి 14:** మధ్యప్రదేశ్‌లోని భింద్‌జిల్లాలో కూతురు వేరొక కులానికి చెందినవారినిపెళ్లిచేసుకుందని కన్న తండ్రే కాల్చి చంపాడు. భింద్ జిల్లాలోని ఖిరియా థాపక్‌గ్రామంలో ఈసంఘటన జరిగింది. భింద్‌ఎస్‌డిఒపి సంజయ్ కోచా మాట్లాడుతూ తండ్రి మున్నేష్ ఈఘాతుకానికి పాల్పడినట్లు అంగీకరించాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు. కుమార్తెను హత్యచేయడానికి గల అసలు కారణాలను నిందితుడినుంచి రాబట్టనున్నట్లు తెలిపారు. భారతీయ న్యాయసంహితపరిధిలో హత్యకేసు నమోదు చేసామని,

అలాగే అక్రమ మారణా యుధం కలిగి ఉన్నందుకుగాను తండ్రి మునేష్‌ధనుక్‌పైనా మరో కేసు కూడా నమోదుచేసినట్లు ఎస్డీఓపీ తెలిపారు.

## రాజ్యసభకు వెళ్లడం లేదని ప్రకటించిన దిగ్విజయ్‌సింగ్

**భోపాల్, జనవరి 14:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ మూడోసారి రాజ్యసభకు పోటీ చేయడం లేదని వెల్లడించారు. ఏప్రిల్ 2026లో ఆయన పదవీకాలం ముగియనున్నది. మధ్యప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ శాఖ అధ్యక్షుడు ప్రదీప్ అహిర్‌వార్ నుంచి అభ్యర్థన రావడం వల్ల దిగ్విజయ్ తన రాజ్యసభ సీటును త్యాగం చేయబోనున్నట్లు తెలుస్తున్నది. షెడ్యూల్ కులాలకు చెందిన నేతను ఎగువ సభకు పంపాలని భావిస్తున్నట్లు ప్రదీప్ తెలిపారు. జనవరి 13వ తేదీన ప్రదీప్ఓ లేఖ రాశారు. సామాజిక న్యాయం కోసం మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ సీటుపై ఓ దళితుడిని పంపాలని భావిస్తున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు.

## ఉగ్రవాద నిరోధంలో కెనడా 40 యేళ్లుగా విఫలం: దినేశ్ పట్నాయక్



**న్యూఢిల్లీ, జనవరి 14:** ఉగ్రవాదాన్ని అరికట్టడంలో కెనడా 40 ఏళ్లుగా విఫలమవుతూనే ఉందని అక్కడి భారత హైకమిషనర్ దినేశ్ పట్నాయక్ అన్నారు. అందువల్లే భారత్ వ్యతిరేక కుట్రలకు ఒట్టావా కేంద్రంగా మారుతోందని విమర్శించారు. కెనడా మీడియా సంస్థ సిబిసికి దినేశ్ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య ఘటన ప్రస్తావనకు రాగా ఈ కేసులో భారత్‌పై కెనడా ఆరోపణలను ఆయన మరోసారి తిప్పికొట్టారు. కెనడా గడ్డ నుంచి జరుగుతోన్న ఉగ్ర కుట్రల గురించి మేం 40 ఏళ్లుగా చెబుతూనే ఉన్నాం. ఉగ్రవాద కట్టడికి ఈ దేశ నేతలెవరైనా చర్యలు చేపట్టారా? ఈ కేసుల్లో కనీసం ఒక్కరికైనా శిక్ష పడిందా? కెనడా ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తోంది. ఉగ్రవాదుల గురించి భారత్ లేవనెత్తిన ఆధారాలు కావాలని డిమాండ్ చేస్తోంది. మరి మా దేశంపై కెనడా ఆరోపణలు చేసినప్పుడు కూడా ఆధారాలు చూపించాలి కదా. ఆరోపణలు చేయడం సులువే.

## హరిజన, గిరిజన పదాల తొలగింపు: హర్యానా ప్రభుత్వం

**చండీగఢ్, జనవరి 14:** హర్యానా ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విభాగాలు, విద్యా సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలకు అత్యంత కీలకమైన ఆదేశాలను జారీ చేసింది. ఇకపై అధికారిక పత్రాల్లో, ఉత్తరప్రత్యుత్తరాల్లో, రికార్డుల్లో హరిజన్ , గిరిజన్ అనే పదాలను ఎట్టిపరిస్థితుల్లోనూ వాడకూడదని స్పష్టం చేసింది. ఈ మేరకు హర్యానా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయం ఉత్తర్వులను వెలువరించింది. భారత రాజ్యాంగంలో ఎక్కడా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు సంబంధించి హరిజన్ లేదా గిరిజన్ అనే పదాల ప్రస్తావన లేదని ప్రభుత్వం ఈ సందర్భంగా గుర్తు చేసింది. కేంద్ర ప్రభుత్వం గతంలోనే ఈ పదాల వాడకాన్ని నిలిపివేయాలని స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చినప్పటికీ కొన్ని విభాగాలు ఇంకా వీటిని ఉపయోగిస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది.

# అత్యంత ఖరీదైన విడాకులు

## జోహో అధినేత రూ.15వేల కోట్ల బాండ్ డిపాజిట్‌చేయాలనికోర్టు ఆదేశం
## విడాకుల కేసు దాఖలుచేసిన ప్రమీలా శ్రీనివాసన్



**కాలిఫోర్నియా, జనవరి 14:** జోహో అధినేత శ్రీధర్ వేంబు, ఆయన భార్య ప్రమీలా శ్రీనివాసన్ మధ్య గత కొన్నేళ్లుగా సాగుతున్న విడాకుల పోరాటం కీలక మలుపు తిరిగింది. విడాకుల ప్రక్రియ కొనసాగుతుండగానే ప్రమీల ఆర్థిక ప్రయోజనాలను కాపాడేందుకు శ్రీధర్ వేంబును 1.7 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 15,000 కోట్లు) విలువైన బాండ్‌ను కోర్టులో డిపాజిట్ చేయాలని కాలిఫోర్నియా కోర్టు ఆదేశించింది. ప్రపంచవ్యాప్తంగా చూస్తేబిల్ గేట్స్, జెఫ్ బెజోస్ వంటి దిగ్గజాల తర్వాత నాలుగో అత్యంత ఖరీదైన విడాకుల కేసుగా ఈ కేసు రికార్డు సృష్టించింది. 1993లో శ్రీధర్ వేంబు, ప్రమీలా శ్రీనివాసన్ వివాహం జరిగింది. దాదాపు 25 ఏళ్ల పాటు అమెరికాలో కలిసి ఉన్న ఈ దంపతులకు ఒక కుమారుడు ఉన్నాడు. 2020లో ప్రమీల విడాకుల కోసం దరఖాస్తు చేసుకుని ఆమె తన భర్తపై పలు ఆరోపణలు చేశారు. ప్రత్యేక అవసరాలు ఉన్న తమ కుమారుడిని, తనను అమెరికాలోనే వదిలేసి శ్రీధర్ వేంబు శాశ్వతంగా భారత్‌కు వెళ్లిపోయారని ఆమె వాపోయారు. కాలిఫోర్నియాలోని ఉమ్మడి ఆస్తి చట్టాల నుంచి తప్పించుకోవడానికి శ్రీధర్ వేంబు జోహో కంపెనీ షేర్లను, మేధో సంపత్తిని తన తోబుట్టువుల పేరిట రహస్యంగా బదిలీ చేశారని ఆరోపించారు. అది మాత్రమే కాకుండా పెళ్లయినప్పటి నుంచి కంపెనీ తనదేనని చెప్పిన శ్రీధర్ విడాకుల సమయానికి తన వాటా కేవలం 5 శాతమేనని, మిగిలిన 80 శాతానికి పైగా వాటా తన సోదరి రాధా వేంబు, సోదరుడు శేఖర్ వేంబులకు ఉందని కోర్టులో చెప్పడం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని ప్రమీల పేర్కొన్నారు. శీధర్ వేంబు ఈ ఆరోపణలను పూర్తిగా తోసిపుచ్చారు. తాను గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేసేందుకే భారత్‌కు వచ్చానని తన భార్యా పిల్లలను కూడా రమ్మని కోరానని ఆయన వివరణ ఇచ్చారు. షేర్ల బదిలీలో ఎలాంటి అక్రమాలు జరగలేదని, మొదటి నుంచి తన కుటుంబ సభ్యులకూ అందులో వాటాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. జోహో మేధో సంపత్తిని 50 మిలియన్ డాలర్లకు ఇండియా కంపెనీకి విక్రయించినా.. ఆ నిధులు ఇంకా అమెరికా కంపెనీ దగ్గరే ఉన్నాయని ఆయన వాదించారు. ప్రస్తుతం శ్రీధర్ వేంబు నికర ఆస్తి విలువ సుమారు 5.85 బిలియన్ డాలర్లుగా అంచనా. కాలిఫోర్నియా కోర్టు ఈ బాండ్ ఆర్డర్‌తో పాటు జోహోకు చెందిన కొన్ని అమెరికా విభాగాలపై పర్యవేక్షకుడిని కూడా నియమించింది. శ్రీధర్ వేంబు తరపు లాయర్లు ఈ ఆదేశాలను సవాలు చేస్తూ అప్పీల్‌కు వెళ్లారు.

# 'డిజిటల్ ఐడి'లపై బ్రిటన్ వెనకడుగు!

**లండన్, జనవరి 14:** దేశంలో వలసలను నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యలకు డిజిటల్ ఐడిలు దోహదపడతాయని భావించిన బ్రిటన్.. తాజాగా ఈ ప్రణాళికపై వెనక్కి తగ్గింది. దేశంలో ఉద్యోగం పొందడానికి డిజిటల్ ఐడి కార్డు తప్పనిసరి కాదని పేర్కొంది. ఈ విధానంపై ప్రతిపక్షాలతోపాటు అధికార పక్షం నుంచీ విమర్శలు రావడంతో యుకె ప్రధాని కీర్‌స్టార్మర్ దీనిపై యూటర్న్ తీసుకున్నట్లు తెలుస్తోంది. బ్రిటన్ పౌరులు, నివాసితులు దేశంలో పనిచేయాలంటే డిజిటల్ ఐడి కార్డులు ఉండాలని ప్రధాని కీర్ స్టార్మర్ గతంలో స్పష్టం చేశారు. దేశంలో అక్రమ వలసలను నియంత్రించడంలో దోహదపడుతుందని గత సెప్టెంబరులో పేర్కొన్నారు. ఆరోగ్య సంరక్షణ, సంక్షేమం, చిన్నారుల రక్షణతోపాటు ప్రభుత్వ సర్వీసులను మరింత సులభతరం చేస్తుందన్నారు. ఈ క్రమంలో భారత్‌లోని 'ఆధార్' వ్యవస్థ గురించి తెలుసుకునేందుకు స్టార్మర్ ఆసక్తి చూపారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత సామాన్య పౌరులకు ఈ తరహా డిజిటల్ ఐడి కార్డులను బ్రిటన్ తప్పనిసరి చేయలేదు. ఈ అంశం దశాబ్దాలుగా వివాదాస్పదంగానే ఉంది. మాజీ ప్రధాని టోనీబ్లెయిర్ కూడా వీటిని ప్రవేశపట్టేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేదు. ఉగ్రవాదంపై పోరు, మోసాలను నియంత్రించడానికి ఇదో మార్గమని అప్పట్లో ఆయన చెప్పారు. కానీ, పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛను ఉల్లంఘించడంతోపాటు సమాచారానికి ముప్పు ఏర్పడుతుందని పౌర హక్కుల కార్యకర్తల వాదనతో ఆయా ప్రభుత్వాలు వెనకడుగు వేస్తున్నాయి.



# 19 నుంచి కొత్త సర్పంచ్‌లకు శిక్షణ

## ఒక్కొక్క బ్యాచ్‌లో 50 మంది

## 12,760 సర్పంచ్‌లతోపాటు, ఉపసర్పంచ్‌లకు ట్రైనింగ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 14:** రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో నూతనంగా ఎన్నికైన పాలకవర్గాలకు పల్లె పాలనతో పాటు పం చాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ నెల 19 నుంచి ఐదు రోజుల చొప్పున ఫిబ్రవరి 28వ తేదీ వరకు బ్యాచ్‌లవారీగా సర్పంచ్‌లకు,ఉపసర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చేందుకు పంచాయతీ అధికారులు ఏర్పాట్లను చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో సర్పంచులకు రెసిడెన్షియల్ పద్ధతిలో అందరికీ ఒకేసారి కాకుండా 50 మందికి ఒక బ్యాచ్ చొప్పున బ్యాచ్‌లవారీగా అవగాహన తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 12,760 మంది సర్పంచిలతో పాటు ఉప సర్పంచులు వార్డు మెంబర్లు ఈ కార్యక్రమాల్లో పాల్గొన నున్నారు. ఇందుకోసం కరదీపికలను సిద్ధం చేశారు. ఒక్కో బ్యాచ్‌లో 50 మందికి ఒకటి చొప్పున రెండు తరగతులుగా ట్రైనింగ్ ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంపీడీవోలు, డీఎల్‌పీవోలు, ఎంపీవో లతోపాటు రిటైర్డ్ ఎంపీడీవోలను రిసోర్సు పర్సన్లుగా ఎంపిక చేశారు. వారికి హైదరాబాద్‌లోని గ్రామీణా భివృద్ధి సంస్థ(ఐఆర్‌డీ)లో ఈ నెల 5 నుంచి 10 వరకు శిక్షణకు సంబం ధించిన వివరాలపై తర్ఫీదునిచ్చారు. దానికి హాజరైన వారంతా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే సర్పంచుల శిక్షణ కార్యక్రమంలో భాగస్వాములవుతారు.

సర్పంచుల శిక్షణ పూర్తయిన తర్వాత ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు డివిజన్, మండల కేంద్రాల్లో ట్రైనింగ్ ఇవ్వనున్నారు. గ్రామ పాలనలోని వ్యవస్థలు, నూతన పంచాయతీరాజ్ చట్టం2018 ప్రకారం గ్రామ పంచాయతీల అధికారాలు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల విధులు, బాధ్యతలు తదితర 24 అంశాలకు సంబంధించి అవగాహన కల్పించనున్నారు. గ్రామసభల నిర్వహణ, పంచాయతీ సమావేశాలు, జనన, మరణాల నమోదు, ప్రజారోగ్యం, పారిశుద్ధం, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, వ్యవసాయం, ఈ అప్లికేషన్, పంచాయతీరాజ్ ఈ పాలన, ఆర్థికాభివృద్ధిలో గ్రామ పంచాయతీల పాత్ర, కేంద్ర ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌సీ నిధుల వినియోగం, ఖర్చు తదితర అంశాలపై సర్పంచులకు పూర్తిగా వివరించనున్నట్టు పంచాయతీరాజ్ శాఖ ఉన్నతా ధికారులు తెలిపారు సర్పంచులకు శిక్షణ తరగతులు నిర్వహించేందుకు జిల్లాకు 8 మంది చొప్పున రీసోర్స్ పర్సన్‌లను అధికారులు ఎంపిక చేశారు. ఇందులో డీఎల్‌పీవోలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు కూడా ఉన్నారు. వారు సంక్రాంతి పండుగ అనంతరం ఆయా జిల్లాల్లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు.

### పంచాయతీలకు కేంద్రం సంక్రాంతి కానుక

### రూ.2,500 కోట్ల విడుదలకు గ్రీన్‌సిగ్నల్

గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగి పాలక వర్గాలు ఏర్పాటైన నేపథ్యంలో రాష్ట్రానికి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2,500 కోట్ల విడుదలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందులో రూ.వెయ్యి కోట్లను ఈ నెల చివరిలోగా విడుదల చేస్తామంది. మిగిలిన రూ.1,500 కోట్లను ఫిబ్రవరి నెలలో విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చింది. రాష్ట్రంలో పంచాయతీ పాలక వర్గాలకు 2024 జనవరిలో గడవు ముగియగా, 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు నిధులు వచ్చాయి. 2024-25లో ఎన్నికలు జరగక పాలకవర్గాలు లేకపోవడంతో ఆ సంవత్సరానికి రావాల్సిన రూ.2,500 కోట్లను కేంద్రం నిలిపివేసింది.తెలంగాణ ప్రభుత్వం గత నెలలో పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించడంతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. పాలకవర్గాల ఏర్పాటు అనంతరం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ అధికారులు ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. నిధులు విడుదల చేయాలని కోరారు. వీటిని పరిశీలించిన కేంద్రం, రూ.2,500 కోట్లు విడుదల చేయాలని నిర్ణయం తీసుకుంది.ఆర్థిక సంఘం నిధుల విడుదలకు కేంద్రం కొత్త విధివిధానాలను నిర్దేశించింది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతే వాటిని వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అన్ని జిల్లాల కలెక్టర్లు, పంచాయతీ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మేరకు చర్యలు చేపట్టాలని సూచించింది.15వ ఆర్థిక సంఘం నిధుల కోసం ప్రతి గ్రామ పంచాయతీ ప్రత్యేక బ్యాంకు ఖాతాను ప్రారంభించాలి. ఆ ఖాతాను పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పోర్టల్‌లో నమోదు చేసి యూనిక్ ఏజెన్సీ కోడ్ పొందాలి. ఈగ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లోనూ ఖాతాల వివరాలను నమోదు చేయాలి.నిధుల వినియోగానికి సర్పంచి (చెకర్), ఉప సర్పంచి (మేకర్) డిజిటల్ సంతకాలను నమోదు చేసి సంబంధిత ఎంపీడీవోల ద్వారా ఆమోదం పొందాలి. ఈ ప్రక్రియకు క్లాస్ 3 డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్లు తప్పనిసరి. సైనింగ్, ఎన్‌క్రిప్షన్ సౌకర్యంతో పాటు యూఎస్‌బీ టోకెన్ కూడా ఉండాలి.పంచాయతీ అధికారులు అవసరమైన డిజిటల్ సంతకాలను జీఈఎం పోర్టల్‌లో నమోదు చేయాలి. పనులను ఈప్రొక్యూర్‌మెంట్ లేదా ఇతర టెండర్ విధానాల ద్వారా నిర్వహించాలి. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో గ్రామ పంచాయతీల్లో రెండేళ్లుగా పాలక వర్గాలు లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. కేంద్రం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు ఇంతవరకు నిలిచిపోవడం, నిధుల మంజూరులో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం ప్రదర్శించడం తదితర కారణాలతో గ్రామ పాలన గాడితప్పింది. కొన్ని గ్రామాల్లో పారిశుద్ధం అస్తవ్యస్తమైంది. పంచాయతీ ట్రాక్టర్‌లో డీజిల్ కూడా పోయలేని దుస్థితి దాపురించింది. సిబ్బందికి జీతాలు ఇవ్వలేక కార్యదర్శులు చేతులెత్తేశారు. తాజాగా నిధులు విడుదల కావడంతో వారికి కాస్త ఉపశమనం లభించనుంది. డిసెంబరు నెలలో మూడు విడతలుగా 12,760 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ఇందులో 7,522 గ్రామ పంచాయతీలను కాంగ్రెస్ పార్టీ సొంతం చేసుకోగా, 820 సర్పంచ్ స్థానాల్లో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థులు గెలిచారు.62 శాతం సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. మిగతా స్థానాలను బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు గెలిచాయి.

# రాష్ట్రంలో ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

## 70.2 లక్షల టన్నుల ధాన్యం సేకరణ

## రైతులకు రూ.16,912 కోట్లు చెల్లింపు

**హైదరాబాద్, జనవరి 14, ప్రభాతవార్త :** వానాకాలం మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి వరి ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ రికార్డ్ సృష్టించింది. ఈ సీజనులో రాష్ట్రంలో ఎప్పుడు లేని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 13.97 లక్షల మంది రైతుల నుండి 70.82 లక్షల టన్నులను కొనుగోలు చేసినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. ఈ ధాన్యాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేసిన 8,448 కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించింది. గతంలో కొనుగోలు చెసిన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డ్‌ను ఈ ఖరీఫ్ సీజన్ అధిగమించింది. ఇందులో అత్యధికంగా సన్న రకాలకు చెందిన ధాన్యం కావడం విశేషం. ప్రభుత్వం కొనుగోలు చేసిన 70.82 లక్షల టన్నుల ధాన్యంలో 32.45 లక్షల టన్నుల ధాన్యం దొడ్డు రకానికి చెందినవే ఉన్నాయి. మిగిలిన 38.37 లక్షల మెట్రిక్ టన్నులు సన్నాలు కొనుగోలు చేయడం జరిగాయి. ఇందుకు గాను కొనుగోలు చేసిన ధాన్యం మొత్తానికిగాను రైతులకు రూ.16,912 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇందులో ఇప్పటికి రూ.16,602 కోట్లు చెల్లించడం జరిగింది. అలాగే రాష్ట్రంలో సన్నాలను పండించేందుకు ముందెన్నడూ లేని రీతిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్‌కు సంబంధించి రైతాంగాం ఖాతాలో ఇప్పటి వరకు 1,425 కోట్లు జమ చేసినట్లు తెలిపాయి.



# బిటి పత్తి విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## రాష్ట్ర రైతు కమిషన్ అధ్యక్షుడు కోదండరెడ్డి

**హైదరాబాద్, జనవరి 14, ప్రభాతవార్త :** రాష్ట్రంలో బిటి పత్తి విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రైతు కమిషన్ అధ్యక్షులు కోదండరెడ్డి హెచ్చరించారు. రైతులను మోసం చేసేందుకు పత్తి విత్తన కంపెనీలు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయన్నారు. హైదరాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ నాసిరకం పత్తి విత్తనాలు కొనుగోలు చేస్తే నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. రాష్ట్రంలో పత్తి సాగు చేసే విస్తీర్ణం బాగా పెరిగిందని, ఇదే అదునుగా భావించి మల్టీనేషనల్ కంపెనీలు జోరబడి నకిలీ విత్తనాలు తక్కువ ధరకే అమ్మకాలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నాయని తెలిపారు.

కేంద్రం ప్రభుత్వం బీటీ, హెచ్టీ విత్తనాలు నిషేదించిన కంపెనీలు అక్రమ సంపాదనకు తెగబడ్డాయని ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లా గద్వాల ప్రాంతాల్లో పత్తి ఎక్కువ పండిస్తారని, అక్కడ రైతులకు నకిలీ విత్తనాలు కంపెనీలు అంట గడుతున్నాయని పేర్కొన్నారు. అదే విధంగా రైతులు పత్తి చేనులో కలుపు పెరగడకుండా ఉండేందుకు గ్లైపోసైట్ మందును వాడటంతో భూమి విషంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ జిల్లాల్లో ఇటువంటి కలుపు మందులు అమ్మడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వీటిని రైతులు వాడొద్దని సూచించారు. అమెరికాలో ఉండే విత్తన కంపెనీలు కూడా అక్కడే పరీక్షలు చేసుకొని అక్కడి నుంచే సర్టిఫికెట్ తెచ్చుకొని ఇక్కడి రైతులకు అంటగట్టే యత్నం చేస్తున్నారని వెల్లడించారు. కేంద్రం ఇటీవల తెచ్చిన సీడ్ డ్రాఫ్ట్ కంపెనీలకు అనుకూలంగా ఉందని విమర్శించారు.

# బెజ్జూర్‌లో పండగ పూట విషాదం

## బైకు అదుపుతప్పి మామ, అల్లుడు మృతి

**బెజ్జూర్, జనవరి 14, ప్రభాతవార్త:** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం లోని కుంటల మానేపల్లి-సలగుపల్లి రహదారిపై గల నులుకు ఒర్రె వంతెన వద్ద బుధవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. మొత్తంపేట గ్రామానికి డోంగ్రే రాజయ్య,రెండవ కుమారుడు డోంగ్రే రాజశేఖర్ (21)కు ఇటీవల కుంటలమానేపల్లి గ్రామానికి చెందిన బొరుకుట్ శంకర్ కుమార్తె వర లక్షి  ్మతో నిశ్చితార్థమైంది. బుధవారం ఉదయం రాజశేఖర్ మామ బొరుకుట్ శంకర్ (48)తో కలిసి చికెన్ కొనుగోలు నిమిత్తం కుంటల మానేపల్లి నుండి సలగుపల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. చికెన్ తీసుకొని తిరిగి వస్తుండగా,మార్గమధ్యలో కుంటల మానేపల్లి గ్రామ శివారులోని నూలుకు ఒర్రె వంతెన వద్ద వాహనం అదుపుతప్పి వంతెనను ఢీకొని ఒర్రెలో పడిపోయారు. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న డోంగ్రే రాజశేఖర్ సంఘటన స్థలంలోనే మృతి చెందగా,బొర్కుట్ శంకర్ కు తీవ్ర గాయాలయ్యాయి. పండగ పూట ఇట్టి ఘటన జరగడంతో సంఘటన స్థలంలో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.స్థానికులు సమాచారంతో శంకర్‌ను అంబులెన్స్ ద్వారా కాగజ్‌నగర్ లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతునీ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సర్తాజ్ పాషా తెలిపారు.

# వరి నాట్లలో నాన్ లోకల్ హవా

## తక్కువ కూలీ, ఎక్కువ పని

## ఇతర రాష్ట్రాలపైనే రైతుల మక్కువ

**హైదరాబాద్, జనవరి 14, ప్రభాతవార్త :** ప్రస్తుత యాసంగి సీజనులో తెలంగాణలో వరి నాట్లు జోరందుకున్నాయి. కూలీలకు, యాంత్రాలకు మంచి డిమాండ్ ఏర్పడింది. దీనికి తగినట్లుగా ఏటా రాష్ట్రంలో వరి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఇదే సమయంలో కూలీల కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోంది. దీంతో రైతులు నాట్లు వేయడానికి ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తు న్నారు. రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాలో వరి నాట్లు జోరందుకున్న వేళ ఇతర రాష్ట్రాల నుంచి మగ కూలీలను తీసుకొచ్చి నాట్లు వేయిస్తున్నారు. ఖర్చు తగ్గడంతోపాటు సమయం కూడా ఆదా అవుతుందని రైతులు వలస కూలీల వైపే మొగ్గు చూపుతున్నారు. గ్రామాల్లో ఎంత తిరిగినా సరే సకాలంలో కూలీలు దొరకట్లేదు. ఒకవేళ దొరికిన వారంతా పొలం దగ్గరికి వచ్చే వరకూ నమ్మకం లేని పరిస్థితి. ఫలితంగా వరి నాట్లు ఆలస్యమైతే దిగుబడి తగ్గే అవకాశం ఎక్కువగా ఉంటుందనే ఆందోళన రైతాంగంలో వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో కూలీల కొరతతో విసిగి వేసారిన రైతులు ఇతర రాష్ట్రాల నుంచి కూలిలను రప్పించి నాట్లు వేయిస్తున్నారు. ఉత్తరప్రదేశ్, బిహార్, జార్ఖండ్, అసోం, పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన మగ కూలీలు తమదైన పని తీరుతో దూసుకెళ్తున్నారు. వలస కూలీల కష్టాన్ని మెచ్చిన కర్షకులు గుత్తాలెక్కన వారికే పనిని అప్పగిస్తున్నారు. ఇద్దరు వ్యక్తులు నారు అందిస్తుండగా మిగిలిన వారు నాట్లు వేస్తున్నారు. ఒకేసారి 10 నుంచి 20 మంది మగ కూలీలు పొలంలోకి దిగి గంటన్నరలోపే ఎకరం పొలంలో నాటేసే పనిని పూర్తిచేస్తున్నారు. స్థానిక కూలీలు రోజంతే చేసే పనిని ఈ కూలీలు గంటల వ్యవధిలోనే ముగించేస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ఎకరాకు నాలుగు నుంచి ఐదువేల వరకు తీసుకుంటున్నారు.

ఉదయం 6 గంటలకు వచ్చి రాత్రి చీకటిపడే వరకు పొలంలోనే ఉంటున్నారు. రోజుకు ఆరెకరాల నుంచి 8 ఎకరాలు పూర్తి చేస్తుండటం విశేషం. ఈ విధంగా ఇతర రాష్ట్రాల కూలీల వల్ల ఖర్చు తగ్గడంతో పాటు సకాలంలో నాట్లు పూర్తవుతున్నాయని చెబుతున్నారు. సాధారణంగా స్థానిక కూలీలు ఉదయం 10 గంటలకు నాట్లేయడం ప్రారంభించి సాయంత్రం 6 గంటలకే ఇంటికెళ్తారు. వీరికి రవాణా ఖర్చులు కూడా రైతులే చెల్లించాలి. అంతే కాకుండా నారు అందించే బాధ్యత కర్షకుల మీదే పెడుతున్నారు. దీంతో స్థానిక కూలీలకు ఎక్కువగా చెల్లించాల్సి వస్తోందని వలస కూలీలపై ఆసక్తి చూపుతున్నారు. అందుకే కొందరు మధ్యవర్తులు ఇతర రాష్ట్రాల కూలీలను తీసుకొచ్చి వారికి నివాసంతో పాటు భోజన వసతి కల్పిస్తున్నారు. మధ్యవర్తిగా ఉన్నందుకు కమిషన్‌తో పాటు ఇతర ఖర్చులు తీసుకుంటున్నారు. తమ రాష్ట్రంలో కంటే ఇక్కడే ఎక్కువ సంపాదిస్తున్నామని వలస కూలీలు అంటున్నారు. ఖర్చులు పోను నెలకు 30వేల వరకు మిగులుతున్నాయని చెబుతున్నారు. ఇక్కడి రైతులు, ప్రజలు తమను బాగా చూసుకుంటున్నారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వరి నాట్లు జోరు అందుకున్నాయి. రైతులు వలస కూలీల వద్దకు వరస కడుతున్నారు.



# బ్రస్సెల్స్‌లో ఇయు అధికారులతో ఎన్నికల నిర్వహణపై కీలక భేటీ

## హెచ్.ఇ. అన్నబెల్ హోగెమాన్‌ను కలిసిన తెలంగాణ సిఇఒ బృందం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 14:** తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సి. సుదర్శన్ రెడ్డి నేతృత్వంలోని బృందం బ్రస్సెల్స్‌లో ఎఫ్‌పీఎస్ ఇంటీరియర్ డైరెక్టర్ జనరల్ హెచ్.ఈ. అన్నబెల్ హోగెమాన్‌తో పాటు యూరోపియన్ పార్లమెంట్ ఉన్నతాధికారులను కలిసింది. ఈ సమావేశంలో భారత ఎన్నికల వ్యవస్థ ప్రపంచ స్థాయిలో ఎలా ఒక ప్రమాణంగా నిలిచిందో వివరించారు.2024-25 ఎన్నికల చక్రంలో దేశవ్యాప్తంగా దాదాపు 97.9 కోట్ల మంది ఓటర్ల కోసం ఎన్నికలు నిర్వహించామని, ఇందుకోసం 2 కోట్ల మందికిపైగా సిబ్బందిని నియోగించామని సుధర్శన్ రెడ్డి తెలిపారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల కసరత్తుగా నిలిచిందన్నారు.23 భాషలు, విభిన్న మతాలు, హిమాలయ పర్వత ప్రాంతాల నుంచి దీవుల వరకు విస్తరించిన భౌగోళిక పరిస్థితుల్లోనూ ప్రతి ఓటరికి ఓటు హక్కు కల్పించేలా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.ఒక్కో పోలింగ్ బూత్‌లో కనీసం ఒకరు నుంచి గరిష్టంగా 1,500 మంది వరకు ఓటర్లు ఉండే విధంగా వ్యవస్థను రూపొందించామన్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద ఓటర్ల జాబితాను భారత్ నిర్వహిస్తోందని, ఏడాది పొడవునా నమోదు ప్రక్రియ కొనసాగుతుందని, ఏడాదికి నాలుగు అర్హత తేదీలను అమలు చేస్తున్నామని వివరించారు. జనవరి 2025లో ప్రచురించిన దాదాపు కోటి కోట్ల పేర్లలో 2 కోట్ల క్లెయిమ్స్, అభ్యంతరాలను పరిష్కరించామని, చివరికి కేవలం 89 అప్పీలు మాత్రమే నమోదయ్యాయన్నారు.రాజకీయ పార్టీలు, బూత్ స్థాయి ఏజెంట్లు ఈ ప్రక్రియలో సమాంతర ఆడిటర్లుగా వ్యవహరిస్తున్నారని చెప్పారు.ఈవీఎంలు పూర్తిగా స్టాండ్‌అలోన్ విధానంలో, నెట్‌వర్క్‌కు అనుసంధానం లేకుండా పనిచేస్తాయని, ఎలాంటి ట్యాంపరింగ్‌కు అవకాశం ఉండదన్నారు.

2024 ఎన్నికల్లో ఒకే రోజులో 70.5 కోట్ల ఓట్లను 62 లక్షల ఈవీఎంలతో లెక్కించామని, 81.7 కోట్ల వీవీప్యాట్ స్లిప్పులను ఓటర్లు వీక్షి ంచారని తెలిపారు. లెక్కింపులో 1.6 కోట్ల స్లిప్పుల భౌతిక పరిశీలనలో ఒక్క తప్పు కూడా తేలలేదన్నారు. గత 35 ఏళ్లలో ఈవీఎంలపై దాఖలైన 41 కేసులను సుప్రీంకోర్టు కొట్టివేసిందని చెప్పారు.

రాజ్యాంగ, చట్టపరమైన పరిమితుల్లో వేలాది మంది జనరల్, పోలీస్, వ్యయ పరిశీలకుల పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహిస్తు న్నామని, ఓటర్లు, అభ్యర్థుల కోసం అనేక డిజిటల్ యాప్‌లు అందుబాటులోకి తీసుకువచ్చామని సుధర్శన్ రెడ్డి పేర్కొన్నారు. 'కఠిన శ్రమ, సంపూర్ణ పారదర్శకతతోనే ప్రజల విశ్వాసాన్ని సంపాదించాం. చట్టబద్ధంగా ఎన్నికలు నిర్వహించే విషయంలో భారత ఎన్నికల సంఘం నేడు ప్రపంచానికి స్వర్ణ ప్రమాణంగా నిలిచింది' అని ఆయన తెలిపారు.

# కెసిఆర్, కెటిఆర్‌వి పచ్చి అబద్ధాలు

## పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు 30 శాతమే పనులు..

## 80 వేల కోట్ల ప్రాజెక్టుకు వేల కోట్లు ఖర్చుచేస్తే 90 శాతం ఎలా పూర్తవుతుంది?

## రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

## మహబూబ్‌నగర్ జిల్లాలో మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి పర్యటన



**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 14, ప్రభాతవార్త :** కేటీఆర్ కెసిఆర్ వి పచ్చి అబద్దాలని, లక్ష కోట్ల అప్పు చేసి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని రహదారులు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వ్యయం 80 వేల కోట్లకు 27 వేల కోట్లు ఖర్చు చేస్తే 90!! పనులు ఎలా పూర్తవుతాయో చెప్పాలని ప్రశ్నించారు. మహబూబ్నగర్ జిల్లా దేవరకద్ర భూత్పూర్ మండలాల్లో పలు అభివృద్ధి పనులకు మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. కేసీఆర్‌ను కేటీఆర్ ను తిట్టడానికి కవిత ఉందని, తాము అవసరం లేదన్నారు.

వెనుక బడిన వలసల జిల్లా నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి గా ఏ.రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతు న్నారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హులైన అందరికీ రేషన్ కార్డులు అందచేయడమే కాక సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి  ్మ ద్వారా ఆర్.టి.సి. బస్సుల ద్వారా 10 వేల కోట్ల రూ.లు ఖర్చు పెట్టీ మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

గుడిసెల్లో ఉన్న పేద వారికి 50 లక్షల కుటుంబాలకు 100 యూనిట్ వరకు విద్యుత్ ఉచితంగా కల్పిస్తూ కరెంట్ సంస్థలకు 6 వేల కోట్ల రూ.లు చెల్లిస్తున్నట్లు తెలిపారు.రైతులకు 21 వేల కోట్ల రూ.లు 2 లక్షల వరకు రుణమాఫీ చేసిందని తెలిపారు.

ప్రతి నియోజకవర్గంలో 20 వేల కోట్ల రూ లు ఖర్చు చేసి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు.దేవరకద్ర,జడ్చర్ల నియోజక వర్గంలో కూడా పాఠశాలల పనులు జరుగుతున్నట్లు తెలిపారు.

గత ప్రభుత్వం 7 లక్షల కోట్లు అప్పులు చేసిన వాటికి వడ్డీ,అసలుకు 13 వేల కోట్ల రూ.లు చెల్లిస్తున్నట్లు తెలిపారు.దేవరకద్ర, భూత్పూర్ మున్సిపాలిటీల్లో పలు అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఎస్.ఎల్.బి.సి సొరంగం పను లు అమెరికా నుండి బేరింగ్ లు తెప్పించినట్లు,వేరే విధంగా మళ్లీ పనులు మొదలు పెట్టినట్లు తెలిపారు.సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ రైతులు పాడి పంటలతో,మహిళలు కోటీశ్వరులు కావాలని,ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన అన్నారు.

రాష్ట్ర పశుసంవర్ధక పాడి అభివృద్ధి, మత్స్య, క్రీడల,యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీ హరి మాట్లా డుతూ స్థానిక శాసన సభ్యులు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు.గ్రామాలు, మండలం లో అభివృద్ధి పనులు చేపట్టడం పండుగ అన్నారు. శాసన సభ, పంచాయతీ ఎన్నికల లో ఆశీర్వదించి గెలిపించిన విధంగా వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కూడా అభివృద్ధికి పట్టం కట్టాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి కలెక్టర్ విజయేంద్ర బోయి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

## మంత్రి గడ్డం వివేక్

**రామకృష్ణాపూర్, జనవరి 14, ప్రభాతవార్త:** రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభి వృద్ధి ధ్యేయంగా అనేక పథకాలు ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని వార్డులలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. మున్సిపల్ వార్డులలో నివాసాలకు సమీపంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లను వేరే ప్రదేశాలకు మార్చేలా త్వరలోనే పనులు చేపడతామని తెలిపారు. అమృత్ పథకం క్రింద క్యాతనపల్లి మున్సిపాలిటీకి 40 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, ఈ పథకంలో చేపట్టిన పనులు దాదాపు 50 శాతం పూర్తయ్యాయని, త్వరలోనే మిగిలిన పనులను పూర్తి చేసి ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా శుద్ధమైన తాగునీటి అందిం చేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

# 18న కేబినెట్‌లో పోలవరం-నల్లమల్లసాగర్‌పై చర్చ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 14:** పోలవరం-నల్లమల్లసాగర్ ప్రాజెక్టుపై కేబినెట్ సమావేశంలో చర్చించి ముందుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 18న మేడారంలో జరిగే కేబినెట్ సమావేశ అజెండాలో ఈ అంశాన్ని చేర్చింది. నల్లమలసాగర్‌పై ఏపీని కట్టడి చేసేలా న్యాయపరమైన అంశాలన్నిటినీ దీనిలో చర్చించనుంది. ఇటీవల వేసిన పిటీషన్‌కు విచారణార్హత లేదని సుప్రీంకోర్టు చెప్పడంతో తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే.దీంతో సివిల్ సూట్‌ను పగడ్బందీగా దాఖలు చేసేందుకు రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్ణయించింది. ఏపీ చేపడుతున్న పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టుకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడో నిర్ణయించుంది. ఈ క్రమంలో ప్రాజెక్టుకు సంబంధించిన ఆధారాలను సిద్ధం చేసుకుంది. ఇంతకు ముందు పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు ఏపీ ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టు రూపొందించి కేంద్ర జలశక్తిశాఖకు పంపించింది. దీనిపై కృష్ణా, గోదావరి బోర్డులు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ అభ్యంతరం తెలిపాయి. అలాగే పలు గోదావరి పరీవాహక రాష్ట్రాలు కూడా అనేక సందేహాలను లేవనెత్తాయి. ఈ పోలవరం-నల్లమలసాగర్ లింకన ప్రాజెక్టుపై కేంద్ర జలశక్తి మంత్రిని, సీడబ్ల్యూసీని కూడా కలిసి తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. మరోవైపు ఏపీ ఈ లింక్ ప్రాజెక్టు డీపీఆర్‌కు టెండర్లు పిలిచిన విషయం విదితమే. చివరికి ఈ లింక్ టెండర్లను ఏపీ ప్రభుత్వం రద్దు చేసింది. పోలవరం-బరకచర్ల లింక్ ప్రాజెక్టులో మార్పు చేసి బనకచర్ల బదులు నల్లమల సాగర్‌కు నీటిని తరలించేందుకు కొత్త లింక్‌ను ఆంధ్రప్రదేర్ ప్రభుత్వం తెరపైకి తీసుకొచ్చింది.

ఈ లింక్‌లో భాగంగా గోదావరిపై నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు నుంచి 200 టీఎంసీలను బొల్లాపల్లి రిజర్వాయర్ ద్వారా నల్లమల సాగర్‌కు తరలించనుంది. తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజినీర్లు ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం, ట్రైబ్యునల్ అవార్డులు ఇతర నిబంధనల న్నింటినీ ఉల్లంఘిస్తూ, తెలంగాణ అభ్యంతరాలను ఖాతరు చేయకుండా ఏపీ ఈ లింక్ ప్రాజెక్టు చేపడుతోందని అని ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టును ఆశ్రయించడం మినహా మరేదారీ లేదు. పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.58 వేల కోట్లు ఖర్చు అవుతుందని ఏపీ ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. మొదట్లో భావించిన మూడు సెగ్మెంట్లలోనే పనులు చేయను న్నారు. మూడో సెగ్మెంట్‌లో గతంలో అనుకున్నట్లు బొల్లాపల్లి జలాశయం నుంచి బనకచర్ల వరకు కాకుండా బొల్లాపల్లి నుంచి నల్లమలసాగర్ జలాశయం వరకే అది పరిమితం కానుంది. ఇందుకు రూ.9 వేల కోట్లు ఖర్చు అవుతాయని లెక్క.మొదటి, రెండు సెగ్మెంట్లలో ఎలాంటి మార్పు లేదు. తొలి సెగ్మెంట్‌కు (పోలవరం ప్రకాశం బ్యారేజి) రూ.13 వేల కోట్లు ఖర్చు, రెండో సెగ్మెంట్‌కు (ప్రకాశం బ్యారేజి బొల్లాపల్లి)లో బొల్లాపల్లి రిజర్వాయర్ నిర్మించి అక్కడికి పోలవరం నీటిని తరలిస్తారు. దీనికి రూ.36 వేల కోట్లు ఖర్చు అవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఈ ప్రాజెక్టుపై ఆశ్రయించడంపై ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో తెలియాలి. బొల్లాపల్లి జలాశయానికి నీళ్లు తీసుకెళ్లి అక్కడి నుంచి వెలిగొండ ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న నల్లమలసాగర్ జలాశయానికి గోదావరి నీళ్లు తరలించాలనేది కొత్త ప్రణాళిక. అవసరమైతే ఈ జలాలను సోమశిలకూ మళ్లిస్తారు. ఈ ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది.

కాగా, అనుమతులు లేకుండా పోలవరం నుంచి బనకచర్ల లేదా నల్లమల సాగర్‌కు లింక్ చేసేందుకు ఏపీ ప్రభుత్వం చేపడుతున్న విస్తరణ పనులను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం కొద్ది రోజుల క్రితం సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. తక్షణమే ఈ పనులు ఆపేలా ఆదేశించాలని న్యాయస్థానాన్ని కోరింది. పోలవరం ప్రాజెక్టు విస్తరణ పనులు చేపట్టడం చట్టబద్ధం కాదని, తెలంగాణ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రీ ఫీజిబులిటీ రిపోర్టులను కేంద్ర ప్రభుత్వం పరిశీలించటం సమంజసం కాదని తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం తెలిపింది. అయితే దాఖలు చేసిన పిటీషన్‌కు విచారణార్హత లేదని సుప్రీంకోర్టు చెప్పడంతో తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. దీంతో సివిల్ సూట్‌ను పగడ్బందీగా దాఖలు చేసేందుకు రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్ణయించింది.

## రోశయ్య కుటుంబాన్ని పరామర్శించిన ఎపి సిఎం చంద్రబాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 14:** దివంగత మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య సతీమణి శివలక్ష్మి (86) ఇటీవల మరణించారు. ఈ నేపథ్యంలో కొణిజేటి రోశయ్య కుటుంబ సభ్యులను సీఎం చంద్రబాబు నాయుడు ఫోన్లో పరామర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని రోశయ్య కుమారుడు శివకు సీఎం చంద్రబాబు ఫోన్ చేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు సీఎం చంద్రబాబు నాయుడు తన సానుభూతి తెలియజేశారు. రోశయ్య కుటుంబంతో తనకు ఉన్న దశాబ్దాల అనుబంధాన్ని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు గుర్తు చేసుకున్నారు. కొణిజేటి రోశయ్య సతీమణి శివలక్ష్మి (86) సోమవారం హైదరాబాద్ అమీర్‌పేటలోని తమ నివాసంలో మృతి చెందారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం దేవరయాంజాల్ పరిధిలోని రోశయ్యకు చెందిన ఫామ్‌హౌస్‌లో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. రోశయ్య దంపతులకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వేమూరుకు చెందిన శివలక్ష్మిని కొణిజేటి రోశయ్య వివాహం చేసుకున్నారు. రోశయ్య రాజకీయంగా ఎదుగుదలలో ఆమె అడుగడుగునా ఆయనకు అండగా నిలిచారు. శివలక్ష్మి మరణవార్త తెలియగానే పార్టీలకు అతీతంగా పలువురు రాజకీయ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో రోశయ్య నివాసానికి తరలి వచ్చారు. సుదీర్ఘ రాజకీయ జీవిత చరిత్ర కలిగిన రోశయ్య.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా బడ్జెట్ ప్రవేశ పెట్టి రికార్డు సృష్టించారు. ఉమ్మడి ఏపీకి ముఖ్యమంత్రిగా, తమిళనాడు రాష్ట్ర గవర్నర్‌గా గతంలో ఆయన పని చేశారు. 2021, డిసెంబర్ 4వ తేదీన కొణిజేటి రోశయ్య మరణించిన సంగతి తెలిసిందే.



### విజయవాడ పశ్చిమ బైపాస్

## నేటి నుంచి వాహనాలకు అనుమతి

### ఇక విజయవాడ టచ్ చేయకుండా గుంటూరు నుంచి ఏలూరు, హైదరాబాద్‌కు వాహనాలు

**విజయవాడ,జనవరి 14.ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ పశ్చిమ బైపాస్‌లో కాజా నుంచి గొల్లపూడి, ఏలూరు వైపు (ఒకవైపు) వెళ్లే వాహనాలను సంక్రాంతి సందర్భంగా ఈ నెల 15 నుంచి అనుమ తించనున్నారు. ట్రయల్ రన్ కింద ద్విచక్ర వాహనాలు, కార్లు, బస్సులు, లారీలు ఇలా అన్ని రకాల వాహనాలు బైపాస్‌లో ప్రయాణించేందుకు అవకాశం కల్పించనున్నారు. ఈ మేరకు జాతీయ రహ దారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం బైపాస్‌ను ఒకసారి పరిశీలించి గురువారం నుంచి వాహనాలను అనుమతించేందుకు సిద్ధమయ్యారు. దీంతో చెన్నై, గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు కాజా టోల్‌గేట్ దాటిన తర్వాత పశ్చిమ బైపాస్‌లోకి వచ్చి గొల్లపూడి మీదుగా చిన్నఅవుటపల్లి వరకు వెళ్లి, అక్కడ ఏలూరువైపు హైవేలోకి చేరుకొని వెళ్లిపోవచ్చు. ఇప్పటికే గొల్లపూడి నుంచి చిన్నఅవుటపల్లి మీదుగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. గురువారం నుంచి కాజా వైపు నుంచి వచ్చే వాహనాలు నేరుగా ఏలూరు వైపు వెళ్లొచ్చు. గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు ఈ బైపాస్‌లో గొల్లపూడి వద్ద విజయవాడ -హైదరాబాదన హైవేలోకి చేరుకొని హైదరాబాద్ వైపు వెళ్లిపోవచ్చు. దీంతో గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాల్లో ఏలూరు, హైద రాబాద్ వెళ్లే వాహనాలేవీ విజయవాడ నగరంలోకి రావాల్సిన అవసరం ఉండదు. అయితే ఈ పశ్చిమ బైపాస్‌లో గొల్లపూడి వైపు నుంచి వచ్చే వాహనాలకు మాత్రం ప్రస్తుతం కాజా వరకు వచ్చేం దుకు అవకాశం లేదని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తెలిపారు. మధ్యలో కొన్నిచోట్ల పనులు జరుగుతున్నాయన్నారు. ఆ వాహనాలకు ప్రస్తుతం అనుమతి ఉన్నట్లే గొల్లపూడి వైపు నుంచి వచ్చేటప్పుడు కృష్ణా నదిపై వంతెన, సీడ్ యాక్సెస్ రోడ్డు దాటిన తర్వాత మంగళగిరిమందడం రోడ్డులోకి చేరుకొని సచివాలయం, హైకోర్టు వైపు వెళ్లొచ్చని పేర్కొన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లన్నీ గోతుల మయమయ్యాయి. ఈ సమస్యకు పరిష్కారంగా కూటమి ప్రభుత్వం గతేడాది సంక్రాంతి నాటికి పూర్తయ్యేలా పల్లెపండగ 1.0 కింద 4,300 కి.మీ. మేర రహదారులు పనులు చేపట్టింది. వాటికోసం ఉపాధి హామీ పథకంలో రూ.2 వేల కోట్ల మెటీరియల్ నిధులు ఖర్చు చేసింది. మరో 15 వేల కి.మీ. రోడ్లు బాగు చేయాల్సి ఉండటంతో ఉపాధి పథకంతో పాటు ఇతర కార్యక్రమా లనూ అనుసంధానించి పల్లెపండగ 2.0ని ఇటీవల ప్రారంభించారు.



## యుపి వారియర్స్‌పై ఢిల్లీ కేపిటల్స్ తొలి విజయం

### ఏడు వికెట్ల తేడాతో యుపి జట్టు ఓటమి

### ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా షెఫాలివర్మ

**నవీముంబయి, జనవరి 4:** మహిళాప్రీమియర్‌లీగ్‌లో బుధవారం జరిగిన ఏడో మ్యాచ్‌లో ఢిల్లీ కేపిటల్స్ మహిళాజట్టు ఏడు వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్‌చేపట్టిన యూపి వారియర్స్ టీమ్ ఎనిమిది వికెట్ల నష్టానికి 154 పరుగులుచేస్తే తదనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఢిల్లీ కేపిటల్స్ మూడు వికెట్ల నష్టానికి 158 పరుగులుచేసింది. ఏడు వికెట్ల తేడాతో నిర్ణీత ఓవర్లలో విజయం కైవసంచేసుకుంది. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా డిసి మహిళల్లో షెఫాలివర్మ ఎంపికయింది. 32 బంతుల్లో 36 పరుగులుచేయడంతోపాటు బౌలింగ్‌లో కూడా 16 పరుగులిచ్చి రెండు వికెట్లు తీసింది. జట్టులో లిజెఇలీ 67 పరుగులుచేసి చెలరేగింది. లారా వాల్వార్డ్ 25 పరుగులుచేసి జట్టు విజయానికి తోడ్పడ్డారు. షెఫాలివర్మ 32 బంతుల్లో 36, జెమీమా రోడ్రిగ్స్ 24 బంతుల్లో 21 పరుగులుచేస్తే మారిజానే ఐదుపరుగులతోనే వెనుదిరిగింది. యూపి బౌలర్లలో దీప్తిశర్మ రెండు, ఆశా శోభన ఒక వికెట్ తీసింది. ఢిల్లీకి ఈ మ్యాచ్ గెలుపు తొలివిజయం కావడం గమనార్హం. యుపికి వరుసగా ఇది మూడో ఓటమి అయింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన యూపి నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లనష్టానికి 154పరుగులు చేసింది. ఓపెనర్ కెప్టెన్ మెక్‌లానింగ్ 38 బంతుల్లో 9 ఫోర్లు ఒకసిక్స్‌తో 54 పరుగులుచేసింది. హర్లీన్ డియోల్ 36 బంతుల్లో ఏడుఫోర్లతో 44 పరుగులుచేసిరిటైర్డ్ ఔట్‌గా వెనుదిరిగింది. ఫోబ్ లిచ్‌ఫీల్డ్ 27, శ్వేతా సెహ్రావత్ 11 పరుగులుచేసారు. ఢిల్లీ బౌలర్లలో మారిజెన్‌కాప్ రెండు, షెఫాలివర్మ 2, నందినిశర్మ, స్నేహ్‌రాణా, శ్రీచరణి ఒక్కో వికెట్ తీసారు.

# ప్రభుత్వ ఉద్యోగుల డిఏ పెంపుతో ఖజానాపై రూ.277 కోట్ల భారం

### సిపిఎస్ వారికి 90 శాతం 30 నెలల్లో చెల్లింపు

### మిగిలిన సొమ్ము సిపిఎస్ ప్రాన్ అకౌంట్‌లో జమ.. ఆర్థిక శాఖ కసరత్తు

**హైదరాబాద్, జనవరి 14, ప్రభాతవార్త :** సంక్రాంతి సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులకు డియర్‌నెస్ అలవెన్స్ (డీఏ)ను 3.64 శాతం పెంచుతున్నట్లు తెలంగాణ సర్కార్ ప్రకటించింది. దీంతో 30.03 శాతం నుంచి 33.67 శాతానికి డీఏ చేరింది. ఈ పెంపు జూలై 1, 2023 నుంచి అమల్లోకి వస్తుంది. ఈ మేరకు పెరిగిన డీఏతో ఖజానాపై ఎంత భారం పడుతుంది, ఉద్యోగులకు ఎంత వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది, దాన్ని ఏ విధంగా చెల్లించాలి తదితర వాటిపై ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది. ఆ శాఖ అధికారుల సమాచారం ప్రకారం డీఏ పెంపుతో రాష్ట్ర ఖాజానాపై రూ.277 కోట్ల ఆర్థిక భారం పడనుందని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో ఉద్యోగులకు రూ.20,920 నుంచి రూ.1,62,070 వరకు 79 రకాల మూలవేతనాలు ఉన్నాయి. రూ.20920 బేసిక్ జీతం ఉన్న వారికి ప్రస్తుతం రూ.6,282 (30.03) అందుతుండగా, తాజాగా 3.64 శాతం పెంపుతో రూ.7,044 అందుకోనున్నారు. అంటే నెలకు రూ.762 పెరిగింది. బేసిక్ రూ,29,380 ఉన్న ఉద్యోగులకు అయితే కొత్త డీఏ రూ.9,892 చొప్పున నెలకు పెరుగుదల రూ.1,069, రూ.40,000 ఉన్న ఉద్యోగికి కొత్త డీఏ రూ13,468 మేర నెలకు పెంపు రూ.1,456, అత్యధిక బేసిక్ పే రూ.1,62,070 ఉన్న ఉద్యోగులు ప్రస్తుతం రూ.48,670 అందుకుంటుండగా, తాజా పెంపుతో 54,569 రూపాయలకు చేరింది. వీరికి నెలకు రూ.5,899 చొప్పున జీతం పెరగనుంది. ఇక పెరిగిన డీఏను ఉద్యోగుల జిపిఎఫ్ అకౌంట్‌లో జమ చేయనున్నారు.

ఏప్రిల్ 30వ తేదీలోపు పదవీ విరమణ కానున్న ఉద్యోగులకు రానున్న 30 నెలల వాయిదాల్లో చెల్లించనున్నారు. సెప్టెంబరు 1, 2004 తరువాత ఉద్యోగాల్లో చేరి, కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌లో ఉన్న వారికి జులై 2023 నుంచి డిసెంబరు 2025 వరకు పెరిగిన డీఏలో 90 శాతాన్ని శాలరీ అకౌంట్‌లో 30 నెలలపాటు శాలరీతో పాటు ఇవ్వనున్నారు. మిగిలిన 10 శాతం డీఏ అమోంట్‌ను సిపిఎస్ ప్రాన్ అకౌంట్‌లోకి జమ చేయనున్నారు. ఇక బిశిలీ లేని కంటింజెంట్ ఎంప్లాయిస్‌కు 30 నెలల వాయిదాల్లో డీఏ బకాయిలు అందజేయనున్నారు. ఒకవేళ ఈ జీవో విడుదలకు ముందు ఎవరైనా ఉద్యోగి మరణించి ఉంటే, వారి వారసులకు ఒకేసారి డీఏ పెంపు బకాయిలు ఇవ్వనున్నట్లు ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు.

# ఊరంతా సంక్రాంతి

### నారావారిపల్లెలో వేడుకల్లో పాల్గొన్న ఎపి సిఎం చంద్రబాబు దంపతులు



బుధవారం నారావారిపల్లెలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఎపి సిఎం చంద్రబాబు, సతీమణి భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్

**విజయవాడ,జనవరి14,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగునాట సంక్రాంతి సందడి మొదలైంది.బుధవారం తెల్లవారు జామునుంచే రాష్ట్రంలో సంక్రాంతి సందడి కనిపిస్తోంది.భోగి మంటలు గుండెల నిండుగా ఆనందరాగాన్ని పలికిస్తున్నాయి. సంక్రాంతి శోభతో తెలుగు లోగిళ్ల వెలుగులీనుతున్నాయి. భోగభాగ్యాల భోగిని సంక్రాంతిని ప్రజలు అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నారు.భోగి పర్వదినాన ఊరూవాడా తెల్లవారు జామునే సందడి నెలకొంది. ఏడాదంతా సుఖశాంతులతో ఉండాలని, నవ ధాన్యాలు, సిరి సంపదలు కలగాలని కోరుకుంటూ, భోగి మంటలు వేశారు. కొత్త కాలానికి స్వాగతం పలుకుతూ, భోగిమంటల చుట్టూ చిన్నా పెద్దా కేరింతలు కొట్టారు. విజయవాడలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన వారే కాక దేశ విదేశాల్లో ఉన్న తెలుగు వారు సైతం ఇందులో పాల్గొని ఉత్సాహంగా గడిపారు. పిల్లలకు పండగ విశిష్టత, సంప్రదాయాలను తెలియజేశారు. విజయవాడ గురునానక్ కాలనీలోని ఫన్ టైం క్లబ్ ప్రత్యేక ఏర్పాట్లు చేసిన సంక్రాంతి వేడుకలు ఆకట్టుకున్నాయి. తెలుగు వారి సంస్కృతి సాంప్రదాయాలు అంతరించిపోకుండా భావి తరాలకు తెలియజేయడం, వారు పాటించేలా చేయడమే ఆశయంగా వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వివాన్ గేటెడ్ కమ్యూనిటీలో అత్యంత వైభవోపేతంగా భోగి సంబరాలు నిర్వ హించారు. అటు ప్రముఖ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయంలో భోగి సంబరాలు అం బరాన్నంటాయి.తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం నారావారిపల్లెలో భోగి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు స్వగ్రామం సొంత ఇంటి వద్ద భోగి పండుగ నేపథ్యంలో టెంకాయ, అరటి ఆకులతో ప్రత్యేక తోరణాలతో అలంకరించారు. శ్రీసత్య సాయి జిల్లా పెనుకొండలోని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత నివాసం వద్ద ఉదయాన్నే భోగి మంటలు వెలిగించి సంక్రాంతి సంబరాలు ప్రారంభించారు.

ఒంగోలులోని టీడీపీ ఆఫీసులో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు భోగి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అందరికీ భోగి శుభాకాంక్షలు తెలిపారు. విజయనగరం జిల్లా వ్యాప్తంగా భోగి వేడుకలు ఘనంగా జరిగాయి. వాడవాడల వేకువ జాము నుంచే భోగి మంటలతో ప్రజలు సందడి చేశారు. గంగిరెద్దులు, హరిదాసులు ఆటపాటలతో అలరించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)కార్యాలయంలో భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భోగిమంటలు వెలిగించి సంబరాల్లో ఎంపీ కేశినేని చిన్ని పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో అసలైన పండుగ వాతావరణం నెలకొందని అన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట టీడీపీ కార్యాలయంలో ఘనంగా భోగి వేడుకలు నిర్వహించారు.

వేడుకల్లో పాల్గొని అభిమానులతో కలిసి ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు నృత్యం చేశారు. శ్రీ సత్య సాయి జిల్లా పెనుకొండలోని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత నివాసం వద్ద ఉదయాన్నే భోగి మంటలు వెలిగించి సంక్రాంతి సంబరాలు ప్రారంభించారు. ఒంగోలులోని టీడీపీ ఆఫీసులో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు భోగి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అందరికీ భోగి శుభాకాంక్షలు తెలిపారు. విజయనగరం జిల్లా వ్యాప్తంగా భోగి వేడుకలు ఘనంగా జరిగాయి. వాడవాడల వేకువ జాము నుంచే భోగి మంటలతో ప్రజలు సందడి చేశారు. గంగిరెద్దులు, హరి దాసులు ఆటపాటలతో అలరించారు.

నెల్లూరు జిల్లాలో భోగి పండుగను వైభవంగా జరుపుకుంటున్నారు. నగరంలో ప్రజలు వేకువజామునే భోగి మంటల వేశారు. నెల్లూరులో పలు డివిజన్లలో భోగి వేడుకల్లో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ పాల్గొన్నారు. మూలాపేట మూలస్థానేశ్వర ఆలయం వద్ద కేకు కట్ చేసి భోగి మంటలు వెలిగించారు. ట్రంకురోడ్డు శివాజీ సెంటర్ వద్ద బాణసంచా కాల్చి సంబరంగా మంటలు వేశారు.

కార్యకర్తలతో కలిసి పండుగ జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని మంత్రి నారాయణ అన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ పాలన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు గాడిలో పెడుతున్నారని చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెంలో స్థానిక కూటమి నాయకుడు ద్వారంపూడి వెంకట రెడ్డి ఆధ్వర్యంలో భారీ భోగిమంట ఏర్పాటు చేశారు. 20 అడుగుల ఎత్తు, 40 అడుగుల చుట్టూ విస్తీర్ణతతో భోగి మంట కోసం భారీగా దుంగలు ఏర్పాటు చేశారు. అనపర్తి ఎమ్మెల్యే ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించి భోగిమంట వెలిగించి వేడుకలను ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ప్రజలు ఆనందోత్సవాలతో పండుగను జరుపుకుంటున్నారని ఎమ్మెల్యే అన్నారు సంక్రాంతి శోభతో తెలుగు లోగిళ్ల వెలుగులీనుతున్నాయి. భోగభాగ్యాల సంక్రాంతిని ప్రజలు అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నారు. పట్టణం నుంచి పల్లెకు చేరిన వారంతా వేకువజామునే లేచి భోగి మంటలు వేశారు. ఆటపాటలతో సందడి చేస్తున్నారు. రాష్ట్రంలో సంక్రాంతి సందడి కనిపిస్తోంది. పలు ప్రాంతాల్లో తెలుగు ఇళ్లలో పసిపిల్లలకు భోగి(రేగు)పండ్లు పోసారు.టంగుటూరు తూర్పునాయుడుపాలెంలోని తన నివాసంలో భోగి వేడుకల్లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ భోగి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగను కుటుంబ సభ్యులతో ప్రతి ఒక్కరు ఆనందంగా జరుపుకోవాలి. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా ప్రజా సంక్షేమానికి తమ ప్రభుత్వం పాటు పడుతోందన్నారు. సంక్రాంతి కానుకగా ప్రభుత్వ ఉద్యోగులు, రైతులు, విద్యార్థులు, చిరు వ్యాపారులకు,కాంట్రాక్టర్లు, పోలీసు సిబ్బందికి బకాయిలు రూ.6,700 కోట్లు విడుదల చేశా మన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు.

## చేనేత కార్మికుల రుణమాఫీ కోసం రూ.16.27 కోట్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 14:** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు, చేనేత కార్మికులకు లక్ష వరకు రుణమాఫీ కోసం అదనంగా రూ.16.27 కోట్ల పరిపాలన అనుమతులు జారీ అయినట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గతంలో రూ.33 కోట్ల నిధులు చేనేత కార్మికులు రుణమాఫీ గ్రహీత అకౌంట్స్ లో జమ చేయుటకు ఆయా జిల్లాలకు ఈ నిధులను విడుదల చేసినట్టు ఆయన తెలిపారు. 1.4.2017 నుంచి 31.3.2024 వరకు లక్ష రూపాయలు చేనేత కార్మికుల వ్యక్తిగత రుణాలు మాఫీ కానున్నాయి. మొత్తం 6,784 మంది చేనేత కార్మికులకు రుణమాఫీ ద్వారా లబ్ధి పొందుతున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేత కార్మికుల సంక్షేమం కోసం దాదాపు రూ.960 కోట్లు ఖర్చు చేశామని ఆయన తెలిపారు. చేనేత కార్మికులకు ఎల్లప్పుడు పని కల్పించాలన్న ఉద్దేశ్యంతో అన్ని ప్రభుత్వ శాఖలు టెస్కో నుంచే వస్త్రాలు కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. అందుకు అనుగుణంగా ఇప్పటికే రూ.896 కోట్ల విలువైన వస్త్రాలకు వివిధ ప్రభుత్వ శాఖల నుంచి ఆర్డర్లు వచ్చాయని ఆయన తెలిపారు.

ఇందిరా మహిళాశక్తి చీరల పథకం ద్వారా 30 వేల మర మగ్గాలకు నిరంతరం పని కల్పించడానికి చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. రూ.150 కోట్లతో చేనేత అభయహస్తం పథకాన్ని అమలు చేస్తున్నామని, గత ప్రభుత్వం కార్మికులకు చెల్లించకుండా వదిలేసిన రూ.290 కోట్లను నేతన్నకు చేయూత పథకం కింద కార్మికుల ఖాతాల్లో జమ చేశామని ఆయన తెలిపారు. చేనేత సహకార సంఘాల నుంచి వస్త్రాలు కొనుగోలు చేసి చేనేత వస్త్ర ప్రదర్శన,వర్కింగ్ కేపిటల్ సపోర్ట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరంలో జిల్లా సహకార బ్యాంకుల ద్వారా 78 సహకార సంఘాలకు రూ.19 కోట్లు వర్కింగ్ కేపిటల్ మంజూరు చేశామని పేర్కొన్నారు.

## స్థానిక సంస్థలకు రూ.11 వేల కోట్లకుపైగా నిధులు

### తెలంగాణలో స్థానిక సంస్థల బలోపేతానికి కేంద్రం సానుకూల నిర్ణయం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 14:** తెలంగాణలో గ్రామపంచాయతీలు, స్థానిక సంస్థల బలోపేతానికినిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. గత దశాబ్ద కాలంగా తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థలకు.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రూ.11వేల కోట్లకు పైగా నిధులను విడుదల చేసిందని ఆయన చెప్పారు. ఈ మేరకు ఆయన బుధవారం ప్రకటన విడుదల చేశారు.

2015-16 నుంచి 2019-20లలో కేంద్రం తెలంగాణలో గ్రామపంచాయతీలకు రూ.5,060 కోట్లు విడుదల చేయగా 2020-21 నుంచి 2025-26 లలో ఈ కేటాయింపులు 80శాతం (రూ.9,050 కోట్లు) పెరిగాయన్నారు. దీనిలో రూ.6,051 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందని కిషన్ రెడ్డి తెలిపారు.గ్రామీణ స్థాయి నుంచి ప్రజాస్వామ్య సంస్థలను బలోపేతం చేయడం ద్వారా మారుమూల ప్రాంతాల వరకు జవాబుదారీతనం, పారదర్శకత పెరుగుతుందని కేంద్ర ప్రభుత్వం విశ్వసిస్తోందని, ఇందుకోసం, స్థానిక సంస్థలకు సంబంధించిన నిధులను మొదట్నుంచీ సమయానుగుణంగా విడుదల చేస్తోందన్నారు.

ఇటీవల తెలంగాణాలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తయినందున కేంద్రం మిగిలిన నిధులను కూడా త్వరలోనే విడుదల చేయనున్నదని కిషన్ రెడ్డి తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధుల ఖర్చుపై యుటిలైజేషన్ సర్టిఫికెట్లను ఇటీవలే సబ్మిట్ చేశారని, దీనికి తోడు గ్రామపంచాయతీలకు ఎన్నికలు కూడా పూర్తయినందున 2024-25 సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత నిధులు రూ.260 కోట్లను త్వరలోనే కేంద్ర ప్రభుత్వం విడుదల చేయనున్నదని, వీటి యుటిలైజేషన్ సర్టిఫికెట్లు ఇవ్వగానే దశల వారీగా మిగిలిన రూ.2,500 కోట్ల నిధులు కూడా విడుదల కానున్నాయని ఆయన చెప్పారు.

# సిరీస్ సమం చేసిన కివీస్..

### రెండో వన్డేలో ఏడు వికెట్ల తేడాతో భారత్‌పై గెలుపు

### ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా డారిల్ మిచెల్



**రాజ్‌కోట్, జనవరి 14:** న్యూజిలాండ్ భారత్ జట్లమధ్య జరిగిన రెండో వన్‌డే ఇంటర్నేషనల్‌లో ఏడు వికెట్ల తేడాతో న్యూజిల్యాండ్ గెలుపొందింది. రాజ్‌కోట్ లో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌చేపట్టిన భారత్ జట్టు ఏడు వికెట్లనష్టానికి 284 పరుగులుచేసి ప్రత్యర్థికి 285 పరుగుల లక్ష్యం నిర్దేశించింది. తదనంతరం బ్యాటింగ్ చేపట్టిన న్యూజిలాండ్ జట్టు నిర్ణీత ఓవర్లలో 15 పరుగులు మిగిలి ఉండగానే లక్ష్యం ఛేదించింది. మూడు వికెట్లు నష్టపోయి 286 పరుగులుచేసి విజేతగా నిలిచింది. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా డేరిల్‌మిచెల్ ఎంపికయ్యాడు. 117 బంతుల్లో 131 పరుగులుచేసి బెస్ట్‌ప్లేయర్‌గా నిలిచాడు. కివీస్ విజయంతో మూడు వన్డేల సిరీస్‌ను కివీస్ 1-1తో సమం చేసింది. డారిల్‌మిచెల్ ఈ మ్యాచ్‌లో 131 పరుగులుచేసి శతకం దాటేసాడు. 117 బంతుల్లో 11 ఫోర్లు, రెండుసిక్స్‌లతో సెంచరీచేసాడు. విల్‌యంగ్ 98 బంతుల్లో ఏడుఫోర్లతో 87 పరుగులుచేసి సెంచరీ మాత్రంమిస్ అయ్యాడు. ఓపెనర్లు డేవాన్ కాన్వే 16, హెన్రినికోల్స్ 10 సత్వరమే నిష్క్రమించినా తర్వాత వచ్చిన విల్ యంగ్, డారిల్ మిచెల్‌మూడో వికెట్‌కు 162 పరుగుల భాగస్వామ్యం తెచ్చి జట్టు విజయానికి తోడ్పాటు నిచ్చారు. గ్లెన్‌ఫిలిప్స్ 32 పరుగులుచేసి రాణించాడు. భారత బౌలర్లలో హర్షిత్‌రాణా ప్రషిద్ కృష్ణ కుల్‌దీప్ యాదవ్ ఒక్కో వికెట్ తీసారు. సిరీస్ నిర్ణయాత్మక మూడో వన్డే ఈనెల 18న ఇండోర్‌లోజరుగుతుంది. ఇక బ్యాటింగ్‌లో భారత బ్యాటర్లలో కెఎల్‌రాహుల్ 92 బంతుల్లో 11ఫోర్లు, ఒక సిక్స్‌తో 112 పరుగులుచేసి సెంచరీతో మెరిశాడు. కెప్టెన్ శుభ్‌మన్‌గిల్ 53 బంతుల్లో 9 ఫోర్లు ఒక సిక్స్‌తో 56 పరుగులుచేసి అర్థ శతకం దాటాడు. రోహిత్‌శర్మ 24, విరాట్ కోహ్లి23, రవీంద్ర జడేజా 27, నితీశ్‌రెడ్డి 20 పరుగులుచేసారు. శ్రేయస్ అయ్యర్ ఎనిమిదివ పరుగులతో నిరాశపరిచాడు. న్యూ జిలాండ్ బౌలర్లలో క్రిస్టియన్ క్లార్క్ 3జెమీసన్, ఫౌక్స్, జెడేన్ లెనాక్స్, మైకేల్ బ్రాస్‌వెల్ చెరొక వికెట్‌తీసారు.

## టివికె విజయ్‌కి సిబిఐ మరోసారి సమన్లు



**న్యూఢిల్లీ, జనవరి 14:** కరూర్ తొక్కిసలాట ఘటనపై నటుడు, తమిళ వెట్రిగం కళగం ( టీవీకే) చీఫ్ విజయ్‌కు కేంద్ర దర్యాప్తుసంస్థ సిబిఐ మరోసారి సమన్లు జారీచేసింది. ఈనెల12న విజయ్ సీబీఐ విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. ఆరు గంటల పాటు ఆయనను సీబీఐ అధికారులు ప్రశ్నించారని, తొక్కిసలాటలో 41 మంది మరణాలకు తమ పార్టీ బాధ్యత వహిస్తుందని ఆయన చెప్పినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. విజయ్‌ను సీబీఐ మొత్తం 19 ప్రశ్నలు అడిగినట్టు సమాచారం. ఈనెల 19వ తేదీ మరోసారి విచారణకురావాలని విజయ్‌కు సిబిఐ అధికారులు సమన్లు జారీచేసారు. గత ఏడాది సెప్టెంబరు 27 న కరూర్‌లో విజయ్ ర్యాలీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోగా వంద మందికిపైగా గాయపడ్డారు. ఈ కేసుపై దర్యాప్తునకు తమిళనాడు ప్రభుత్వం ఏకసభ్య కమిషన్, మద్రాసు హైకోర్టు సిట్‌ను ఏర్పాటుచేయగా సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐకి అప్పగించారు.

సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి అధ్యక్షతన ప్యానెల్ సీబీఐ విచారణను పర్య వేక్షించాలని సుప్రీంకోర్టు సూచించింది. ఏడాది జరగబోయే ఎన్నికల కోసం విజయ్ జిల్లాల పర్యటన చేపట్టారు. కరూర్ జిల్లా పర్యటన సందర్భంగా నిర్ణీత సమయానికంటే విజయ్ వేదిక వద్దకు చేరుకోవ డంలో జాప్యం వల్లే ఈ గందరగోళం ఏర్పడిందని తమిళనాడు పోలీసులు ఆరోపించారు. ఆహారం, నీరు, టాయిలెట్ సౌకర్యాలు వంటి తగిన ఏర్పాట్లు లేవని, ఆగ్రహంతో ఉన్న జనం అదుపు తప్పారని వారు పేర్కొన్నారు. విజయ్ పార్టీ ఈ ఆరోపణలను ఖండించింది, దీని వెనుక అధికార డీఎంకే కుట్ర ఉందని విజయ్ ఆరోపించారు. ఈ ఆరోపణను అధికార పార్టీ తిరస్కరించింది. జనసమూహ నిర్వహణ సరిగా లేకపోవడం, వేదికకు వెళ్లే రోడ్లపై ఉన్న అడ్డంకులను తొలగించడంలో పోలీసులు విఫలమయ్యారని కూడా ఆయన ఆరోపించారు. ఈ ఘటన తర్వాత రాజకీయ నాయకుల సభలు, ర్యాలీలకు తమిళనాడు ప్రభుత్వం ఆంక్షలు విధించింది.

విజయ్ సభలకు మొత్తం 84 షరతులతో కూడిన అనుమతులు ఇచ్చింది. కాగా, బాధితులను నేరుగా ఓదార్చడానికి వస్తానని హామీ ఇచ్చిన విజయ్ అలా కుదరకపోవడంతో మహాబలిపురంలోని ఓ రిసార్ట్ వద్ద వారిని కలిసి పార్టీ తరఫున బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.20 లక్షలు చొప్పున పరిహారం అందజేశారు.

# 'కేర్ అండ్ గ్రోత్' యాప్ అందుబాటులోకి

## పిల్లల కోసం కృత్రిమ మేధతో రూపొందించిన ప్రభుత్వం

**విజయవాడ.జనవరి14,ప్రభాతవార్తప్రతినిధి:** ఎదిగే పిల్లలకు పరిపూర్ణ ప్రయోజనాన్ని కలిగించే దిశలో కృతిమ మేధోను ఉపయోగించి రూపొందించిన కేర్ అండ్ గ్రోత్ యాప్‌ను అందుబాటులోకి తీసుకుని వచ్చింది. పిల్లల ఎదుగుదల అంటే పౌష్టికాహారం, ఎత్తు, బరువు మాత్రమే కాదు. అంతకు మించిన 'మేధో సంపత్తి అని వివరించే దిశలో ఈ యాప్ రూపొందింది.6 ఏళ్ల నిండే లోపే 90 శాతం మెదడు ఎదుగుదల పూర్తి అవుతుందన్న శాస్త్రీయ వాస్తవాన్ని ఆధారంగా చేసుకున్నారు. చిన్నారుల సమగ్ర వికాసమే లక్ష్యంగా ఏఐ సాంకేతికతతో రూపొందించిన "కేర్ అండ్ గ్రో మొబైల్ యాప్"ను తీర్చిదిద్దారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల శారీరక ఆరోగ్యం పైనే దృష్టి పెడతారు. కానీ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈ యాప్‌తో పిల్లల మెదడు పని తీరు, సామాజిక ప్రవర్తన, భాషా నైపుణ్యాలు, గ్రహణ శక్తి లాంటి కీలక అంశాలను పరీక్షిస్తారు. 06 ఎర్లీ చైల్డ్ హుడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా స్వర్ణ నారావారిపల్లెలో పైలట్ ప్రాజెక్టుగా దీన్ని సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రారంభించారు. ప్రస్తుతం 8 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 271 మంది పిల్లల పై జరిపిన పరీక్షల్లో సానుకూల ఫలితాలు వచ్చాయి. స్క్రీనింగ్ తర్వాత 4 శాతం పిల్లల్లో తీవ్రమైన ఎదుగుదల లోపాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటిని సరైన సమయంలో గుర్తించకపోతే వారు భవిష్యత్తులో వెనుకబడిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకే గ్రామంలో పుట్టిన 2 పిల్లల్లో ఒకరు భవిష్యత్తులో ఇంజినీర్ అవుతున్నారు. మరొకరు వాచ్‌మన్‌గా మిగిలిపోతున్నారు. ఈ తేడాకు ప్రధాన కారణం బాల్యంలో మెదడుకు సరైన శిక్షణ లేకపోవడమే. ఆ తేడాను పూడ్చడమే మా లక్ష్యం. ఇప్పటికే కుప్పం నియోజకవర్గంలో 23 వేలమంది తల్లులు, నారావారిపల్లెలో 271 మందికి పైగా ఈ యాప్‌ను వినియోగిస్తున్నారని కేర్ అండ్ గ్రో వ్యవస్థాపకురాలు డాక్టర్ మేఘన తెలిపారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా తల్లులు 813 రకాల కృత్యాలను ఇంట్లోనే పూర్తి చేయగా, 2వ సారి నిర్వహించిన స్క్రీనింగ్‌లో 60 శాతం పిల్లల్లో గణనీయమైన అభివృద్ధి కనిపించిందని డాక్టర్ మేఘన వివరించారు. భాషా నైపుణ్యాలు 30.6 శాతం, గ్రహణ శక్తి 42.6 శాతం, శారీరక చలనం 24.7 శాతం సామాజిక భావోద్వేగాలు 42.2 శాతం ఉన్నట్లు గుర్తించారు. యాప్‌లో సూచించిన కృత్యాలను (ప్రాబ్లమ్ సాల్వింగ్, మోటార్ స్కిల్స్) తల్లులు ఇంట్లోనే దగ్గర ఉండి పిల్లల చేయించాలి. పిల్లలు ఆ పనులు చేస్తున్నప్పుడు వీడియో తీయాలి. దాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. నిపుణులు వాటిని పరిశీలిస్తారు. పిల్లల ప్రగతిని ట్రాక్ చేస్తారు. 6 నెలలకు ఒకసారి పిల్లలను పరీక్షిస్తారు. పిల్లల్లో వచ్చిన మార్పును గమనిస్తారు. ఉదాహరణకు ఒక పిల్లాడు సరిగ్గా మాట్లాడలేకపోతే, అతనికి 'స్పీచ్ థెరపీ లాంటి చిన్న చిన్న వ్యాయామాలు చేయిస్తారు. ఆ వీడియోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అందుకే ఈ విధానంలో తల్లుల పాత్ర ఎంతో కీలకమైనది. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఏఐ ఆధారిత స్క్రీనింగ్ ద్వారా 20 నిమిషాల పాటు తెలుగులోనే సులభమైన ప్రశ్నలు వేసి, వారి మెదడు వికాసాన్ని అంచనా వేస్తారు. పరీక్ష తర్వాత గ్రీన్ కలర్ వస్తే పిల్లల ఎదుగుదల బాగున్నట్లు, రెడ్ కలర్ వస్తే వెనకబడి ఉన్నట్లు గుర్తిస్తారు. అందరికీ ఒకే రకమైన పాఠాలు కాకుండా, వెనకబడిన పిల్లలకు ప్రత్యేకమైన 'కస్టమైజ్డ్ బ్రెయిన్ డెవలప్‌మెంట్ ప్లాన్స్ ఇస్తారు.

# ప్రైవేటు బస్సులపై రవాణా శాఖ కొరడా

## - 678 బస్సులపై కేసులు, రూ.36.86 లక్షల జరిమానా

**విజయవాడ.జనవరి14,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల నుంచి టికెట్ చార్జీల రూపంలో రూ.వేలాది వసూలు చేసిన ప్రైవేటు ట్రావెల్స్ పై రవాణా శాఖ కొరడా ఝుళిపించింది. పొరుగు రాష్ట్రాల నుంచి కోస్తా, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు వచ్చే ప్రయాణికుల రద్దీని గమనించి.. ప్రైవేటు బస్సుల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా చార్జీలను పెంచేశాయి. ఇవి.. సాధారణ రోజుల్లో విమాన చార్జీలకు దాదాపు సమానంగా ఉన్నాయంటూ రవాణా శాఖ అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యం లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఆర్టీఏ అధికారులతో రవాణా శాఖ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా సమావేశమై, ప్రైవేటు ట్రావెల్స్ అదనపు బాదుడుపై చర్యలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజుల పాటు తనిఖీలు చేపట్టిన ఎంవీఐలు.. అదనపు చార్జీలకు సంబంధించి 209 బస్సులపై కేసులు నమోదు చేసి, రూ.21.04 లక్షల జరిమానా విధించారు. మరోవైపు పన్ను, పర్మిట్ తదితర నిబంధనల ఉల్లంఘనపై 678 బస్సులపై కేసులు పెట్టి, రూ.36.86 లక్షల జరిమానా వసూలు చేశారు.అదనపు చార్జీలపై పశ్చిమగోదావరి జిల్లాలో అత్యధికంగా 54 కేసులు నమోదు చేసి, రూ.5.40 లక్షల ఫైన్ విధించినట్లు కమిషనర్ ఎం.కే.సిన్హా తెలిపారు. కోనసీమ జిల్లాలో 39 కేసుల్లో రూ.3.90 లక్షలు, చిత్తూరులో 30 కేసుల్లో రూ.3 లక్షలు జరిమానా వసూలు చేసినట్టు చెప్పారు. ఇతర ఉల్లంఘనలపై అత్యధికంగా నెల్లూరు జిల్లాలో 61 కేసులు పెట్టి, రూ.9.76 లక్షల ఫైన్ వేశామని, ఎన్టీఆర్ జిల్లాలో 92 కేసులు, పల్నాడులో 39 కేసులు నమోదు చేసి జరిమానా విధించినట్లు వెల్లడించారు. ప్రభుత్వం గరిష్ఠంగా అనుమతించిన మేరకు 50 శాతం అదనంగా చార్జీలు తీసుకున్న బస్సులు మినహా.. అంతకు మించి వసూలు చేసిన వాటిపై చర్యలు తీసుకున్నట్లు వివరించారు. తిరుగు ప్రయాణంలో కూడా ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పండగలైనా, సాధారణ రోజులైనా నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. ఉల్లంఘించే ట్రావెల్స్ వివరాలను ఆధారాలతో సహా 9281607001 నెంబర్‌కు తెలియ జేయాలని సిన్హా సూచించారు.

# వైద్యరంగంలో పిపిపి విధానంపై రాష్ట్రానికి కేంద్రం మరో లేఖ..

### వైద్య సేవల డిమాండ్, లభ్యతల మధ్య తేడాను పిపిపి ద్వారా పూరించండి

### అయిదు రకాల సేవల్ని విస్తరించడానికి సూచనలు

### క్యాన్సర్ నిర్ధారణ చేసే డేకేర్ సెంటర్లు ఆంధ్రప్రదేశ్‌కు 14 మంజూరు

**విజయవాడ,జనవరి14,ప్రభాతవార్త ప్రతినిధి:** వైద్య, ఆరోగ్య సేవల్ని ప్రజలకు మరింత విస్తృత స్థాయిలో అందించడానికి పిపిపి విధానాన్ని అవలంబించాలని కేంద్ర ఆరోగ్య శాఖ రాష్ట్రానికి సూచించింది. ఈ మేరకు పిపిపి మోడల్‌ను అనుసరించడంపై వివరణాత్మకమైన లేఖను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్‌కు కేంద్ర ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి విజయ్ నెహ్రా ఈనెల 12న లేఖ రాశారు. లేఖతో పాటు వివిధ సేవలను గరిష్ట స్థాయిలో పిపిపి ద్వారా అందించడానికి 27 పేజీలతో కూడిన మార్గదర్శకాలను వివరించారు. ఈ లేఖాంశాలను బుధవారం ఏపీ వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది. వైద్య విద్యను విస్తరించడానికి పిపిపి అత్యంత అనుకూల సాధనమని కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జె.పి.నడ్డా రాష్ట్రానికి ఇటీవల రాసిన లేఖను ప్రస్తావించారు. దానికి అనుబంధంగా రెండవ లేఖను రాస్తున్నట్లు కేంద్ర అధికారి నెహ్రా తెలిపారు. కేంద్రం సూచనలు: వైద్య సేవల డిమాండ్, లభ్యతల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పూరించడానికి 5 అంశాలకు సంబంధించి పిపిపి విధానాన్ని అమలు చేయడంపై కేంద్ర ఆరోగ్య శాఖ పలు అంశాలకు సంబంధించి సూచనలు చేసింది. న్యూక్లియర్ మెడిసిన్, సంచార వైద్య శాలలు, దంత వైద్య శాలలు, రేడియాలజీ సేవలు మరియు క్యాన్సర్ డే కేర్ సెంటర్లను విస్తరించడానికి పిపిపి విధానాన్ని అవలంబించాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సూచించింది. ఎక్విప్, ఆపరేట్, మెయింటైన్ , ఆపరేట్ అండ్ మెయింటైన్ మార్గాల ద్వారా పిపిపి విధానంలో సేవల లభ్యతను పెంచాలని కేంద్రం సూచించింది. 5 నుండి 10 సంవత్సరాల వరకు ప్రైవేట్ భాగస్వామి ఆయా సేవలందించడానికి అనుసరించాల్సిన చెల్లింపు విధానంపై కూడా కేంద్రం మార్గదర్శకాలను సూచించింది. క్యాన్సర్, కార్డియో వాస్కులర్ , నరాల వ్యాధులకు ఉత్తమమైన సేవల్ని న్యూక్లియర్ మెడిసిన్ ద్వారా రోగులకు అందించవచ్చని, ఈ సేవల లభ్యత ప్రస్తుత అవసరాల మేరకు, ముఖ్యంగా మధ్య, చిన్న స్థాయి నగరాల్లో బాగా తక్కువగా ఉన్నాయని, పిపిపి విధానంలో ఈ సేవల్ని విస్తరించడానికి తగు చర్యల్ని చేపట్టాలని కేంద్రం సూచించింది. క్యాన్సర్ వ్యాధి అతి శీఘ్రంగా విస్తరిస్తున్నందున సత్వరమే ఈ దిశగా చర్యల్ని చేపట్టాలని కేంద్ర ఆరోగ్య శాఖ రాష్ట్రానికి సూచించింది. పెట్‌సి.టి, స్పెక్ట్ ఇమేజింగ్, రేడియో థెరపీ సేవల్ని గ్రామాణ మరియు సెమీఅర్బన్ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాల్సిన అవసరముందని కేంద్రం స్పష్టం చేసింది. 60 శాతం నుండి 90 శాతం వరకు వివిధ వయస్కులు దంత సమస్యలతో బాధపడుతున్నా అవసరాల మేరకు వైద్య సేవలు లభించడంలేదని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో (సీహెచ్‌సీ) దంత వైద్య పరికరాలు, వైద్యుల లభ్యత తగు స్థాయిలో లేవని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) పిపిపి ద్వారా దంత వైద్య సేవల్ని పటిష్టం చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ కోరింది. వ్యాధి నిర్ధారణలో ఎంతగానో ఉపకరించే ఎక్స్‌రే, సి.టి, ఎంఆర్ఐ యంత్రాల లభ్యతను విస్తృతం చేయాలని, అందుకు పిపిపి విధానం ఉపయోగపడుతుందని కేంద్రం తెలిపింది. క్యాన్సర్ మహమ్మారిపై యుద్ధంలో భాగంగా ముందస్తు స్క్రీనింగ్ , వ్యాధి నిర్ధారణ కోసం క్యాన్సర్ డేకేర్ సెంటర్ల ఏర్పాటుకు కూడా పిపిపి అనువైన విధానమని కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. 2027 - 28 లోగా దేశ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నదే కేంద్రం లక్ష్యమని, ఈ దిశగా 2025- 26 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ కు 14 సెంటర్ల మంజూరు చేశామని కేంద్ర ఆరోగ్య శాఖ లేఖలో పేర్కొంది. ఈ లేఖ వివరాలను కార్యదర్శి శ్రీ సౌరభ్ గౌర్ వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకొచ్చారు.

# ఎమ్మెల్యే దగ్గుపాటి దందాలపై అధిష్ఠానం సీరియస్

## - ప్రధాన అనుచరుడు గంగారామ్‌పై పలు కేసులు నమోదు - గన్‌మెన్ షేక్షావలి సస్పెన్షన్

**అనంతపురం, జనవరి 14 ప్రభాతవార్త బ్యూరో** అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలో వరుసగా వెలుగు చూస్తున్న అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దందాలపై పార్టీ అధిష్టానం సీరియస్ అయినట్లు తెలుస్తోంది. దీంతో పార్టీ అధిష్టానం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సన్నిహితుడు గంగారాంపై మూడు కేసులు ప్రధాననింధితుడిగా చేర్చి దిద్దుబాటు చర్యలను చేపట్టింది. అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలో ఇటీవల లింగాయత్ కార్పోరేషన్ చైర్మన్ స్వప్న కుటుంబీకులకు చెందిన స్థలాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కంచె ఏర్పాటు చేశారు. దీనిపై ఆమె ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. స్థలాన్ని కంచెవేసిన వారితో ఆమె మాట్లాడినా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అతనిసన్నిహితుడు గంగారామ్ పేర్లను చెప్పారని ఆమె మీడియాతో పేర్కొన్నారు. అదే విధంగా మూడు రోజుల క్రితం నగర సమీపంలో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్న ఫకృద్దీన్ వద్దకు ఎమ్మెల్యే అనుచరులతోపాటు ఎమ్మెల్యే గన్‌మెన్ షేక్షావలి వెళ్లి గొడవ చేశారు. ఈ సందర్భంలో అక్కడకు వెళ్లిన వారు ఎమ్మెల్యే అనుచరుడు గంగారామ్‌తో ఫోన్‌లో మాట్లాడించగా అతను దుర్భాషలాడటమే కాకుండా 20 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారని, ఎగ్జిబిషన్ నిర్వహాకుడు ఫకృద్దీన్ ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశాడు. దీనిపై స్పందించిన ఎస్పీ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గన్‌మెన్ షేక్షావలిని సస్పెన్షన్ చేయడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అదే విధంగా నగరంలోని డి మార్ట్ ఎదురుగా మద్యం షాపును నిర్వహిస్తున్న నంబూరి వెంకటరమణ షాపుపై గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ చల్లి మద్యం దుకాణాన్ని కాల్చి వేసే ప్రయత్నం చేశారు. సిసి కెమెరాల రికార్డులను పరిశీలించి షాపు దహనానికి ప్రయత్నించిన ఎమ్మెల్యే అనుచరుడు మోహన్‌గా గుర్తించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన బాధితుడు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తనకు రూ.20 లక్షలు ఇవ్వాలని లేదంటే మద్యం షాపులో భాగం ఇవ్వాలని బెదిరించారని మీడియా వద్ద వాపోయారు. ఈ మూడు ఘటనల్లో బాధితులంతా టిడిపికి చెందిన కావడంతో బాధితులంతా పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు మీడియాలో కూడా వైరల్‌గా మారడంతో సిఎంఓ కార్యాలయం తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. దీంతో మూడు ఘటనల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సన్నిహితుడు గంగారామ్ ప్రమేయం ఉండటంతో సీఎంఓ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాలతోపాటు బాధితుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే సన్నిహితుడు గంగారామ్‌పై నగరంలోని పోలీస్‌స్టేషన్‌లో పలు సెక్షన్లు నమోదు చేసి కేసులను నమోదు చేశారు.

ఏది ఏమైనా గతంలో ఎన్నడు లేని రీతిలో నగరంలో భూ కబ్జాలు, దందాలు పెరిగిపోయాయయని,

కూటమి పాలనలో పెరిగిపోయాయయని విమర్శలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అత్యంత సన్నిహితుడు గంగారామ్‌పై కేసులు నమోదు కావడం చర్చనీయాంశంగా మారింది. ఆయా అంశాలలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రమేయం ఉందా లేదా అన్నది పోలీసుల దర్యాప్తులో తేలనుంది.

## ప్రముఖ కవయిత్రి శ్రీమతి ఇందిరా ధన్‌రాజ్ గిర్ ఆత్మకు శాంతి చేకూరాలి

### - డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,జనవరి14,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రఖ్యాత కవి గుంటూరు శేషేంద్ర శర్మ సతీమణి, ప్రముఖ కవయిత్రి ఇందిరా ధనరాజ్ గిర్ మృతిపట్ల ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తీవ్ర సంతాపం "ఎక్స్" వేదికగా వ్యక్తం చేసారు. దిగ్గజ సాహితీవేత్త తుదిశ్వాస విడిచారని తెలిసి చింతిస్తున్నాను. హిందీ, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో పాండిత్యం సంపాదించిన ఇందిరా చేసిన సాహితీ సేవ విలువైనదన్నారు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హిందీ అకాడెమీకి మొదటి అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వర్తించారు. మన దేశం నుంచి నోబెల్ కు నామినేట్ అయిన తొలి కవయిత్రిగా గుర్తింపు పొందారు. శ్రీ గుంటూరు శేషేంద్ర శర్మ గారి సతీమణిగా ఆయన సాహితీ యాత్రలో ఇందిరాపాత్ర చిరస్మరణీయమైనది. శేషేంద్ర రాసిన వేలాది ఉత్తరాలతో ప్ర త్యేక గ్యాలరీ నిర్వహించారు. ఇందిరా ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.

## ఎపి సెట్ రాత పరీక్షల తేదీలు విడుదల

**విజయవాడ.జనవరి 14.ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ సెట్ రాత పరీక్షల తేదీలు విడుదలయ్యాయి. షెడ్యూల్ ప్రకారం ఈ పరీక్షలు మార్చి 28, 29 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో ఆంధ్రా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు సెట్ పరీక్షల షెడ్యూల్‌ను ఆంధ్ర యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ ప్రకటించారు.

సెట్ పరీక్షకు అర్హులైన అభ్యర్థులు ఫిబ్రవరి 9, 2026వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ ఫీజు కింద జనరల్ అభ్యర్థులు రూ.1600, బీసీ, ఈడబ్ల్యూఎస్ రూ.1300, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ ఇతరులు రూ.900 చెల్లించవల్సి ఉంటుంది. హాల్ టికెట్లను మార్చి 19 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇతర వివరాలు అధికారిక వెబ్‌సైట్ నుంచి పూర్తి సమాచారం పొందవచ్చు. నేటితో ముగుస్తున్న సీయూఈటీ పీజీ 2026 దరఖాస్తు గడువు దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ యూనివర్సిటీల్లో వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే 'సీయూఈటీ పీజీ - 2026 ఆన్‌లైన్ దరఖాస్తు గడువు బుధవారం (జనవరి 14)తో ముగియనుంది. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ లింక్ ద్వారా జనవరి 14వ తేదీ ముగింపు సమయంలోపు దరఖాస్తు చేసుకోవాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (విగితి) ఓ ప్రకటనలో తెలిపింది. మొత్తం 157 సబ్జెక్టుల్లో ఈ పరీక్షను రెండు పేపర్లకు నిర్వహిస్తారు. ఒక్కో పేపర్‌కు 90 నిమిషాల వ్యవధి ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు, కాలేజీల్లో లెక్చరర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకాలకు నిర్వహించే రాష్ట్రస్థాయి అర్హత పరీక్ష ఏపీ సెట్ 2025 నోటిఫికేషన్ తాజాగా విడుదలైంది. ఈ పరీక్షలకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతుంది.

## భోగిమంటల్లో లేబర్ కోడ్ పత్రాలు

**విజయవాడ, జనవరి 14: ప్రభాతవార్త, ప్రతినిధి:** కార్మికులకు నష్టం చేకూర్చేలా కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌ను తక్షణం రద్దు చేయాలంటూ సిపిఎం రాష్ట్ర కమిటీ.ఆ పార్టీ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, రైతు సంఘాలు పిలుపు మేరకు నేడు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్నారు. కార్మికులకు నష్టం చేకూర్చే కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ ప్రతులను భోగి మంటల్లో దగ్ధం చేస్తూ నిరసనలు వ్యక్తం చేసారు.
పీపీపీ పద్ధతిపై మెడికల్ కళాశాలల ఏర్పాటు ఉత్తర్వులు దగ్ధం చేసిన వైసీపీ శ్రేణులు పీపీపీ పద్ధతిన మెడికల్ కళాశాలల ఏర్పాటు ఉత్తర్వులను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా,నియోజకవర్గ కేంద్రాలో వైసీపీ శ్రేణులు దగ్ధం చేసాయి.మాజీ మంత్రులు అంబటి రాంబాబు. ఆర్కే రోజా, పేర్ని నాని,కాకాణి గోవర్ధన్‌తో సహ పలువురు తమ.తమ జిల్లాలు,నియోజకవర్గ కేంద్రాల్లో భోగిమంటల్లో పీపీపీ పద్ధతిలో వైద్యకళాశాలల నిర్మాణ ఉత్తర్వులు దగ్ధం చేసారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు వైద్యవ్యవస్థను పేదలకు కూటమి ప్రభుత్వం దూరం చేస్తుందని ఆరోపించారు.
పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం పెదఅమిరంలో ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు నివాసం వద్ద భోగి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాజకీయ ప్రముఖులు, జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప సభాపతి భోగి మంటలు వెలిగించారు. ఏలూరు సమీపంలోని దుగ్గిరాలలో నిర్వహించిన సంక్రాంతి వేడుకలలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఎమ్మెల్యే. ఆపై భోగి మంటలు వెలిగించి సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. విశాఖపట్నంలోని ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో మహా సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భోగి మంటలు వేశారు. ఈ వేడుకల్లో పెద్దఎత్తున స్థానికులు పాల్గొన్నారు. ఈనెల 9 నుంచి 16 వరకు కాలేజీ గ్రౌండ్స్‌లో మహా సంక్రాంతి సంబరాలు జరుగనున్నాయి. ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా సెట్టింగ్స్, సాంప్రదాయ బద్ధమైన నృత్యాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

# తిరుమల సమాచారం

## తిరుమల 'భోగి' వేడుకల్లో భక్తులు



**తిరుమల,జనవరి 14ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో బుధవారం వేకువజామున మూడుగంటలకు భోగి పండుగను ఆలయ అధికారులు, భక్తులు కలసి జరుపుకున్నారు. పెద్దసంఖ్యలో ఆలయం ముందు కలపచెక్కలను వేసి మంటపెట్టి "భోగి,భోగి గోవిందా గోవింద" నామస్మరణలతో భక్తులు చేసిన నినాదాలు తిరుమలకొండను మార్మోగించాయి. భక్తులు భక్తిశ్రద్ధలతో భోగి సంబరాలు ఆలయ అధికారులతో కలసి చేసుకోవడం ఆనందం వ్యక్తం చేశారు. భోగి మంటలు అనంతరం శ్రీవారి ఆలయ తలుపులు తెరచి స్వామివారికి ధనుర్మాస ప్రత్యేక కైంకర్యాలు జరిపించారు. సాంప్రదాయమైన భోగిపండుగను టిటిడి ఆలయ అధికారులు డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి, ఉద్యోగులు పాల్గొన్నారు.ప్రతి ఒక్కరికీ శ్రీవారి ఆశీస్సులు కలగాలని ఆకాంక్షించారు.

## ఎస్వీవిద్యాదానట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం



**తిరుమల,జనవరి 14ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ట్రస్ట్‌లలో ఎస్వీవిద్యాదానట్రస్ట్‌కు దాత 10లక్షలు రూపాయలు డిడిని విరాళంగా అందించారు. బుధవారం ఉదయం చెన్నైకు చెందిన ధర లాజిస్టిక్స్ సంస్థ ప్రతినిధులు తిరుమలలో టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ విరాళాల డిడిని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి అందజేశారు.

## తిరుమలేశునికి సుప్రభాతసేవ పునఃప్రారంభం

**తిరుమల,జనవరి 14ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వేకువజామున సుప్రభాతసేవ పున:ప్రారంభమైంది. ధనుర్మాసఘడియలు పూర్తికావడంతో గురువారం వేకువజామున నుండి తిరిగి శ్రీవారి ఆలయంలో ఆఅయ అర్చకులు, వేదపండితులు "కౌసల్యా సుప్రజారామా పూర్వాసంధ్యాప్రవర్తితే"అనే నామంవినిపించి స్వామివారిని మేల్కొలిపారు. ఏడుకొండలస్వామికి వైఖానస ఆగమోక్తంగా ప్రతిరోజూ తెల్లవారుజామున 2.30గంటలకు నిద్రనుండి సుప్రభాతసేవతోనే మేల్కొలుపుతారు. 15వతేదీ కనుమ పర్వదినం ఆరంభాన ఏడుకొండలస్వామికి "కౌసల్యా సుప్రజారామా పూర్వాసంధ్యాప్రవర్తితే"అనే కీర్తన వినిపించారు. ప్రతి ఏడాది డిసెంబర్ 16వతేదీ నుండి ధనుర్మాసం ఆరంభంతో వెంకన్న ఆలయంలో సుప్రభాతసేవ రద్దయి ఆ స్థానంలో గోదాదేవి తిరుప్పావై పాశురాలు పారాయణం జరుగుతుంది. జనవరి 14వ తేదీతో ధనుర్మాసం ముగిస్తే యధాప్రకారం ఏడాదంతా సుప్రభాతసేవతోనే స్వామివారిని మేల్కొలుపుతారు. ఈ సేవను గృహస్థభక్తులను అనుమతినిస్తారు. శుక్రవారం నుండి గృహస్థభక్తుల నడుమ ఆర్జితసేవ పునరుద్దరిస్తారు.ప్రతిరోజూ తిరుమలలో సుప్రభాతసేవలో 200మందివరకు భక్తులు పాల్గొంటారు.

## రేపు పార్వేట ఉత్సవం

## అడవిలో వేటాడనున్న వెంకన్న

**తిరుమల,జనవరి 14ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతి పండుగ మరుసటిరోజు కనుమపండుగనాడు సాంప్రదాయాలను పాటిస్తూ దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామి అడవిలో వేటాడటం ఆనవాయితీ. శుక్రవారం మధ్యాహ్నం నిత్యకైంకర్యాలు ముగించుకున్న తరువాత శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామివారు. శ్రీకృష్ణస్వామి వేర్వేరు పల్లకీలపై ఛత్రచామర మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా పార్వేటమండపం వెళ్లనున్నారు. అక్కడ ఆలయ అర్చకులు, అధికారులు స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి,ఆస్థానం నిర్వహిస్తారు.వైకుంఠం నుండి భూలోకానికి వచ్చిన శ్రీనివాసుడుకనుమపండుగ రోజు వేటాడటం పరిపాటి. ఈ సాంప్రదాయాన్ని టిటిడి అధికారులు పార్వేటమండపం వద్ద అటవీప్రాంతంలో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన అడవిజంతువుల ప్రతిమలను ఈటెలతో వేటాడినట్లు అర్చకులు మూడుసార్లు ముందుకు వెళ్లి వెనక్కువచ్చి బాణాలు వేయడం జరుగుతుంది. అనంతరం అక్కడ నుండి సాయంత్రం ఉత్సవమూర్తులు ఆలయంలోనికి చేరుకుంటారు.

## భోగిపండుగన శ్రీవారి దర్శనం సకల శుభకరం



**తిరుమల,జనవరి 14ప్రభాతవార్తప్రతినిధి:** దైవనామస్మరణ,భక్తిభావంతోనే భక్తులకు మంచి జరుగుతుందని .భోగిపండుగ రోజు ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం సకలం శుభాలు కలుగుతాయని పలువురు ప్రముఖులు విశ్వాసం వెలిబుచ్చారు. బుధవారం ఉదయం సినీనటుడు ప్రభుదేవ, తెలంగాణ ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి, ఎపిసిఎం కార్యదర్శి చంద్రమౌళి, చెస్‌క్రీడాకారిణి హారిక, సినీదర్శకుడు బాబి వేర్వేరుగా మహద్వారం నుండి ఆలయంలోనికి చేరుకున్నారు. అనంతరం మూలవిరాట్టును దర్శించుకున్నారు. వేదాశీర్వచనం అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## రాష్ట్రంలో మరో భారీ పరిశ్రమ

## కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి ఫ్యాక్టరీ

**విజయవాడ.జనవరి14,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మరో భారీ పరిశ్రమ రాబోతోంది. గ్రీన్‌కో గ్రూప్‌నకు చెందిన ఏఎం గ్రీన్ అమ్మోనియా సంస్థ దీనిని కాకినాడలో ఏర్పాటు చేస్తోంది.హరిత ఇంధన ఉత్పత్తికి ఏర్పాట్లు చేస్తోంది. వాకలపూడి సమీపంలో మూతపడి ఉన్న నాగార్జున ఫెర్టిలైజర్స్ కంపెనీ (ఎన్ఎఫ్‌సీఎల్) ప్లాంట్ భూములను 2024లో కొనుగోలు చేసింది. ఈ ప్రాంతంలో గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేయనుంది. జర్మనీకి చెందిన యూనిపర్ గ్లోబల్ కమోడిటీస్ సంస్థతో ఒప్పందం చేసుకుంది. ఈ నెల 17న సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా దీనికి శంకుస్థాపన జరిగే అవకాశముందని అధికార వర్గాలు తెలిపాయి.ఏఎం గ్రీన్ దాదాపు రూ.10,760 కోట్ల పెట్టుబడితో కాకినాడలో హరిత అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. గ్రీన్ అమ్మోనియాను ఎరువుల తయారీతో పాటు షిప్పింగ్ ఇంధనంగా కూడా వినియోగిస్తారు. తొలిదశలో ఏడాదికి టన్ను ఉత్పత్తి సామర్థంతో ఈ ప్లాంట్‌ను ప్రారంభిస్తారు. 2030 నాటికి ఏడాదికి సుమారు 5 టన్నులకు విస్తరించనున్నారు. ఏడాదికి టన్ను గ్రీన్ హైడ్రోజన్‌ను కూడా ఉత్పత్తి చేయనున్నారు. ఈ ఏడాది నుంచే ఉత్పత్తి ప్రారంభించాల్సి ఉండగా మార్కెట్ అన్వేషణకు జాప్యం జరిగింది. జర్మనీ కంపెనీతో తాజాగా ఒప్పందం చేసుకుంది. సంస్థ ద్వారా సుమారు 1,100 మందికి వరకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. సాధారణంగా అమ్మోనియాను సహజ వాయువు ఉపయోగించి తయారు చేస్తారు. దీనివల్ల వాతావరణంలోకి కార్బన్ డయాక్సైడ్ విడుదలవుతుంది.ఎటువంటి పర్యావరణ హాని ఉండదు. 100 పునరుత్పాదక ఇంధన వనరుల (సౌర, పవన విద్యుత్) ద్వారా తయారు చేసే అమ్మోనియాను ఖీగ్రీన్ అమ్మోనియాఖీ అంటారు. గ్రీన్ అమ్మోనియా తయారీలో ప్రధానంగా రెండు దశలు ఉంటాయి. విద్యుద్విశ్లేషణ పునరుత్పాదక విద్యుత్‌ను ఉపయోగించి నీటి నుంచి ఖీగ్రీన్ హైడ్రోజన్‌ను వేరు చేస్తారు. హేబర్‌బాష్ ప్రక్రియలో గాలి నుంచి సేకరించిన నత్రజనిని , పైన తయారైన గ్రీన్ హైడ్రోజన్‌తో కలిపి అధిక పీడనం వద్ద అమ్మోనియాగా మారుస్తారు.

పర్యావరణ హితంగా దీని తయారీలో కార్బన్ ఉద్గారాలు విడుదల కావు.ఇంధన ప్రత్యామ్నాయం: పెట్రోల్, డీజిల్‌లకు బదులుగా రైళ్లు, ఓడలు, విమానాల్లో దీనిని ఇంధనంగా వాడవచ్చు.వ్యవసాయ రంగంలో పర్యావరణ హితమైన ఎరువుల తయారీకి ఇది కీలకం హైడ్రోజన్ రవాణా: హైడ్రోజన్‌ను నేరుగా రవాణా చేయడం కష్టం, కాబట్టి దానిని అమ్మోనియా రూపంలో సులభంగా నిల్వ చేసి దూర ప్రాంతాలకు పంపవచ్చు. ఎగుమతి ఒప్పందాలు: జనవరి 2026లో, హైదరాబాద్‌కు చెందిన ఏఎం గ్రీన్ అమ్మోనియా సంస్థ జర్మనీకి చెందిన యూనిపర్ కంపెనీతో ఏటా 5 లక్షల టన్నుల గ్రీన్ అమ్మోనియాను ఎగుమతి చేసేందుకు భారీ ఒప్పందం కుదుర్చుకుంది.శ్రీకాకుళం మూలపేట: మూలపేట పోర్టు సమీపంలో కూడా సుమారు రూ. 10,000 కోట్ల పెట్టుబడితో గ్రీన్ అమ్మోనియా ప్లాంటు ఏర్పాటుకు ఒప్పందాలు జరిగాయి.

## సంక్రాంతి లక్ష్మి



భగ భగల భోగి మంటల్లో
చెడునంతటికీ వేద్దాం పాతర
భోగ భాగ్యాలతో వేద్దాం జాతర
దివ్య భవ్యలతో కోళ్ళిల్లు భోగి !
ముంగిళ్ళంతా రంగవల్లులు
గోమయపు గొబ్బెమ్మలతో
శోభాయమానమై కొలువుదీరే
నవ్య కాంతులతో వెలుగులారే
శ్రీమహాలక్ష్మి సిరుల సంక్రాంతి !
శ్రీశైల శిఖరమెత్తు ధాన్యపు
రాశులను జూసి
పల్లె నిండా ఆనందాల పొరలే
ఆరుగాలం శ్రమ ఫలమే రైతు
లోగిళ్ళకు సిరుల పంట తరలే !
పశు పక్ష్యాదులను పూజించి
పల పుష్పాలతో హారతులద్ది
పొలి చెలకల్లో పొంగల్లు జల్లి
సిరులిచ్చు భూతల్లికి ప్రణమిల్లి
కాచు మమ్మేలు కనుమ గౌరి !

- బోనగిరి పాండురంగ

# సంస్కృతి-సంబరాల సంక్రాంతి




నక్షత్రతో సంతోషాన్ని సహకార వితరణ చేయడమే సంక్రాంతి సం బరం.శాంతి, సౌభాగ్యం, ఐకమత్యం కలగలిసినదే పండుగ. అందరూ పండుగగా వ్యవహరించే ఉత్సవాలు వ్యక్తిగతంగాను, కుటుంబపరంగాను, బంధుగతం గాను జరుపుకుంటూ ఉంటాము. అంతవరకు పున్న కష్టాలు మరచి అందరితో కలసి మెలసి ఆనందం పంచుకునే దినమే పండుగ. ఈ పండుగ క్రమంలో వచ్చే ముఖ్యమైన పండుగలలో సంక్రాంతి ఒకటి. 'సమ్యక్ క్రాంతి' సంక్రాంతి సమ్యక్ అంటే బాగుగా లేదా మ్కెలెన , ఉత్తమమైన అని అర్థం చెప్ప వచ్చును. క్రాంతి అనగా పుట్టుక, జనించుట లేదా వెలిగించుట అనే అర్థాలు చెప్ప వచ్చును. వెరసి సమ్యక్ క్రాంతి అనే పదానికి బాగుగా ఆనందం జనించునది అని అన్వయించు కోవచ్చును. సూర్యుడు తన ప్రయాణంలో ఒక రాశినుండి మరొక రాశిలోకి ప్రవేశించడాన్ని సంక్రమణం లేదా సంక్రాంతి అంటారు.

**భోగిపండుగ :** భోగి పండుగ పేరు చెప్పగానే మనకు స్ఫురించేవి భోగిపళ్ళు, భోగిమంటలు. ఆవుపేడతో పిడకలు తయారుచేసి యజ్ఞదేవతను తలచుకుంటూ, పాపప్రక్షాణన జరిపించమని వేడుకుంటూ, ధర్మమార్గ పయనానికి సమాయత్తమవుతూ మంటలో సూర్యోదయం సమయంలో వీటిని వేస్తారు. పిల్లలు, పెద్దలు అందరూ ఈ మంట చుట్టూ చేరి ఆనందోత్సాహలలో మునిగిపోతారు. ఈ మంటలలోనే పాతపడిన సామానులను కూడా వేసే సాంప్రదాయం కూడా కనబడుతుంది. నూతనత్వానికి ఆహ్వానం పలకాలంటే పాతదనాన్ని విడనాడాలి. ఈ మంటలు వేదకాలమునాటి ఋషులు తాము సంవత్సరా రంభములో వ్రేల్చిన 'ఆగ్రాహాయణి' హోమాగ్నికి ప్రతిరూపం. హోమ భస్మం మంత్ర సారము, అతి పవిత్రమైనది. మంటలు శాంతించిన తరువాత ఈ హోమ భస్మాన్ని దైవప్రసాదంగా భావించి నుదుటిన ధరిస్తారు. పిల్లలకుకూడా నుదుటి మీద ఉంచి వారి ఆయురారోగ్యాలకై ప్రార్థిస్తారు.

**సంక్రాంతి పండుగ...** రెండవ రోజున సంక్రాంతి పండుగ. పండుగలో ప్రతీ రోజుకు ఒక ప్రత్యేకత ఉంటుంది, వ్యవ హార నియమ నిబంధనలుంటాయి. స్నానాదికాలు ఎలా ఆచరించాలి, ఎటు వంటి పూజలు ఆచరించాలి, ఎటువంటి దానధర్మాలు చేయాలి అనేవి మన శాస్త్రాలు విపులంగా వివరించాయి. ఇవి శారీరక ధారుఢ్యాన్ని పెంపొందించి, వాతావరణ సమతుల్యత కాపాడుతూ, సమతను పెంపొందిస్తాయి. నువ్వుల నూనెతో అభ్యంగన స్నానం శారీరక రుగ్మతలను నివారిస్తుంది. నువ్వులు సేవించటం వలన ఆరోగ్య సమస్యలు తగ్గుతాయి. ఈరోజు జరిపే



శాంతి హోమాలు, మృత్యుంజయ హోమాలు, అభిషేకాలు, వివిధ దేవారాధలు ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించి, భగవదానుగ్రహానికి తోడ్పతాయి. పితృదేవత స్మరణ వారి అఖండ ఆశీర్వచనానికి దోహదం చేస్తాయి. మన పెద్దలు మనకిచ్చిన జన్మకు కృతజ్ఞత ప్రకటించటం ప్రతీ ఒక్కరి కర్తవ్యం. వారిని స్మరిస్తూ తగిన విధంగా తర్పణాలు విడవటం, వారి జ్ఞాపకార్థం దాన ధర్మాలు చేయటం శాస్త్ర విధి. పరమేశ్వరుడు అభిషేక ప్రియుడు. సుగంధ ద్రవ్యాలతో, పంచామృతములతో చేసే అభిషేకాలకు చక్కటి ఫలితాలుం టాయి. గొబ్బిళ్ళ సందడి సంక్రాంతి పండుగల వేడుకలో మరొక ప్రధానమైనది. కన్నె పిల్లలు చక్కటి వస్త్ర ధారణతో, తమకు కలిగిన ఆభరణాలతో మాదవక్కగా అలంకరించు కుంటారు. తెలుగుదనం ఉట్టి పడే కన్నె పిల్లలను చూచి కుటుంబ సభ్యులు మురిసి పోతారు. వివాహ వయస్సుకు వచ్చినారని చెప్పకనే చెబుతారు. పెద్దవారికి ఇది ఒక హెచ్చరిక లాటిది. ఆవుపేడతో గుండ్రముగా బంతులవలె తయారు చేసి, ఇంటి ముంగిటి రంగవల్లుల మధ్య అమరుస్తారు.



వాటిపై బంతి పూవులు, ఇతర రంగురంగుల పూలను అలంకరించి, వాటి చుట్టూ తన తోటి వారితో, స్నేహితులతో వలయాకారంగా తిరు గుతూ, గొబ్బి పాటలు పాడుతూ,లయబద్ధంగా చప్పట్లు చరుస్తూ తిరుగుతారు. ఇది సంధ్యాసమయంలో జరిగే కనుల పంట. చూచినవారిదే భాగ్యం. మహాలక్ష్మికి ప్రీతి పాత్రమైనది. ఈ విధంగా చేయటం వలన కన్నెపిల్లలకు త్వరలోనే చక్కటి వరుడు లభించి వివాహం జరుగుతుందని విశ్వాసం. విజ్ఞాన శాస్త్ర పరంగా కూడా ఇది ఎంతో మంచిది. అనేక రకాల క్రిమి సంహారకంగా ఉపయోగపడు తుంది. ప్రతీ ఇంటి ముంగిట దర్శనమిచ్చే గొబ్బిళ్ళు స్వాగతం పలుకుతూ, అసలు సిస్కలెన పండుగ వాతావరణాన్ని తలపిస్తుంది.

**కనుమ...**మూడవ రోజు పండుగ కనుమ పండుగ. కనుమ నాడు మినుము తినాలంటారు. అందుకే ఆవునేతితో తయారు చేసిన మినపసున్నెలు,బెల్లం గారెలు వంటిని తయారు చేసుకుంటారు. నోరూరించే పదార్థాలు జిహ్వాను మరింత పెంచగా మానసిక సంతృప్తితో కడుపారా ఆస్వాదిస్తారు. వ్యవసాయదారులు తమ తమ పశువులను అలంకరించి వాటిని స్వేచ్ఛగా తిరిగేలా చేస్తారు. బలవర్ధకమైన దాణావేసి విశ్రాంతిగా ఉండేలా చేస్తారు. వ్యవసాయ క్షేత్రములో వాటి అవసరం లేకుండా పంటలు పండవు. నాగరిక ప్రపంచములో యంత్ర వినియోగం ఎక్కువైనప్పటికి, పశువుల వినియోగం లేకుండా సాగదు. మనకు జీవనాన్ని, జీవితాన్ని ఇచ్చిన ప్రతీ ప్రాణిని గౌరవించాలనే సత్సాంప్రదాయము మనది. కనుమ నాడు కాకి కూడా కదలదు అనే నానుడి ప్రచారంలో ఉంది. శాస్త్రపద్ధతిలో ఆలోచిస్తే దీనికి తగిన కారణం కనబడుతుంది. దైనందిన కార్యక్రమాలకు దూరంగా ఉంటూ, కుటుంబ సభ్యులతో కలసి మెలసి ఆనందంగా జీవించటానికి అవకాశం కల్పించేవే కొన్ని కట్టుబాట్లు, ఆచారవ్యవహారాలు. బయటకు వెళ్ళకోడదు అనే నియమం పెడితే చక్కగా ఇంటి వద్దే వుండి సంతోషంగా గడుపుతారని దీని ముఖ్యోద్దేశము. ఇంటిని అలంకరించిన మామిడి తోరణాలు, నూతన వస్త్ర ధారణలు, వాకిట భోగి మంటల వింత శోభలు, నట్టింట్లో నిండు గర్భిణిలా ధాన్యపు గాదెలు, వాకిట్లో హరిదాసులు ఆలపించే హరిభజనలు, తోటల్లో కోడిపందేలు, పెరట్లో పశువు అలంకారాలు, అత్తింట్లో అల్లుడుగారు ఎక్కే అలకపాన్పు, వంటింట్లో అత్తగారు చేసే నేతి అరిసె ఘుమఘుమలు, అంగట్లో వస్త్ర సంబరాలు, ఆలయాలలో దైవ పూజలు, ముంగిట్లో వయ్యారి భామలు దిద్దే ముత్యాల రంగవల్లులు, రంగవల్లులపై శోభిల్లే గొబ్బిళ్ళు, దాన ధర్మాల తృప్తిపొందిన దానగ్రహీతలు....కలగలసి మన సంక్రాంతి.

- డా. దేవుపల్లి పద్మజ

## వ్యథ


**ప్రశ్న:** నా జాతకం బాగా లేదు. నా జీవితం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు ఉంది. 30 ఏళ్ళు వస్తున్నా జీవితంలో జీవితంలో నిలదొక్కుకోలేక పోతున్నాను.నాతో పాటు చదువుకున్న వారు అంతా చాలా మంచి ఉద్యోగాలలో

# పోలిక వద్దు, ప్రేరణ ముద్దు !

స్థిరపడ్డారు. మంచి జీవితాన్ని అనుభవిస్తున్నారు. పదో తరగతి పరీక్షల్లో నా జవాబులు కాపీ కొట్టిన నా స్నేహితురాలు ఒకామె సివిల్స్ పాలయ్యింది. నేను బి టెక్ చదివాను. రెండు కంపెనీలలో ఉద్యోగం వచ్చినా తగిన జీతం రానందున మానేశాను. తరువాత ఎన్ని ప్రయత్నాలు చేసినా మంచి ఉద్యోగం దొరకడం లేదు. మా అమ్మ నా కోసం ఉపవాసాలు, పూజలు చేసినా దేవుడు దయ చూపడం లేదు.దేవుడు నన్ను మాత్రమే ఎందుకు విస్మరిస్తున్నాడో అర్థం కావడం లేదు. ఇవన్నీ తలుచుకుంటే మనసు వికలం అవుతోంది.రాత్రుల్లో తలుచుకుంటే నిద్ర పట్టడం లేదు. పీడకలలు వస్తున్నాయి. అందరి ముందు తల వంచుకుని బ్రతకడం కంటే ఆత్మ హత్య చేసుకోవడం మేలనిపిస్తోంది. అందరిలా నేను మంచి స్థాయికి చేరుకోవడానికి మంచి మార్గం చెప్పండి.

- ఒక సోదరి హైదరాబాద్

**జవాబు:** అమ్మా, మీ బాధ నిజమే, అలా అనిపించడం మీ బలహీనత కాదు. ఫలితం రాకపోతే మనసు విరిగి పోవడం సహజం. అయితే ప్రాణం, ఉద్యోగం, జీతం, స్థాయి కంటే అమూల్యమైనది. మీ సమస్యలు శాశ్వతం కాదు. ఇది మీ జీవితానికి ఫుల్ స్టాప్ కాదు, ఒక కామా మాత్రమే అని గుర్తించండి. మొదట ఇతరులతో పోల్చు కోవడం మానేయండి. పోలిక మన ఆనందాన్ని చంపుతుంది. మన శక్తిపై నమ్మకాన్ని తగ్గిస్తుంది. అదే ఇతరుల విజయాన్ని ప్రేరణగా తీసుకుంటే మనలో నిద్రిస్తున్న సామర్థం మేల్కొంటుంది. వాళ్ల ఎక్కడ ఉన్నారో చూడటం మానేసి, వాళ్ల ఎలా అక్కడికి చేరారు అన్నది గమనించండి. పోలిక అసూయను పుడుతుంది, అసహనాన్ని పెంచుతుంది. ప్రేరణ ఆశను పెంచుతుంది, దారి చూపుతుంది.అందుకే 'పోలిక వద్దు, ప్రేరణ ముద్దు' అంటారు. దేవుడు మిమ్మల్ని విస్మరించాడని అనుకోవద్దు. కొన్నిసార్లు దేవుడు మనల్ని బలంగా తయారుచేయడానికి ఆలస్యం చేస్తాడు. మీ అమ్మ చేసిన పూజలు వృథా కావు. అవి మీకు ధైర్యంగా నిలబడే శక్తిగా మారతాయి. సమాజంలో ఏ ఇద్దరు వ్యక్తుల జీవిత మార్గం ఒకటిగా ఉండదు. తెలివి, అవకాశాలు, నేపథ్యం, సమయం అన్నీ అందరికీ ఒకేలా ఉండవు.మీ బలాలు, నైపుణ్యాలను నిజాయితీగా గుర్తించండి. దొరికిన ఉద్యోగాన్ని చిన్నదిగా చూడకండి. అనుభవం, నైపుణ్యం సంపాదించు కుంటూ ముందుకు సాగండి. అవసరమైతే కెరీర్ కౌన్సెలర్‌తో కలవండి. ఆత్మహత్య భావం, నిద్రలేమి, పీడకలలు ఉంటే వైద్య సహాయం తీసుకోవడం తప్పు కాదు.



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

## రంగవల్లి

21 చుక్కలు, మధ్య చుక్క 11 వచ్చే వరకు



-సుధారాణి
మలక్‌పేట్






24 చుక్కలు
8 వరుసలు
అటు ఇటు వదిలి
8 వరకు



- శాంతి శర్మా
సరూర్‌నగర్



29 చుక్కలు 5 వరుసలు 21 చుక్కలు 4 వరుసలు13 చుక్కలు 4 వరుసలు 5 చుక్కలు 4 వరుసలు రథం ఆకారంలో పెట్టుకోవలెను

## పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కలయిక



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ స్థాపించిన 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్', ప్రముఖ నిర్మాణ సంస్థ 'పీపుల్ మీడియా ఫ్యాక్టరీ' తో చేతులు కలిపిన విషయం విదితమే. ఈ రెండు సంస్థలు కలిసి గొప్ప చిత్రాలను ప్రేక్షకులను అందించడానికి సిద్ధమవుతున్నాయి. గతంలోనే ఈ సంస్థల మధ్య కథలకు సంబంధించిన చర్చలు జరిగాయి. తాజాగా మరోసారి పవన్ కళ్యాణ్, నిర్మాత టీజీ విశ్వప్రసాద్ కలిసి రాబోయే ప్రాజెక్టులపై చర్చించారు.పవన్ కళ్యాణ్, టీజీ విశ్వప్రసాద్ భేటీ గురించి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఖిపవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ స్పందిస్తూ.. "భోగి శుభ సందర్భంగా కొత్త ఆరంభాల స్ఫూర్తిని సూచిస్తూ, రాబోయే ప్రాజెక్టులపై గతంలో జరిగిన చర్చలను కొనసాగిస్తూ, శ్రీ పవన్ కళ్యాణ్ గారు పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ ని కలిసి మరింత విస్తృతంగా చర్చించారు." అని తెలిపింది.పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ ట్వీట్ కి నిర్మాత టీజీ విశ్వప్రసాద్ బదులిస్తూ.. "కథలపై చర్చించడానికి మాకు అవకాశం కల్పించినందుకు శ్రీ పవన్ కళ్యాణ్ గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు. ఇది మాకు ఎంతో విలువైనది. ప్రేక్షకులకు బలమైన, అర్థవంతమైన, ప్రభావవంతమైన కంటెంట్‌ను అందించేందుకు ఖిపవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ఖితో కలిసి పనిచేయడం గౌరవంగా భావిస్తున్నాము. ఈ కలయిక మాకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ అద్భుత ప్రయాణం కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నాము." అని తమ సంతోషాన్ని పంచుకున్నారు.

# తెర

## 'మన శంకర వరప్రసాద్‌గారు' సెలబ్రేషన్



మెగాస్టార్ చిరంజీవి, హిట్ మెషిన్ అనిల్ రావిపూడి మెగా బ్లాక్ బస్టర్ ఖిమన శంకర వర ప్రసాద్ గారుఖి విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో అలరించారు. థాంక్ యూ మీట్ లో డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సంక్రాంతిని కూడా నాకు ఇంత మెమొరబుల్‌గా చేసిన ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రేక్షకులందరికీ థాంక్యూ సో మచ్. మళ్లీ మళ్లీ ఇలాంటి మంచి సినిమాలు తీసి మీకు ఆనందాన్ని ఇచ్చి దాని ద్వారా కృతజ్ఞతలు తెలియజేసుకుంటానుఈ సినిమాకి నిర్మాతలుగా చేసిన సాహు నా ఫ్రెండ్. తను తన ఫెయిల్యూర్ వచ్చిన సక్సెస్ వచ్చిన ఒకేలా ఉంటాడు. ఇంత పెద్ద బడ్జెట్‌ని ఇంత స్టార్ కాస్ట్ ఇచ్చి సినిమాని ఒక అద్భుతంగా నిర్మించారు.ఈ సినిమాకి మరో ప్రొడ్యూసర్ సుస్మిత గారు. నేను ప్రతి సినిమా సక్సెస్ కి జోన్ అవుట్‌లో ఉంటా. ఇంతపెద్ద సక్సెస్ కొట్టానా అనే జోన్ అవుట్‌లో ఉంటా. సుస్మిత గారు కూడా అలాంటి జోన్ అవుట్‌లో కనిపించారు. మీడియా మిత్రులు అందరికీ ధన్యవాదాలు. ప్రతి మీడియా మీడియా సోదరుడు నాకు ఎంతగానో ప్రోత్సహించారు. వాళ్ళ పాజిటివ్ ఎనర్జీలను మర్చిపోలేను. అందరికీ పేరుపేరునా ధన్యవాదా.ప్రొడ్యూసర్ సాహు గారపాటి మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. మెగాస్టార్ తో సినిమా చేస్తున్నాం అన్నప్పుడు నేను నమ్మలేకపోయాను. ప్రొడ్యూసర్ సుస్మిత కొణిదెల మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు సినిమా ప్రేక్షకులు చిత్రానికి బ్రహ్మరథం పట్టారు. కలెక్షన్స్ టాక్ రెస్పాన్స్ అద్భుతంగా వుందిమ్యూజిక్ డైరెక్టర్ బీమ్స్ మాట్లాడుతూ.. నేను వచ్చి పాతికేళ్ళు. ఇది నాకు ఒక సిల్వర్ జూబ్లీ. ఈ సిల్వర్ జూబ్లీలో మెగాస్టార్ చిరంజీవి గారితో ఒక బ్లాక్ బస్టర్ సినిమా చేసి నిలబడడం నాకు ఎంతో ఆనందంగా ఉంది.

## 'రాజా సాబ్' ఇష్టపడి చూస్తున్నారు !



- మారుతి

టాలీవుడ్ సంక్రాంతి పండుగ సీజన్ లో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ గా ప్రేక్షకుల ఆదరణ దక్కించుకుం టోంది రెబల్ స్టార్ ప్రభాస్ "రాజా సాబ్" మూవీ. ఈ సినిమా రిలీజైన 4 రోజుల్లో 201 కోట్ల రూపాయలకు పైగా వసూళ్లను వరల్డ్ వైడ్ సొంతం చేసుకుంది. ఫ్యామిలీ ఆడియెన్స్, పిల్లలు మూవీని బాగా ఎంజాయ్ చేస్తున్నారు. వర్సటైల్ పర్ ఫార్మెన్స్ తో ప్రభాస్ చేసిన వన్ మ్యాన్ షో, హారర్ ఫాంటసీ జానర్ లో ఒక కొత్త వరల్డ్ క్రియేట్ చేసిన డైరెక్టర్ మారుతి టేకింగ్. అన్ కాంప్రమైజ్డ్ గా గ్లోబల్ సినిమా స్థాయిలో ప్రొడ్యూస్ చేసిన పీపుల్ మీడియా ఫ్యాక్టరీ మేకింగ్ ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో "రాజా సాబ్" సక్సెస్ హ్యాపీ నెస్ ను ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూ లో షేర్ చేసుకున్నారు డైరెక్టర్ మారుతి. "రాజా సాబ్" సినిమాకు అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణ దక్కుతోంది. సంక్రాంతి హాలీడేస్ బిగిన్ కాకముందే ఈ సినిమా 200 కోట్ల రూపాయల మార్క్ టచ్ చేయడం హ్యాపీగా ఉంది. మా సినిమా ప్రేక్షకులకు నచ్చడం వల్లే బాక్సాఫీస్ వద్ద ఇంత హ్యూజ్ నెంబర్స్ క్రియేట్ చేస్తోంది. ఈ సంక్రాంతి హాలీడేస్ లో మరింతగా మా మూవీకి ప్రేక్షకాదరణ దక్కుతుందని ఆశిస్తున్నాం. సైకలాజికల్ ఎలిమెంట్స్ తో కొత్త పాయింట్ చూపించాం కాబట్టి ప్రేక్షకులకు రీచ్ కావడానికి కొంత టైమ్ పడుతుందని ముందే అనుకున్నాం. ప్రభాస్ గారు కూడా ప్రశాంతంగా ఉండు డార్లింగ్, మనం కొత్త ప్రయత్నం చేశాం. కొంత టైమ్ పడుతుంది ఆడియెన్స్ కు చేరడానికి అని చెప్పారు.

## 'కొత్త మలుపు' ఫస్ట్ లుక్ లాంచ్



సంక్రాంతి పండుగను పురస్కరించు కుని ప్రేక్షకులకు ప్రత్యేక కానుకగా"కొత్త మలుపు సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ప్రముఖ గాయని సునీత తనయుడు ఆకాష్ హీరోగా, భైరవి అర్ధ్యా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం తథాస్తు క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతోంది. శివ వరప్రసాద్ కేశనకుర్తి దర్శకత్వంలో, తాటి బాలకృష్ణ నిర్మాణంలో రూపొందుతున్న ఈ సినిమాలో సీనియర్ నటులు రఘు బాబు, పృథ్వీ, ప్రభావతి తదితరులు కీలక పాత్రల్లో కనిపించను న్నారు. దర్శకుడు శివ వరప్రసాద్ కేశనకుర్తి మాటల్లో.. రొమాంటిక్ లవ్ సస్పెన్స్‌తో పాటు హాస్యరసాన్ని కలగలిపి ఈ చిత్రాన్ని రూపొందించాం. ఆకాష్-భైరవి జోడీ చాలా చక్కగా కుదిరింది. వీరు బావ-మరదలుగా నటిస్తున్నారు. సంక్రాంతి కానుకగా ఫస్ట్ లుక్ విడుదల చేశాం. త్వరలోనే సినిమా విడుదలకు సిద్ధమవుతాం. అని చెప్పారు.నిర్మాత తాటి బాలకృష్ణ మాట్లాడుతూ.. ఈ మూవీని పూర్తిగా విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిస్తున్నాం. గ్రామీణ నేపథ్యంతో, ప్రేమ-సస్పెన్స్-కామెడీ మేళవింపుతో రూపొందుతున్న "కొత్త మలుపు ఫస్ట్ లుక్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

## 'అనగనగా ఒక రాజు' బ్లాక్ బస్టర్



ఈ సంక్రాంతిని నవ్వుల పండుగలా మార్చడానికి 'అనగనగా ఒక రాజు' చిత్రంతో థియేటర్లలో అడుగుపెట్టారు స్టార్ ఎంటర్‌టైనర్ నవీన్ పొలిశెట్టి. మూడు వరుస ఘన విజయాలతో ప్రేక్షకుల హృదయా లలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నవీన్ పొలిశెట్టి కథానాయకుడిగా నటించిన ఈచిత్రాన్ని.. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. నూతన దర్శకుడు మారి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మీనాక్షిచౌదరి కథానాయిక. మిక్కీ జె మేయర్ సంగీతం అందించారు. భారీ అంచనాలతో సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'అనగనగా ఒక రాజు' చిత్రం.. మొదటి ఆట నుంచే అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంది. కడుపుబ్బా నవ్వించడమే కాకుండా, చివరిలో భావోద్వేగ సన్నివేశాలతో హృదయాలను హత్తుకొని.. అసలు సిసలైన పండగ సినిమాలా ఉందని 'అనగనగా ఒక రాజు' చూసిన ప్రతి ఒక్కరూ అభిప్రాయపడు తున్నారు. మొదటి షో నుంచే 'అనగనగా ఒక రాజు' సినిమాకి ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతుండ టంతో.. తాజాగా సక్సెస్ ప్రెస్ మీట్ నిర్వహించిన చిత్ర బృందం, ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలపడంతో పాటు తమ సంతోషాన్ని పంచుకుంది. స్టార్ ఎంటర్‌టైనర్ నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ.."ముందుగా అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. ఓవర్సీస్ లో ప్రీమియర్ షోల నుంచే అద్భుతమైన స్పందన లభించింది. థియేటర్‌లో ప్రతి ఒక్కరూ సినిమాని ఎంతగానో ఎంజాయ్ చేస్తున్నారు.

## కృష్ణారెడ్డి 43వ సినిమా 'వేదవ్యాస్'



తెలుగు చిత్ర పరిశ్రమలో హోల్ సమ్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్స్‌తో ఎన్నో ఘన విజయాలను అందించిన దిగ్గర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి 43వ సినిమా "వేదవ్యాస్". ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత కె.అచ్చిరెడ్డి సమర్పణలో సాయిప్రగతి ఫిలింస్ బ్యానర్ పై ప్రముఖ వ్యాపారవేత్త, పొలిటీషియన్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో సౌత్ కొరియా నటి జున్ హ్యున్ జీ హీరోయిన్ గా నటిస్తుండటం విశేషం. బుధవారం నిర్మాత కె.అచ్చిరెడ్డి బర్త్ డే పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం ఆయన పుట్టినరోజు వేడుకలతో పాటు "వేదవ్యాస్" హీరో పిడుగు విశ్వనాథ్ ను పరిచయం చేశారు. నటుడు సాయికుమార్ మాట్లాడుతూ అచ్చిరెడ్డి, కృష్ణారెడ్డి గారి సినిమాలో నేను నటించడం ఇదే తొలిసారి. అయితే వారి ఫస్ట్ డబ్బింగ్ మూవీ సూర్య ది గ్రేట్ కు నేనే డబ్బింగ్ చెప్పాను. అప్పటినుంచి వారితో మంచి అనుబంధం ఉంది. అయితే చాలాసార్లు వారి మూవీస్ కు డబ్బింగ్ చెప్పాను గానీ ఎందుకో నటించడం కుదరలేదు. ఈ చిత్రంతో నాకు ఆ అవకాశం రావడం సంతోషంగా ఉంది. "వేదవ్యాస్" సినిమాలో వేద నారాయణ అనే మంచి క్యారెక్టర్ లో నటిస్తున్నాను. నాలెడ్జ్ ఈజ్ డివైన్ అంటారు.




## డబ్ల్యూపిఎల్‌లో హర్మన్‌ప్రీత్ ఛేజింగ్
### గుజరాత్‌పై ముంబయి విజయం

**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2026లో హర్మన్‌ప్రీత్ మాస్టర్ క్లాస్ ముంబై ఇండియన్స్‌ను అత్యధిక విజయవంతమైన ఛేజింగ్‌కు నడిపించింది. డబ్ల్యూయపీఎల్‌లో ముంబై ఇండియన్స్ వరుసగా ఎనిమిదోసారి గుజరాత్ జెయింట్స్‌ను ఓడించింది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముంబై గుజరాత్‌పై 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. పవర్‌ప్లేలో ప్రస్తుత ఛాంపియన్లు 37/2తో పోరాటం చేస్తుండగా, మధ్యలోకి వెళ్లిన హర్మన్ అద్భుతమైన బ్యాటింగ్‌ను ప్రదర్శించింది. ఆమె ఇన్నింగ్స్‌లో 43 బంతుల్లో 7 బౌండరీలు, 2 సిక్సర్లతో అజేయంగా 71 పరుగులు చేసింది. అమన్‌జోత్ కౌర్ 26 బంతుల్లో 7 బౌండరీలతో 40 పరుగులు చేసింది. తరువాత నికోలా కారీ 23 బంతుల్లో అజేయంగా 38 పరుగులు చేసింది. ఇందులో రేణుకా ఠాకూర్ వేసిన 16వ ఓవర్‌లో 20 పరుగులు కూడా ఉన్నాయి.

ఈ రోజు ప్రారంభంలో, ముంబై ఇండియన్స్ టాస్ గెలిచి ముందుగా ఫీల్డింగ్ ఎంచుకుంది. గుజరాత్ జెయింట్స్ వారి 20 ఓవర్లలో 192/5 పరుగులు చేయడంతో ఈ నిర్ణయం ఎదురుదెబ్బ తగిలినట్లు అనిపించింది. కనికా అహుజా 18 బంతుల్లో 35 పరుగులు చేయగా, జార్జియా వేర్‌హామ్ 33 బంతుల్లో 43 అజేయంగా, భారతి ఫుల్మాలి 15 బంతుల్లో 36 పరుగులు చేసి జెయింట్స్ స్కోరును 190 దాటించారు. ముంబై ఇండియన్స్ విజయంతో గుజరాత్ జెయింట్స్‌పై జరిగిన మ్యాచ్‌లలో వారి ఎనిమిదో విజయం నమోదైంది.

### హాకీ ఇండియా లీగ్‌లో..
## బెంగాల్ టైగర్స్ హ్యాట్రిక్
### తమిళనాడు డ్రాగాన్స్‌పై 5-3 తో గెలుపు

**న్యూఢిల్లీ:** హాకీ ఇండియా లీగ్ (హెచ్‌ఐఎల్)-2025-26లో జరిగిన మ్యాచ్‌లో జుగ్‌రాజ్ సింగ్ హ్యాట్రిక్‌తో బెంగాల్ టైగర్స్ తమిళనాడు డ్రాగన్స్‌ను ఓడించింది. ఫలితంగా 53 తేడాతో విజయం సాధించిన తర్వాత బెంగాల్ టైగర్స్ పాయింట్ల పట్టికలో నాల్గవ స్థానానికి ఎగబాకింది. సుఖ్‌జీత్ (33వ నిముషం), అభిషేక్ (55) చేసిన గోల్స్ టైగర్స్‌ను విజేతగా నిలబెట్టడంలో సహాయపడ్డాయి. డ్రాగన్స్ తరపున అద్రోహిత్ ఎక్కా (36), థామస్ సోర్స్‌బై (48), బ్లేక్ గోవర్స్ (51) గోల్స్ చేశారు. డిఫెండింగ్ ఛాంపియన్స్ బెంగాల్ టైగర్స్ అభిషేక్ ఉల్లంఘన కారణంగా 11వ నిమిషంలో తమిళనాడు డ్రాగన్స్ పెనాల్టీ స్ట్రోక్ ఇచ్చింది. గత ఎడిషన్‌లో టాప్ స్కోరర్ అయిన జుగ్‌రాజ్ సింగ్, గోల్‌పోస్ట్‌లో లెజెండరీ డేవిడ్ హార్టేపై వత్తిడి తెచ్చి గోల్ చేశాడు. రెండో క్వార్టర్ గోల్



లేకుండా ముగిసినప్పటికీ, డ్రాగన్స్ గోల్ చేసి సమం చేయడానికి తమ శాయశక్తులా ప్రయత్నించింది. చివరికి సుఖ్జీత్ సమర్థవంతంగా ఎదుర్కొని గోల్ చేయడంతో టైగర్స్ స్కోరు 2-0కి చేరుకుంది. 36వ నిమిషంలో అద్రోహిత్ పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ చేయడంతో డ్రాగన్స్ ముందంజ వేసినప్పటికీ, క్వార్టర్ టైగర్స్ కే చెందింది. జుగ్రాజ్ సింగ్ వరుసగా (43, 45) రెండు హ్యాట్రిక్ గోల్స్ చేశాడు. దీనితో టైగర్స్ 4-1 ఆధిక్యంలో నిలిచింది. కానీ చివరి క్వార్టర్‌లో డ్రాగన్స్ సోర్స్‌బీ, గోవర్స్ ద్వారా (48, 51) రెండు గోల్స్‌తో పుంజుకోవడానికి వీలు కల్పించినా వారు దానిని వృధా చేశారు. 55వ నిమిషంలో పెనాల్టీ కార్నర్ ద్వారా అభిషేక్ గోల్ చేయడంతో టైగర్స్ విజయంలో కీలకమైంది.

# కోహ్లీ నం.1



**న్యూఢిల్లీ:** వన్డే వరల్డ్ ర్యాంకింగ్స్‌లో భారత బ్యాటర్ విరాట్ కోహ్లీ రోహిత్ శర్మను వెనక్కి నెట్టి నంబర్ 1 స్థానాన్ని తిరిగి పొందాడు. కోహ్లీ తొలిసారిగా అక్టోబర్ 2013లో అగ్రస్థానానికి చేరుకున్నాడు. తొలి వన్డేలో న్యూజిలాండ్ మ్యాచ్‌లో 91 బంతుల్లో 93 పరుగులు చేసిన కోహ్లీ ఆతిథ్య జట్టు లక్ష్యాన్ని ఛేదించడానికి సహాయపడ్డాడు. అలాగే న్యూజిలాండ్‌పై ఈ వన్డేలో భారత్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించిన తర్వాత రోహిత్ శర్మ 3వ స్థానానికి పడిపోయాడు. ఆల్ రౌండర్ డారిల్ మిచెల్ తొలి వన్డేలో 84 పరుగులతో అత్యధిక రేటింగ్‌ను సాధించడం ద్వారా ఈ ర్యాకింగ్స్‌లో ఎగబాకాడు. డెవాన్ కాన్వే 3 మెరుగుపరుచుకుని 29వ స్థానానికి చేరాడు. బౌలర్ల ర్యాంకింగ్‌లో మహమ్మద్ సిరాజ్ అద్భుత ప్రదర్శనతో 5 ఎగబాకి 15వ స్థానానికి చేరుకుని బంగ్లాదేశ్‌కు చెందిన మెహిదీ హసన్ మీరాజ్‌తో సమంగా ఉన్నాడు. భారత్‌పై 4 వికెట్లు పడగొట్టి తన కెరీర్‌లో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనను సాధించడంతో పేసర్ కైల్ జామిసన్ 27 స్థానాలు ఎగబాకి భారత బౌలర్ అర్ష్‌దీప్ సింగ్‌తో 69వ స్థానాన్ని పంచుకున్నాడు. ఇక యాషెస్ సిరీస్ ముగిసిన తర్వాత పలువురు స్ట్రేలియన్ ఆటగాళ్ళు తమ స్థానాలను మెరుగుపరుచుకున్నారు, ఇంగ్లాండ్‌తో జరిగిన హై ప్రొఫైల్ టెస్ట్ సిరీస్‌లో ట్రావిస్ హెడ్ టాప్ స్కోరర్‌గా నిలిచిన తర్వాత ఏడు ఎగబాకి మూడవ స్థానానికి, పాకిస్థాన్‌తో జరిగిన సిరీస్‌ను డ్రాగా ముగించిన టీ20లో శ్రీలంక ప్లేయర్ వానిందు హసరంగా ఈ బౌలర్ ర్యాంకింగ్స్‌లో 3 ఎగబాకి 2వ స్థానానికి చేరుకున్నాడు. ఆల్ రౌండర్ల జాబితాలో, సైమ్ అయూబ్ ఒక స్థానం దిగజారగా, జింబా బ్వేకు చెందిన సికందర్ రజా తిరిగి అగ్రస్థానాన్ని పొందాడు.



వన్డే ర్యాంకులో 3కు పడిపోయిన రోహిత్

## ఇండియా ఓపెన్‌లో ఓటమితో సింధు నిష్క్రమణ
### రెండో రౌండ్‌కు ప్రణయ్, శ్రీకాంత్

న్యూఢిల్లీ: యోనెక్స్ సన్‌రైజ్ ఇండియా ఓపెన్-2026 ప్రారంభ రోజున ప్రపంచ మాజీ ఛాంపియన్, భారత్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధు ఓటమితో టోర్నీ నుండి నిష్క్రమించింది. అదే సమయంలో హెచ్‌ఎస్ ప్రణయ్, కిదాంబి శ్రీకాంత్ యువ ప్రత్యర్థులను అధిగమించి పురుషుల సింగిల్స్‌లో రెండవ రౌండ్‌కు చేరుకున్నారు.






సొంతగడ్డపై బుధవారం జరిగిన ఈ టోర్నీలో సింధు తొలి రౌండ్‌లోనే ఓడిపోయింది. ఇది ఆమె అతి తక్కువ ఓటమిలలో ఒకటి. ఆమె వియత్నాంకు చెందిన గుయెన్ థుయ్ లిన్ చేతిలో 20-22, 21-12, 21-15 తేడాతో ఓటమిపాలైంది. అంతకుముందు మలేషియా ఓపెన్ 2026లో సెమీఫైనల్‌కు చేరుకున్నప్పటికీ, అక్కడ కూడా ఓటమి పాలైంది. ఇప్పు డు ఇండియా ఓపెన్‌లో ఈతొలి రౌండ్ ఓటమి ఆమెకు పెద్ద షాక్ ఇచ్చినట్లయింది. ఇక మాజీ ఛాంపి యన్ శ్రీకాంత్ భారత్‌కే చెందిన ఎం తరుణ్‌ను 15-21, 21-6, 21-19 తేడాతో మొదటి రౌండ్ పోరులో ఓడించాడు. తొలి గేమ్‌ను వదులుకున్న తర్వాత, శ్రీకాంత్ రెండవ గేమ్‌లో 53 నిమిషాల్లో విజయాన్ని సాధించాడు. అలాగే ప్రపంచ మూడో నంబర్ ఆటగాడు ఆండర్స్ ఆంటోన్సెన్ వైదొలగడం తో ప్రణయ్ ఆలస్యంగా డ్రాలోకి ప్రవేశించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. 33 ఏళ్ల ఈ ఆటగాడు హాంకాంగ్‌కు చెందిన లీ చెయుక్ యియును 22-20, 21-18 తేడాతో ఓడించాడు. ప్రపంచ ర్యాంక్‌లో 38వ స్థానంలో ఉన్న ప్రణయ్‌ఓపెనర్‌లో వరుసగేమ్‌లలో మ్యాచ్‌ను ముగించి 2 గేమ్ పాయిం ట్లను కాపాడుకున్నాడు. ఇక మహిళల సింగిల్స్‌లో భారత్ తరఫున పోటీలో ముందంజ వేసిన ఏకైక మహిళ మాళవిక బన్సోడ్. చైనీస్ తైపీకి చెందిన పై యు పో ను 21-18, 21-19 తేడాతో ఓడించింది.

## మహిళల ప్రీమియర్ లీగ్‌లో వికెట్ల స్టార్స్
### భారత్ నుండి శిఖా







**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపిఎల్)-2026 మూడో ఎడిషన్ ప్రస్తుతం ఉత్కంఠభరింతగా సాగుతోంది. భారత్‌లోని కొన్ని ట్రాక్‌లపై బౌలింగ్ చేయడం కష్టంగా ఉటుంది. స్పిన్నర్లు సాధారణంగా నెమ్మదిగా, తక్కువ ఉపరితలాల నుండి కొంత డ్రిఫ్ట్ మరియు స్పిన్ పొందుతారు, అయితే పేసర్లు కొన్ని సందర్భాల్లో బ్యాటర్లను వేగవంతం చేయడానికి, కొత్త బంతితో స్వింగ్ పొందడానికి వేగాన్ని ఉపయోగిస్తారు. ఈ నేపథ్యంలో డబ్ల్యూపిఎల్‌లో అత్యధితక వికెట్లు తీయడం చాలా క్లిష్టతరం. డబ్ల్యూపిఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన టాప్ 5 బౌలర్లు విదేశీయులే ఉన్నారు. ముంబై ఇండియన్స్ జట్టులో హేలీ మాథ్యూస్ అత్యంత ముఖ్యమైన ప్లేయర్లలో ఒకరిగా ఉంది. కీలకమైన సమయాల్లో బ్యాటింగ్ మరియు బంతితో ఆమె ద్వంద్వ ప్రదర్శనలు ఇచ్చి జట్టును అనేక సందర్భాల్లో ఇబ్బందుల నుండి బయట పడేసింది. 29 ఇన్నింగ్స్‌లలో 17.56 సగటుతో 41 వికెట్లు పడగొట్టింది. ఆమె అత్యుత్తమ బంతి ప్రదర్శన సీజన్ 2025లో వచ్చింది. ఆమె పది ఇన్నింగ్స్‌లలో 18 వికెట్లు పడగొట్టింది. (ముంబై ఇండియన్స్) ముంబై ఇండియన్స్ విజయానికి కారకులైన వారిలో అమేలియా కెర్ ఒకరు. న్యూజిలాండ్ ఆల్ రౌండర్ 29 ఇన్నింగ్స్‌లలో 18 కంటే తక్కువ సగటుతో మరియు7.64 ఎకానమీ రేటుతో మొత్తం నలభై వికెట్లు పడగొట్టింది. అలాగే ఇంగ్లాండ్ కు చెందిన స్పిన్నర్ సోఫీ ఎక్లెస్టోన్ యూపీ వారియర్జ్ తరపున మూడు సీజన్లలో 3వ అత్యధిక వికెట్లుతీసిన బౌలర్‌గా కొనసాగుతోంది. ఆమె 25 ఇన్నింగ్స్‌లలో 18.38 సగటు మరియు 16.50 స్ట్రైక్ రేట్‌తో మొత్తం 36 వికెట్లు పడగొట్టింది. ఆమె బంతితో అత్యుత్తమ నాణ్యత ఏమిటంటే, ఆమె ఎకానమీ రేటు ఏడు కంటే తక్కువగా ఉంది. భారత్ విషయానికొస్తే ఇక శిఖా పాండే బ్లూ బ్రిగేడ్ తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా 27 ఇన్నింగ్స్‌లలో 23.20 సగటుతో మరియు 20 స్ట్రైక్ రేట్‌తో ఏడు కంటే తక్కువ ఎకానమీ రేటుతో 30 వికెట్లు పడగొట్టింది. ఆమె ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో ఫ్లైట్ లెఫ్టినెంట్ (ప్రస్తుతం స్క్వాడ్రన్ లీడర్) కూడా. ఈ ప్రత్యేకత ఆమెను ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్ మరియు జాతీయ క్రికెటర్ అనే రెండు పాత్రలు పోషించే అరుదైన వ్యక్తిగా నిలబెట్టింది, ఇక ప్రస్తుత డబ్ల్యూపిఎల్ 2026 సీజన్‌కు వస్తే ఇప్పటి వరకూ అత్యధిక వికెట్లు తీసిన వారిలో నందిని శర్మ అగ్రస్థానంలో ఉంది. భారత్ నుండి నందిని శర్మ (ఢిల్లీ క్యాపిటల్స్) హ్యాట్రిక్ సాధించి సంచలనం సృష్టించింది. ఒకే ఓవర్లో నాలుగు వికెట్లు తీసి రికార్డు సృష్టించింది. ఈ సీజనులో మొత్తంగా నందిని 7 వికెట్లతో అగ్రస్థానంలో ఉండగా, ముంబై ఇండియన్స్ ప్లేయర్ అమేలియా కెర్ 6 వికెట్లతో రెండవ స్థానంలో ఉంది.

# రెండోరోజూ దిగజారిన సూచీలు
### లాభాల స్వీకరణలో ఇన్వెస్టర్లు



వాణిజ్యం

**ముంబయి,జనవరి 14:** భౌగోళిక ఉద్రిక్తతలకు తోడు ఇండో అమెరికాట్రేడ్‌చర్చలు, ట్రంప్ సుంకాలపై అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పులు వంటి వాటితో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. దీనితో బెంచ్‌మార్క్ ఈక్విటీ సూచీలు దిగువస్థాయిలోనే ముగిసాయి. సంస్థాగత ఇన్వెస్టర్ల అమ్మకాలకుతోడు ఫ్యూచర్స్ ఆప్షన్స్ కాలపరిమితి ముగియడంకూడా ఇన్వెస్టర్లు లాభాలస్వీకరణకు తోడయింది. నిఫ్టీ 25,700 స్థాయికంటేదిగువనే ముగిసింది. ఐటి ఆటోమొబైల్‌స్టాక్స్ భారీగా క్షీణిస్తే మెటల్, పిఎస్‌యు బ్యాంకులు కొనుగోలు ఆసక్తిని పెంచాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 244.98 పాయింట్లు క్షీణించి 83,382.71 పాయింట్లవద్ద స్థిరపడిందే,నిఫ్టీ 50 సూచీ 66.70 పాయింట్లు క్షీణించి 25,665.60 పాయింట్లవద్ద ట్రేడింగ్‌ముగించింది. వరుసగా రెండురోజుల ట్రేడింగ్‌ల్లో సెన్సెక్స్ 0.60శాతం, నిఫ్టీ 0.48శాతం క్షీణించాయి. కోటక్ బ్యాంకు 1.48శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 1.42శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.32శాతం చొప్పున నిఫ్టీలో వెనకబడ్డాయి. బిఎస్‌ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.16శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.25శాతం చొప్పున పెరిగాయి. మార్కెట్లపరంగా బిఎస్‌ఇలో 2017 షేర్లు పెరిగితే 2150 షేర్లుక్షీణించగా 178 కంపెనీలషేర్లు యధాతథంగా కొనసా గాయి. మహారాష్ట్ర మున్సిపల్‌ఎన్నికల సంద ర్భంగా 15వ తేదీ మార్కెట్లు మూతపడతాయి. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు 90.23గా చెలామణి అయితే ఎంసిఎక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ ఫిబ్రవరి 5నాటి సెటిల్‌మెంట్లు 0.74 శాతం పెరిగి రూ.1,43,299గా ఉన్నాయి. కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్ ముడి చమురు 18 సెంట్లుపెరిగి బ్యారెల్‌కు 65.65 డాలర్లుగా నడిచింది. ఇక షేర్లపరంగాచూస్తే ఇన్ఫోసిస్ 0.07శాతంపెరిగింది. ఎల్‌అండ్‌టి 0.58శాం క్షీణించింది. జస్ట్‌డయల్ 2.05శాతం, టాటా ఎలిక్సీ 5.08శాతం క్షీణిస్తే 5పైసా క్యాపిటల్ 7.60శాతం పెరిగింది. కంపెనీ 23.98శాతం నికరలాభాల్లో క్షీణత ప్రకటించింది. ఇక పూర్వాంకారా 9.82శాతం పెరిగింది. బిలియన్ బ్రెయిన్స్ గారేజ్ వెంచర్స్ గ్రో కంపెనీ 0.95శాతం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 8.03శాతం, ఐఒబి 1.83శాతం పెరిగాయి. ఇక మినీ డైమండ్స్ ఇండియా 2.78శాతం,కోల్టేపాటిల్ డెవలపర్స్ 1.02శాతం పెరిగితే రెస్పాన్సివ్ ఇండస్ట్రీస్1.78 శాతం క్షీణించాయి. ఒస్వాల్‌పంప్స్ 1.16శాతం, గారెనమంట్‌మంత్ర లైఫ్‌స్టైటల్ 3.48శాతం, అజ్మీరా రియాల్టీ అండ్ ఇన్‌ఫ్రా ఇండియా 1.95శాతం చొప్పున పెరిగాయి.



## 28% క్షీణించిన గ్రో మాతృ సంస్థ లాభాలు

**ముంబయి, జనవరి 14:** ఆన్‌లైన్‌ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ గ్రో మాతృసంస్థ బిలియన్ బ్రెయిన్స్ గారేజ్ వెంచర్స్ నికరలాభం 28శాతం క్షీణించి రూ.547 కోట్లకు చేరింది. అయితే కంపెనీ రాబడులు మాత్రం 25శాతం పెరిగాయి. గత ఏడాది మూడోత్రైమాసికంలో 757.11 కోట్లు ఆర్జించిన సంస్థ ఈ సారి గణనీయంగా లాభాల పతనం చవిచూసింది. ఒక్కసారి దీర్ఘకాలికప్రోత్సాహకాల భారం పెరిగిందని కంపెనీ చెపుతోంది. ఈ మొత్తం తీసివేస్తే కంపెనీ మూడోత్రైమాసిక లాభం 24శాతంపెరిగిందని చెపుతోంది. క్రమానుగతంగా చూస్తే గ్రో నికరలాభం 16శాతంపెరిగి 471.34కోట్లు రెండోత్రైమాసికంలో నమోదుచేసింది. బ్రోకరేజి సంస్థ రాబడులు 25శాతం పెరిగి 1216.07 కోట్లకు చేరాయి.క్రియాశీలక వినియోగదారుల పెరుగుతూ వచ్చారు. ప్రస్తుత కస్టమర్లకు తోడు కొత్త వారి రాక పెరిగిందని, 7.5 శాతంపెరిగిందని గత నాలుగు త్రైమాసికాలతో పోలిస్తే భారీ వృద్ధినమోదయినట్లు కంపెనీ చెపుతోంది. కమోడిటీ డెరివేటివ్స్, మార్జిన్‌ట్రేడింగ్ ఫెసిలిటీ, సెక్యూరిటీలపై రుణాలు, ఫిన్‌డమ్ వంటి విభాగాలనుంచే 50శాతం రాబడులున్నట్లు వెల్లడించింది. అంతేకాకుండా అమెరికా కేంద్రంగా ఉన్న స్టేట్‌స్ట్రీట్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ రూ.580 కోట్లు పెట్టుబడి పెడుతున్నదని గ్రో వెల్లడించింది. కంపెనీలో 23శాం వాటాను తీసుకుంటున్నదని, అయితే ఇందుకు అనుమతులు రావాలిస ఉందని తెలిపింది డిసెంబరునాటికి కంపెనీ నిర్వహణ వాణిజ్యం రూ.4118.8 కోట్లుగా ఉందని, 1.2 మిలియన్లమంది కస్టమర్ ఇన్వెస్టర్లు ఉన్నట్లు చెప్పింది. త్రైమాసిక ఫలితాలు వెల్లడించిన తర్వాత కంపెనీ షేర్లు 3.3శాతం పెరిగి 168.1 రూపాయలుగా బిఎస్‌ఇలో ట్రేడ్ అయ్యాయి.

## ఇన్ఫోసిస్ నికరలాభం రూ.6654కోట్లు



**బెంగళూరు, జనవరి 14:** ఐటిసేవల మేజం కంపెనీ ఇన్ఫోసిస్ తన నికరలాభాల్లో 2.2శాతం క్షీణించినట్లు ప్రకటించింది. అంతకుముందు ఏడాది మూడో త్రైమాసికంలో 6806 కోట్లు ఆర్జించిన కంపెనీ ఈసారి మూడోత్రైమాసికంలో రూ.6654 కోట్లు రాబట్టుకోగలిగింది. కంపెనీ రాబడులు 8.89శాతం పెరిగి 45,479 కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలానికి 41,764 కోట్లు వచ్చాయి. కార్యకలాపాలద్వారా రూ.44,490 కోట్లు సాధించింది. 2.22శాతం పెరిగింది. మొత్తం క్యూ3లో రాబడులు 46,618 కోట్లుగా ఉన్నాయి. అదే వార్షికపద్ధతిన చూస్తే 42,623 కోట్లకంటే ఎక్కువగా ఉంది.9.37శాతం పెరిగినట్లు ప్రకటించింది. త్రైమాసికం వారీగాచూస్తే మొత్తం ఆదాయ వరులు 2.52శాతం పెరిగింది. 45,472 కోట్లుగా 2024 తొలిత్రైమాసికంలో నమోదయింది. మూడోత్రైమాసికం చివరినాటికి కంపెనీ కాంట్రాక్టు విలువలు 4.8 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. కొత్తకాంట్రాక్టులద్వారానే 57శాతం రాబడులున్నట్లు తేలింది. కార్మికుల సరంగా 5043 మంది ఉద్యోగులు పెరిగారు. కంపెనీని మారి వెళుతున్న వారు 12.3శాతం వరకూ ఉన్నారు. అదే అంతకుముందు త్రైమాసికంలో 14.3శాతం ఉంటే ఏడాది క్రితం ఇదే కాలంలో 13.75శాతంగా ఉంది. కంపెనీ ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ సిస్టవ్ ఆపరేటింగ్ మార్జిన్ 18.4శాతంగా ఉంది. సవరించిన మార్జిన్ 21.2శాతంగా ఉన్నట్లు తేలింది.ఐఎఫ్‌ఆర్‌ఎస్ బేసిక్ ఆదాయవనరులు ఒక్కోషేరుకు రూ.16.17గా ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది. ఇన్ఫోసిస్ షేర్లు బిఎస్‌ఇలో 1608.90గా ట్రేడ్ అయ్యాయి.

## యూనియన్ బ్యాంకు నికరలాభం రూ.5017 కోట్లు



**ముంబయి, జనవరి 14:** ప్రభుత్వరంగంలోని యూనియన్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బుధవారం తన నికరలాభాలు మూడోత్రైమాసికంలో 9శాతం పెరిగినట్లు ప్రకటించింది. డిసెంబరు త్రైమాసికంలో గత ఏడాది ఆర్జించిన 4,603.63 కోట్ల కంటే ఈసారి 5017 కోట్లకు పెరిగినట్లు బ్యాంకు ప్రకటించింది. బ్యాంకునికరవడ్డీ ఆదాయం ఒకటిశాతంపెరిగి 9328 కోట్లుగా ఉంది. అదే గత ఏడాది రూ.9241కోట్లు వచ్చిం దని బ్యాంకు ప్రకటించింది. యూనియన్‌బ్యాంకు ఈత్రైమాసికంలో మొత్తం వాణిజ్యం 5.04శాతం పెరిగింది. స్థూల అడ్వాన్సులు 7.13శాతం పెరిగితే మొత్తం డిపాజిట్లు 3.36శాతం పెరిగాయి. 2025 డిసెంబరు 31వ తేదీనాటికి బ్యాంకు మొత్తం బిజినెస్ 22.40 లక్షలకోట్లకు ఉన్నదని ప్రకటించింది. స్థిరాస్తిప్రమాణాలు స్పష్టమైన మెరుగుదలనుసూచించింది. స్థూల నిరర్థక ఆస్తులు 79 బేసిస్ పాయింట్లు క్షీణించి 3.06శాతానికి చేరాయి. నికర ఎన్పీఎలు కూడా 31 బేసిస్‌పాయింట్లు క్షీణించి 0.51శాతంగా ఉన్నట్లు బ్యాంకు వెల్లడించింది. డిపాజిట్లపరంగా గ్లోబల్ డిపిజాట్లు 3.36శాతంపెరిగాయి. బ్యాంకు మొత్తం డిపాజిట్‌బేస్ రూ.12.23 లక్షల కోట్లుగా ఉన్నట్లు యూనియన్ బ్యాంకు వివరించింది.

## పసిడి, వెండి ధరల 'ఫ్యూచర్స్' ర్యాలీ



**ముంబయి, జనవరి 14:**ఫ్యూచర్‌మార్కెట్లో బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. భౌగోళిక ఉద్రిక్తతలతో పాటు అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు ఖరీదైన లోహాల ధరల పెరుగు దలకు దోహదపడ్డాయి. ఇరాన్‌లో పౌరుల ఆందోళనలు, ఉక్రెయిన్‌రష్యా మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు బంగారం, వెండి ధరలపెరుగుదలకు సాలనుకూలం అయినట్లు బులియన్ నిపుణులు పేర్కొంటున్నారు. ఫ్యూచర్ మార్కెట్‌లో కిలో వెండి ధర ఒక్కరోజే రూ.12 వేలకు పైగా పెరగగా, కొత్త సంవత్సరంలో రూ.52 వేలు పెరగడం విశేషం. ఫ్యూచర్ మార్కెట్‌లో కిలో వెండి ధర మార్చి డెలివరీ కాంట్రాక్ట్ ఈరోజు రూ.12,803 పెరిగి రూ.2.87 లక్షలకు చేరుకుంది. బంగారం 10 గ్రాములు రూ.1.43 లక్షల వద్ద ట్రేడ్ అవుతోంది. వెండి ధర నాలుగు రోజుల్లోనే రూ.35 వేలు పెరిగింది. గత ఏడాది డిసెంబర్ 31 నాటికి రూ.2.35 లక్షలుగా ఉన్న వెండి ధర 2026లో రూ.52 వేలు పెరిగింది. ఫ్యూచర్ మార్కెట్‌లో బంగారం ఫిబ్రవరి కాంట్రాక్ట్ ఒక్కరోజులో రూ.932 పెరిగి రూ.1.43 లక్షలకు చేరుకుని సరి కొత్త రికార్డును నమోదు చేసింది. స్పాట్ బంగారం ధర హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల స్పాట్ గోల్డ్ ధర రూ.1,47,600, 22 క్యారెట్ల పసిడి రూ.1,31,650గా నమోదయింది. స్పాట్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2,88,300గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం ధర రూ.4,638.75 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతుండగా, వెండి డాలర్ల 90 డాలర్ల ఎగువన కొనసాగుతోంది.

## ఇసిఐ ఐపిఒకు సెబీ గ్రీన్‌సిగ్నల్



**ముంబయి, జనవరి 14:** వర్క్‌స్పేస్ సొల్యూషన్స్ అందించే ఎగ్జిక్యూటివ్‌సెంటర్ ఇండియా సెబీ వద్ద దాఖలు చేసిన ఐపిఒకు ఆమోదం లభించింది. రెండురూపాయల ముఖవిలువకలిగిన ఈక్విటీషేర్లను 2600 కోట్ల విలువైనవాటినిఐపిఒకు తెస్తోంది. ఈ ఐపిఒ నికర రాబడులు టెక్ అంఊదాబిలో పెట్టుబడులు పెట్టేందుకు వినియోగించనున్న సంస్థ మరికొంత టెక్‌ఎస్‌జిపి, టెక్ దుబాయికొనుగోలుకు కూడా వినియోగించనున్నట్లు ప్రకటించింది. అంతర్గత పునర్వ్యవస్థీకరణ ఒప్పందం ప్రకారమే ఈ వీల్ జరుగుతుందని కంపెనీ ప్రక టించింది. రాబడులు ప్రధానంగా సాధారణ కార్పొరేట్‌ప్రయోజనాలకోసమే వినియోగిస్తామని చెప్పింది. ఎక్యూటివ్‌సెంటర్ ఇండియా (ఇసిఐ) 2008 నుంచి కార్యకలాపాలునిర్వహిస్తోంది. ఆసియా కార్యకలా పాలతోపాటు భారత్, సింగపూర్, మధ్యప్రాచ్యం, దుబాయి, అబూదాబి, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇతర ఆసియా మార్కెట్లు జకార్తా, హోచిమిన్ వియత్నాం, మనిలా కొలంబో వంటి నగరాల్లోకూడా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ముందు నిర్మాణంలో ఉన్నవాటిని లీజుకు తీసుకుని వాటిని కార్పొరేట్ అవసరాలకు అనుగుణంగా మార్పులుచేసి తిరిగి లీజుకు వస్తుంది. గత ఏడాది మార్చి నాటికి కంపెనీ పోర్టుఫోలియో మొత్తం 89 ఆపరేషనల్ కేంద్రాలున్నాయి. ఏడుదేశాల్లోని 14 నగరాల్లో ఈసీఐ వ్యాప్తిచెందింది.

## జపాన్ ఎస్‌ఎంబిసి బ్యాంకు ఏర్పాటుకు ఆర్బీఐ ఓకే

**ముంబయి, జనవరి 14:** జపాన్ సుమితోమో మిత్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్(ఎస్‌ఎంబిసి)కి భారత్‌లో సొం తంగా శాఖను ఏర్పాటుచేసుకునేందుకు రిజర్వుబ్యాంకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. విదేశీ బ్యాంకులు తమ సొంత శాఖలను భారత్‌లో ఏర్పాటు చేసేందుకు రూపొందించిన ఆర్బీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ అనుమతులు చెప్పినట్లు తేలింది. ఎస్‌ఎంబిసి ప్రస్తుతం భారత్‌లో బ్యాంకింగ్ బిజినెస్ చేస్తోంది.

న్యూఢిల్లీ,ముంబయి, చెన్నై, బెంగళూరు నగరాల్లో తన శాఖలునిర్వహిస్తున్నట్లు ఆర్బీఐ తెలిపింది. పూర్తిస్థాయి సొంతంగా బ్యాంకు ఏర్పాటుకు అనుమతించినట్లు ఆర్బీఐ ప్రకటించింది. అలాగే వీటి ప్రస్తుత బ్యాంకు శాఖలను కూడా ఈ బ్యాంకులో విలీనంచేస్తుంది. ఈప్రాతిపదికన ఎస్‌ఎంబిసికి లైసెన్సు ఇచ్చేందుకు ఆర్బీఐ బ్యాంకుకు ఆమోదం తెలిపింది. అన్ని నిబంధనలు భర్తీ అయిన తర్వాత మాత్రమే జపాన్ దేశపు బ్యాంకుకు పూర్తిస్థాయిలో బ్యాంకుగా అవతరించేందుకు లైసెన్సులిస్తామని ప్రకటించింది. బ్యాంకింగ్ రంగంలో పెట్టుబడులు పెంచుకోవడంద్వారా ఎస్‌ఎంబిసి భారత్‌లో తన పరిధిని పెంచుకుంది. గత ఏడాది ఎస్‌బ్యాంకులో మెజార్టీ వాటాను కొనుగోలుచేసింది. కార్లైల్‌గ్రూప్, ఇతర బ్యాంకుల్లో కూడా వాటాలు కొననుగోలుచేసింది. 24.2శాతం వాటా కొనుగోలుకు ఆర్బీఐ కూడా అనుమతులు జారీచేసింది. బారత్‌లో తమ బ్యాంకు విస్తరణకు అవకాశాలు ఎక్కువ ఉన్నందున భారత్‌లోనే విదేశీ బ్యాంకుగా ఏర్పాటు చేసుకునేందుకు ఆర్బీఐకి దరఖాస్తుచేసింది. ఇందులోభాగంగానే ఆర్బీఐ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని సమాచారం.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.